గురువారం
07-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 317
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad, Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

70 మంది దిల్లీ ఎమ్మెల్యేలకు ఐఫోన్లు

న్యూదిల్లీ: ప్రభుత్వం కాగిత రహిత పాలనలో తీసుకొచ్చిన మొదటి చర్యగా దిల్లీ అసెంబ్లీలోని 70 మంది ఎమ్మెల్యేకు సరికొత్త ఐఫోన్ అందజేసినట్లు విధానసభ సెక్రటేరియట్ అధికారి ఒకరు తెలిపారు. ఎమ్మెల్యేలందరూ ఇప్పటి నుంచి వారివారి అధికారిక కార్యక్రమాల్లో వీటిని వినియోగిస్తారని పేర్కొన్నారు. సీఎం రేఖా గుప్తా సహా అందరు ఎమ్మెల్యేలకు ఐఫోన్లతో పాటు ఐప్యాడ్‌లు, టాబ్లెట్‌లు అందజేశారు. టెక్-ఆధారిత పరిజ్ఞానం, కాగిత రహిత పాలనపై ప్రజాప్రతినిధులకు అవగాహన తీసుకురావడంలో భాగంగా దిల్లీ అసెంబ్లీలో ఎమ్మెల్యేలకు ఈ స్మార్ట్‌ఫోన్‌లు అందజేసినట్లు ఓ జాతీయ మీడియా సంస్థ నివేదిక స్పష్టం చేసింది.

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

రాంచి: కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఆరేళ్ల క్రితం నాటి ఈ కేసులో జార్ఖండ్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టు తాజాగా బెయిల్ మంజూరు చేసింది. జార్ఖండ్ హైకోర్టు ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరయ్యారని రాహుల్ తరపు న్యాయవాది మీడియాకు వెల్లడించారు. న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసిందని, ఈ విషయాన్ని తాము మరింత ముందుకుతీసుకువెళ్తామని అన్నారు. 2018లో జార్ఖండ్‌లోని చైబాసా ప్రాంతంలో జరిగిన

- మిగతా 2 లో

31న చైనాకు మోదీ

న్యూదిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొంటారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయిన విషయం తెలిసిందే.

రాజకీయం కోసం కోర్టును వాడుకోవద్దు

న్యూదిల్లీ: 'స్టాలిన్ విత్ యూ(ఉంగలదాన్) కార్యక్రమం విషయంలో అన్నాడీఎంకేకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఆ ప్రకటనల్లో సీఎం ఫొటో, పేరు ఉండడంలో ఎలాంటి అభ్యంతరాలు లేవని బుధవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గతంలో మద్రాస్ హైకోర్టు తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పును కొట్టేసింది. పిటిషనర్ అన్నాడీఎంకే సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వీసీ షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా విధిస్తూ మందలించింది. మద్రాస్ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారించింది.

ఇదీ లోకం!



రక్షించండ్రో! కాపాడండ్రో! మీకు పుణ్యముంటుందిరో!

'బీసీ' బిల్లు ఆమోదించే వరకు

పోరాటం ఆగదు

- తేల్చుకోవాలనే 'చలో దిల్లీ' చేపట్టాం
- బలహీనవర్గాలకు మోదీ అన్యాయం
- ప్రధాని ఒత్తిడితోనే లభించని రాష్ట్రపతి అనుమతి
- తెలంగాణలో కులగణన దేశానికే ఆదర్శం
- జంతర్ మంతర్ వద్ద ధర్నాలో రేవంత్



విశాలాంధ్ర - హైదరాబాద్: దేశ ప్రధాని మోదీ, బీజేపీ... బీసీ రిజర్వేషన్‌ల బిల్లులను అడ్డుకుని బలహీనవర్గాలకు అన్యాయం చేస్తుంటే గల్లీలో ఉండలేక దిల్లీలోనే తేల్చుకుందామని ఇక్కడికి వచ్చామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మోదీ మెడలు వంచైనా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం కొనసాగిస్తామని శపథం చేశారు. దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం వన్ వాయిస్... వన్ విజన్... యునైటెడ్ బీసీ నినాదంతో తెలంగాణ పీసీసీ అధ్వర్యంలో మహా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలు, విద్యా ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించి తీరతామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించకుండా రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ బిల్లులు ఆమోదం పొందే వరకు తాము నిద్రపోమని స్పష్టం చేశారు. బలహీన వర్గాలపై కక్షగట్టిన మాజీ సీఎం కేసీఆర్ 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు. నాడు కేసీఆర్ చేసిన చట్టం నేడు రిజర్వేషన్లకు గుదిబండగా మారిందని అన్నారు. తెలంగాణలో బలహీన వర్గాల బిడ్డలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు కాకుండా అడ్డుగా ఉన్న చట్టాన్ని తొలగిస్తామన్నారు. దిల్లీలో ధర్నా చేయడంతోనే కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఇండియా ఐక్యసంఘటన పార్టీలైన సమాజ్‌వాదీ, డీఎంకే, ఎన్సీపీ, వామపక్షాలకు చెందిన వంద మంది ఎంపీలు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలియజేశారని వివరించారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు అండగా ఉంటామని ఉత్తరప్రదేశ్, బీహార్, మహారాష్ట్ర, రాజస్థాన్, కేరళ రాష్ట్రాల ఎంపీలు మనకు మద్దతు ఇచ్చారన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని భారత్ జోడో యాత్ర సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని... ఆ హామీ మేరకు ఏడాదికాలంలోనే కుల గణన చేపట్టి... బీసీ రిజర్వేషన్ల బిల్లులను శాసనసభలో ఆమోదించామని సీఎం తెలిపారు. బీసీ రిజర్వేషన్లను ఆమోదించకుంటే మోదీని గద్దె దించుతామని హెచ్చరించారు. గోద్రా అల్లర్ల సమయంలో రాజీనామా చేయమని నాటి ప్రధానమంత్రి వాజ్‌పేయ్... మోదీని కోరితే చేయలేదని... ఇప్పుడు 75 ఏళ్లు నిండినందున పదవి నుంచి వైదొలగాలని ఆర్‌ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భగవత్ కోరుతున్నా మోదీ పట్టించుకోవడం లేదన్నారు. ఈసారి బీజేపీకి 150 సీట్లు దాటవని సీఎం అన్నారు. రిజర్వేషన్లను మోదీ అడ్డుకుంటే ఆయనను గద్దె దించి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసి తమ డిమాండ్‌ను నెరవేర్చుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి తెలంగాణ బీసీల అవసరం లేదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు ఎందుకు రాలేదని, ఆ పార్టీ తెలంగాణతో పేరు బంధంతో పాటు పేగు బంధం కూడా తెంచుకుందా అని సీఎం ప్రశ్నించారు. ధర్నాను కేటీఆర్ డ్రామా అంటున్నారని... కేటీఆర్ పేరే డ్రామారావని... కేసీఆర్ కుటుంబం డ్రామాలతో బతుకుతోందని సీఎం విమర్శించారు. ఆ కుటుంబంలోనే ఒకరు రిజర్వేషన్లకు అనుకూలమని.... మరొకరు ప్రతికూలమని... మరొకరు అటూ ఇటూ కాకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రపతి దగ్గర ఉన్న బిల్లులు తక్షణమే ఆమోదం పొందేలా చూడాలని... లేకుంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు బీజేపీకి, మోదీకి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్‌లు, బీసీ సంఘాల

- మిగతా 2 లో

ఉపరాష్ట్రపతిగా ఏపీ గవర్నర్ నజీర్?

రాజకీయవర్గాల్లో చర్చోపచర్చలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉపరాష్ట్రపతి పదవికి ఏపీ గవర్నర్ డాక్టర్ అబ్దుల్ నజీర్ ఎంపిక కానున్నట్లు రాజకీయవర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. త్వరలో బీహార్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ వంటి కీలక రాష్ట్రాల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఉపరాష్ట్రపతి పదవిని కూడా ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల అస్త్రంగా మలచుకునే యత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రపతిగా గిరిజన మహిళ ఉండటంతో దక్షిణాదికి చెందిన మైనార్టీ వర్గానికి ఉపరాష్ట్రపతి కేటాయించడం ద్వారా ప్రతిపక్షాలకు చెక్ పెట్టాలన్నది మోదీ వ్యూహంగా కనిపిస్తోంది. మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తికి ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వడం ద్వారా రాజకీయంగా కలిసి వస్తుందని బీజేపీ అధిష్ఠానం అంచనా వేస్తోంది. జగదీప్ ధన్కర్ రాజీనామా తర్వాత... ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ పదవికి బీజేపీలోనే మరో సీనియర్ నేత ఎంపికవుతారని నేతలు తొలుత భావించారు. ఈ పదవికి బీహార్ నుంచి ఎంపిక చేస్తారని ప్రచారం జరిగింది. మిత్రపక్షంగా ఉన్న నితీశ్ కుమార్‌కు ఇస్తారన్న ఊహాగానాలు కూడా సాగాయి. ఎన్డీఏ అభ్యర్థిని ప్రకటించిన తర్వాత ఇండియా ఐక్యసంఘటన తమ అభ్యర్థిని ప్రకటించాలన్న ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మారుతున్న సమీకరణాలతో మోదీ బృందం కొత్త వ్యూహం అమలుకు సిద్ధమైంది. అందులో భాగంగా దక్షిణాది నేతకు ఉపరాష్ట్రపతి ఇవ్వాలని, అందులోనూ మైనార్టీ వర్గానికి చెందిన వ్యక్తికి ఈ పదవి ఇవ్వడం ద్వారా ఇండియా ఐక్యసంఘటనకు షాక్ ఇవ్వాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తోంది. దీనివల్ల ముస్లింలకు బీజేపీ వ్యతిరేకమనే భావనను దేశ ప్రజల్లో పోగొట్టినట్లవుతుందని అంచనా వేస్తున్నారు.

దీనిలో భాగంగానే అనూహ్యంగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పేరు తెరమీదకు వచ్చింది. కర్నాటక రాష్ట్రానికి చెందిన జస్టిస్ అబ్దుల్ నజీర్ సుదీర్ఘకాలం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. దేశంలోనే అత్యంత వివాదాస్పద కీలకమైన అయోధ్య తీర్పులోను ఆయన భాగస్వామిగా ఉన్నారు. దీంతో ఆయన 2023 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్‌గా నియమితులయ్యారన్న ప్రచారం రాజకీయవర్గాల్లో సాగింది.

వాయిదాల పర్వం

ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాల పట్టు

- ముందుకురాని అధికార పక్షం
- ఉభయసభల్లో ఆందోళనలు

న్యూదిల్లీ: ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఆందోళనలతో పార్లమెంటు బుధవారం దద్దరిల్లింది. ఎస్ఐఆర్‌పై చర్చ కోసం విపక్షాల పట్టు, అధికార పక్ష విముఖతతో ఉభయ సభలలో వాయిదాల పర్వం కొనసాగింది. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా ఓట్ల తొలగింపు ఆరోపణలతో, ఈ అంశంపై సమగ్ర చర్చ కోసం ప్రతిపక్షాలు ఐక్యంగా డిమాండ్ చేశాయి. ప్రభుత్వ తీరును ఖండిస్తూ నినాదాలిచ్చాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభలో గందరగోళం నెలకొంది. అయినప్పటికీ లోక్‌సభలో మెర్చంట్ షిప్పింగ్ బిల్లు-2024, రాజ్యసభలో క్యారేజి ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లు-2025కు ఆమోదం లభించింది. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ సభలో ప్రతిపక్ష సభ్యులపై సభాపతి వివక్ష చూపుతున్నారని, వారితో అన్యాయంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిబంధనలు అందరికీ ఒకేలా ఉండాలన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ విజ్ఞప్తిని పట్టించుకోలేదని, డిప్యూటీ చైర్మన్ తీరు

- మిగతా 2 లో

మరో 25 శాతం వడ్డన

భారత్‌పై ట్రంప్ సుంకాల మోత

50 శాతానికి చేరిన టారిఫ్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు జరుపుతున్న భారత్‌పై మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకం విధించారు. దీంతో భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 50 శాతం సుంకం వర్తించనుంది. ఈ మేరకు బుధవారం ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై ట్రంప్ సంతకం చేశారు. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో అక్కసు వెళ్లగక్కుతున్న ట్రంప్... 24 గంటల్లో భారత్‌పై భారీ టారిఫ్ వేస్తానని మంగళవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా అన్నంత పనీ చేశారు. రష్యా నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా చమురు కొనుగోళ్లు జరుపుతున్నందునే ఈ

- మిగతా 2 లో

'స్థానికత' చిక్కులు!

- ఇంజనీరింగ్ సీట్లకు బ్రేక్
- హైకోర్టు పరిధిలో సమస్య
- హడావుడీ ఉత్తర్వులే కారణం
- యూజీ ప్రవేశాలపై విద్యార్థుల ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో విద్యా ప్రవేశాల్లో స్థానికత వివాదం విద్యార్థుల భవిష్యత్‌కు ఆటంకంగా మారింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీఈఏపీసెట్-2025 చివరి విడత కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఈ పరిణామాలు విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అనుకున్న షెడ్యూలు ప్రకారం ఈ నెల 4న సీట్లను ఖరారు చేయవలసి ఉండగా... రాష్ట్ర హైకోర్టు తీర్పుతో నిలిచిపోయింది. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన వారిలో కొందరు ఆయా కళాశాలల్లో స్వయం నివేదిక సమర్పించి, ఆ తర్వాత మెరుగైన కళాశాలలు, బ్రాంచీలు కోరుతూ రెండో విడత వెబ్ కౌన్సెలింగ్‌లో నమోదు చేసుకున్నారు. ఇప్పుడు వాయిదా పడిన సీట్ల ప్రక్రియ ఎప్పటికి వస్తుందో? అన్న సందేహాలు వారిలో వ్యక్తమవుతున్నాయి. ఉన్నత విద్యామండలి ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 4 నుంచి తరగతులు ప్రారంభించాల్సి ఉంది. ఇంకా సీట్ల ప్రక్రియనే వెల్లడించకపోవడంతో తరగతుల ప్రారంభం మరింత ఆలస్యమయ్యే పరిస్థితులున్నాయి. రాష్ట్రంలో పదో తరగతి చదివి, హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ అభ్యసించిన ముగ్గురు విద్యార్థులు ఏపీఈఏపీసెట్ 2025కు దరఖాస్తు చేశారు. ఏపీలో ఆ విద్యార్థులు ఇంటర్ చదవకపోవడంతో వారిని స్థానిక స్థితి కేటగిరి కింద డీటీఈ పరిగణించలేదు. దానిని సవాల్ చేస్తూ విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం వారికి స్థానికత కింద సీట్లు కేటాయించాలని హైకోర్టు ఆదేశించించింది. అదే జరిగితే మొత్తం సీట్ల కేటాయింపులో మార్పులు, చేర్పులతో మరిన్ని సమస్యలు ఎదురవుతాయని అధికారులు భావించి, తిరిగి హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు తుది విడత ఇంజినీరింగ్ సీట్ల భర్తీ ప్రక్రియ ఉంటుంది.

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో స్థానికత ఇలా...

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌గా ఉన్నప్పుడు ఆర్టికల్ 371-డి రాష్ట్రపతి ఉత్తర్వుల ఆధారంగా స్థానికత ఉండేది. అప్పట్లో దాని ప్రకారం 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివిన వారికి

- మిగతా 2 లో

విమానాశ్రయాలకు ఉగ్ర ముప్పు

ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరిక

న్యూదిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల భద్రతకు ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్ర, సంఘ వ్యతిరేక శక్తులు దాడులకు పాల్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. అన్ని విమానాశ్రయాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు రెండు మధ్య విమానాశ్రయాలపై దాడులు జరిగే

- మిగతా 2 లో

పారిశ్రామిక పార్కులకు ఆర్థిక సాయం

- ప్రతి నియోజకవర్గంలోనూ ఏర్పాటు
- మహిళా ప్రాధాన్యత సంస్థలకు ప్రోత్సాహం
- కేంద్ర మంత్రికి భట్టి వినతి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఎంఎస్ఎంఈ రంగ అభివృద్ధిలో ముందడుగు వేస్తోందని... చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు రెండు కొత్త ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని నిర్ణయించిందనీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దిల్లీలో బుధవారం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ మల్లు రవితో కలిసి కేంద్ర మంత్రి (ఎంఎస్ఎంఈ) జితన్ రామ్ మాంఝీకి ఈ మేరకు లేఖ అందజేశారు. ఎంఎస్ఎంఈ రంగం సమగ్ర ఆర్థిక ప్రగతికి తెలంగాణ కీలక క్షేత్రంగా మారుతుందని అన్నారు. ఖమ్మం జిల్లా మధిర మండలం యెండపల్లి, ఎర్రుపాలెం మండలం రెమిడిచర్ల గ్రామాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్టు పేర్కొన్నారు. 85 ఎకరాలు, 60 ఎకరాల్లో ఈ పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు డిప్యూటీ సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. జాతీయ రహదారి 65 (హైదరాబాద్-విజయవాడ కారిడార్)కు సమీపంలో ఉండటంతో పాటు సమీప పట్టణాలు, రైల్వే నెట్వర్క్‌లు, పోర్టులతో అనుసంధానం ఉందని తెలిపారు. ఈ పార్కుల అభివృద్ధి ద్వారా ఆ ప్రాంత యువతకు పారిశ్రామిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎంఎస్ ఎంఈ-సీడీపీ పథకం కింద ఈ పార్కుల అభివృద్ధికి ఆర్థిక సహాయానికి ప్రాజెక్ట్ ప్రతిపాదనలు పంపించేందుకు ముందస్తు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని ఆ లేఖలో రాష్ట్రం కోరింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ ఎంఈ పార్క్ - రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన ఎంఎస్ ఎంఈ-సీడీపీ పథకం కింద కేంద్ర నుంచి ఆర్థిక సహాయం ఆశిస్తున్నట్టు కేంద్ర

- మిగతా 2 లో

రోడ్డు ప్రమాదంలో సీపీఐ నేత అయోధ్య దుర్మరణం

రామానుజవరంలో అంత్యక్రియలు నేడు

విశాలాంధ్ర - మణుగూరు/ పినపాక : ప్రజా ఉద్యమాల నేత బొల్లోజు అయోధ్య చారి (70) బుధవారం తెల్లవారుజామున సూర్యపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. కారులో హెల్త్ చెకప్ కోసం హైదరాబాద్ వెళ్తుండగా ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం అనంతరం తొలుత ఖమ్మం పార్టీ కార్యాలయానికి తరలించారు. అనంతరం కొత్తగూడెంలో ప్రజల సందర్శనార్థం భౌతికదేహాన్ని ఉంచారు. సాయంత్రం మణుగూరు తరలించారు. ఐదు దశాబ్దాలపాటు తుది శ్వాస వరకు సీపీఐలోనే ఉన్నారు. భూ పోరాటాలు నిర్వహించడంతోపాటు వేలాది మందికి ఇంటి స్థలాలు, పోడు, సాగు భూములు ఇప్పించిన ఘనచరిత్ర ఆయనది. ప్రజల మధ్యనే జీవితాన్ని

- మిగతా 2 లో

మాటమార్చిన ట్రంప్

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో రెచ్చిపోతున్నారు. రష్యాతో చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తానన్నారు. ఈ విషయంలో ట్రంప్ మాట మారుస్తూ, అలాంటి శాతాలేమీ నేను చెప్పలేదని వెల్లడించారు. శ్వేతసౌధం వద్ద విలేకరుల సమావేశంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అదనపు సుంకాలకు సంబంధించి ఎప్పుడు కూడా అలాంటి శాతాలను చెప్పలేదు కానీ అందుకోసం కసరత్తు చేస్తున్నామని చెప్పారు. సమీప భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చూద్దామన్నారు. రష్యాతో సమావేశం కాబోతున్నట్లు తెలిపారు.

భారత్‌తో సంబంధాలు తెంచుకోవద్దు: నిక్కీ హేలి

చైనాతో మృదువు వ్యవహారం... భారత్‌తో వ్యూహాత్మక బంధం పణంగా పెట్టేయడం ఏమిటంటూ ట్రంప్ చర్చలను ఐరాసలో అమెరికా దౌత్యాధికారి నిక్కీ హేలీ ప్రశ్నించారు. 'రష్యా నుంచి చమురును భారత్ కొనుగోలు చేసివుండకూడదు కానీ రష్యా, ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లలో అగ్రగామిగా నిలిచే చైనాకు మాత్రం సుంకాలు విధించకుండా 90 రోజుల మినహాయింపు ఇచ్చారు. చైనాకు మినహాయింపు ఇచ్చి, శక్తిమంతమైన భాగస్వామిగా ఉన్న భారత్‌ను దూరం చేసుకోవద్దు. ఆ దేశంతో ఉన్న వ్యూహాత్మక సహకార బంధాన్ని తెంచుకోవద్దు' అని ఎక్స్‌లో నిక్కీహేలి పేర్కొన్నారు.

రష్యాపై ఆంక్షలు విధించకపోవచ్చు!

ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం కోసం రష్యాకు ట్రంప్ ఇచ్చిన గడువు శుక్రవారంతో ముగియనుంది. డెడ్‌లైన్ తర్వాత రష్యాపై అమెరికా ఆంక్షలను విధించకపోవచ్చని అధికార వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్ పోస్ట్ నివేదించింది. 'ట్రంప్‌కు సంబంధించినంత వరకు అనుకున్న విధంగా ఒప్పందం చేసుకోవడం ముఖ్యం... ఇందుకోసం యంత్రాంగం గట్టిగా కృషి చేస్తోంది' అని అధికార వర్గాలు తెలిపినట్లు వార్తా కథనం పేర్కొంది. 2022 నుంచి పశ్చిమ దేశాలు తమపై ఆంక్షలు విధిస్తున్నా నిలద్రొక్కుగోగలమని రష్యా ఎప్పటికప్పుడు చెబుతోంది. ఆంక్షల విధానం వైఫల్యాన్ని పశ్చిమ దేశాలు అంగీకరించలేకపోతున్నాయని దుయ్యబట్టింది. రష్యాకు అల్టిమేటం అంటూ ట్రంప్ ఆటలు ఆడుతున్నారని రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ దిమిత్రీ మెద్వదేవ్ ఇటీవల వ్యాఖ్యానించారు.

మాస్కోలో విట్కాఫ్‌తో పుతిన్ భేటీ

అమెరికా అధ్యక్షుడికి ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ రష్యా పర్యటన సందర్భంగా రాజధాని మాస్కోలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆయనతో సమావేశమయ్యారు. ఈ భేటీ క్రెమ్లిన్‌లో జరిగింది. దాదాపు మూడు గంటల పాటు వీరు చర్చించుకున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. కాగా, విట్కాఫ్ బుధవారం తెల్లవారుజామున మాస్కో చేరుకున్నారు. నుకోవా-2 విమానాశ్రయంలో రష్యా అధ్యక్షుడికి ప్రత్యేక ప్రతినిధి కిరిల్ దిమిత్రీవ్‌ని ఆయన కలిశారు. ఓ గంట తర్వాత క్రెమ్లిన్‌కు దగ్గరలోని జర్యాడే పార్కులో ఈ ఇద్దరు కాసేపు తిరిగారు. ఈ ఏడాదిలో విట్కాఫ్ ఐదవ సారి రష్యాలో పర్యటించారు. రష్యాతో వాణిజ్యంపై ప్రపంచ దేశాలకు ట్రంప్ హెచ్చరికలు చేస్తున్న సమయంలో విట్కాఫ్ రష్యా పర్యటన, పుతిన్‌తో భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

కశ్మీరు వల్లే ఉద్రిక్తతలు

పాక్ ప్రధాని షరీఫ్



ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ మరోసారి జమ్మూ కశ్మీర్ అంశంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్- పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలకు ప్రధాన కారణం కశ్మీర్ అని నోరు పారేసుకున్నారు. రెండు దేశాల మధ్య శాంతిస్థాపన కోసం 2019లో భారత సర్కార్ ఆర్టికల్ 370 రద్దు చేయడంపైనా ఆయన అక్కసు వెళ్లగక్కారు. ఈ విషయంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా చర్యలు తీసుకుందని నిందలు వేశారు. ఈ సమస్యకు న్యాయపరమైన పరిష్కారానికి తమ విదేశాంగ విధానం కట్టుబడి ఉందంటూ షరీఫ్ మళ్లీ పాత పాటే పాడారు. మరోవైపు, తమ పొరుగు దేశాలతో స్నేహపూర్వక సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని కోరుకుంటున్నామని పాక్ ఉప ప్రధాని ఇషాక్‌దార్ అన్నారు. ఘర్షణల కంటే దౌత్యాన్నే ఇష్టపడతామని వ్యాఖ్యానించారు. ఎవరైనా దురాక్రమణకు పాల్పడితే గట్టిగా బదులు ఇచ్చేందుకు తమ సాయుధ దళాలు ఎప్పటికీ ముందు వరుసలో ఉంటాయని చెప్పుకొచ్చారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ సహా పలు ప్రావిన్స్‌లలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

18న అధికారికంగా బదులిస్తాం

మోదీ-జిన్‌పింగ్‌కు ఫోన్ చేస్తా: అమెరికా సుంకాలపై లూలా



బ్రసిలియా: అమెరికా తమ దేశంపై విధించే అధిక సుంకాలకు ప్రత్యామ్నాయ ప్రణాళికతో బదులిస్తామని, ఈ వ్యవహారాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) దృష్టికి తీసుకెళతామని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్లా అన్నారు. అమెరికా విధానాన్ని డబ్ల్యూటీఓ ఎదుట సవాల్ చేసిన తర్వాత ఈనెల 18న ఆ దేశ చర్యలకు అధికారికంగా స్పందిస్తామని అధ్యక్షుడు చెప్పినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, సుస్థిర ఆర్థిక-సామాజిక అభివృద్ధిపై బ్రసిలియాలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు మాట్లాడుతూ అమెరికా వాణిజ్య చర్య అన్యాయమైనదన్నారు. అంతర్జాతీయ వేదికగా బ్రెజిల్ గణనీయమైన పురోగతి సాగించిందని చెప్పారు. బ్రెజిల్ ప్రజల ప్రయోజనాలు కాపాడటానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ అన్యాయమైన పద్ధతిని ప్రత్యామ్నాయ, ఆకస్మిక ప్రణాళిక ద్వారా ఎదుర్కొంటామని, ఆర్థికంగా, సామాజిక నష్టాన్ని నివారిస్తామన్నారు. విదేశీ వాణిజ్యాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తనతో చర్చలకు అమెరికా అధ్యక్షుడు సిద్ధంగా లేరని, చైనా, భారత అధినేతలు జిన్‌పింగ్, మోదీతో ఫోన్‌లో మాట్లాడతానని లూలా చెప్పారు. రష్యా తమతో కలిసి రావడం లేదు కాబట్టి ఆ దేశాధినేత పుతిన్‌తో సంప్రదింపులు జరిపే ఆలోచన లేదన్నారు. మిగతా దేశాల నాయకులకు ఫోన్లు చేస్తానన్నారు. అయితే, బ్రెజిల్‌పై అత్యధికంగా 50 శాతం సుంకాన్ని టారిఫ్ విధించారు. బ్రెజిల్‌లో కాప్30 సదస్సు ఈ ఏడాది జరగనుంది. ఈ కార్యక్రమానికి ట్రంప్‌ను ఆహ్వానిస్తానని లూలా తెలిపారు. వాతావరణ మార్పులపై అభిప్రాయం కోసమే ఆయనను ఆహ్వానిస్తానని, రావడం, రాకపోవడం ఆయన ఇష్టమని అన్నారు. ట్రంప్‌తో వాణిజ్య చర్చలకు తాము సిద్ధమని లూలా డ సిల్వా వెల్లడించారు.

హిమాచల్‌లో మెరుపు వరదలు

సిమ్లా: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ వర్షాలకు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను ఆకస్మిక వరదలు చుట్టుముడుతున్నాయి. నిన్న ఉత్తరకాశీ జిల్లాలో జలవిలయం ఏర్పడగా...హిమాచల్ ప్రదేశ్‌లో మెరుపు వరదలు సంభవించాయి. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన టాంగ్లింగ్ ప్రాంతంలో కురిసిన వర్షం కారణంగా కిన్నౌర్ కైలాశ్ యాత్ర మార్గంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో వందలాది మంది యాత్రికులు పర్వత మార్గంలో చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. సాహసోపేతమైన ఆపరేషన్ చేపట్టారు. రోప్‌వే సాయంతో దాదాపు 413 మంది యాత్రికులను రక్షించారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. కాగా, రెండు రోజుల నుంచి హిమాచల్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. అనేక చోట్ల కొండచరియలు విరిగిపడటంతో 600కు పైగా రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కిన్నౌర్ కైలాశ్ యాత్రను నిలిపివేశారు. మండి-మనాలి మధ్య ఐదు కొండచరియలు విరిగిపడటంతో చండీగఢ్-మనాలి జాతీయ రహదారి (ఎన్‌హెచ్-21) మూసుకుపోయింది. దీని వలన కులు-మనాలికి ప్రయాణించే ప్రజలు 12 గంటలకు పైగా చిక్కుకుపోయారు. చాలా మంది తమ వాహనాల్లో రాత్రంతా గడిపారని ఒక ఆంగ్ల వార్తా సంస్థ పేర్కొంది. అనేక చోట్ల ప్రయాణికులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ కారణంగా దాదాపు 450 రోడ్లను అధికారులు మూసివేశారు. ముఖ్యంగా మండి జిల్లా అత్యంత ప్రభావితమైంది. ఇక్కడ దాదాపు 295 రోడ్లు మూసుకుపోయాయి. ఇక సిమ్లాలోని చక్కీమోర్ వద్ద కొండ చరియలు విరిగిపడటంతో కీలకమైన చండీగఢ్-సిమ్లా జాతీయ రహదారిని అధికారులు మూసివేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉనా, కాంగ్రా, మండి, సిర్మౌర్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆ నాలుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. సిమ్లా, మండి, కులు, సోలన్ జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీలు మూతపడ్డాయి. సిమ్లా నగరంలోని కొన్ని పాఠశాలలు ఆన్‌లైన్ తరగతులకు మారాయి.

అదుపుతప్పి నదిలో పడిపోయిన కారు : ముగ్గురు మృతి

సిమ్లాలో ఒక కారు అదుపు తప్పి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చిర్గావ్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి

12 గంటల సమయంలో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు అదుపుతప్పి పబ్బర్ నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా... ఒక వ్యక్తి గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను విశాల్ థాకూర్, అభ్య కందియాన్, హిమాన్షుగా గాయపడిన వ్యక్తిని హర్ష్ చౌహాన్‌గా గుర్తించారు. నది నుంచి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వాయిదాల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

సరైనది కాదని ఖర్గే వ్యాఖ్యానించారు. అధికార పక్ష సభ్యుడు జేపీ నడ్డా స్పందిస్తూ సభను రసాభాస చేసే వారికి పాయింట్ ఆఫ్ ఆర్డర్ గురించి మాట్లాడే హక్కు లేదని, సభాపతి మాటకు తిరుగు లేదన్నారు. దీంతో ప్రతిపక్షాల నుంచి నిరసన వ్యక్తం అయింది. అప్పుడప్పుడు తమ మాట కూడా వినాలంటూ సభాపతిని ఉద్దేశించి అన్నారు. బీహార్ ఎస్‌ఐఆర్‌పై చర్చ కోసం నినాదాలు కొనసాగించారు. దీంతో బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభాపతి కోరగా, వారు పట్టించుకోలేదు. గందరగోళ పరిస్థితుల మధ్య క్యారేజి ఆఫ్ గూడ్స్ బై సీ బిల్లును ఎన్‌జేపీ ఎంపీ సంజయ్ సేత్ ప్రవేశపెట్టారు.

అటు లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఎస్‌ఐఆర్ చర్చ కోసం ప్రతిపక్ష సభ్యులు డిమాండ్, నినాదాలను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తప్పుపట్టారు. ఏ అంశంపై చర్చించేందుకైనా కేంద్రం సిద్ధంగా ఉంది కానీ, అది రాజ్యాంగ నిబంధనల పరిధిలో ఉండాలన్నారు. న్యాయ విచారణలో ఉన్న ఎస్‌ఐఆర్‌పై పార్లమెంటులో చర్చ కుదరదని చెప్పారు. సభ్యుల నినాదాలు, ఆందోళలతో ఉభయ సభలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. తిరిగి సమావేశమైనప్పుడు ప్రతిపక్షాల ఆందోళనలు కొనసాగాయి. ప్రతిపక్షాల నినాదాలు కొనసాగుతుండగానే మణిపూర్ బడ్జెట్ వ్యయంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన చేశారు. ఎంపీలు సమర్పించిన వాయిదా తీర్మానాలను స్పీకర్ ఓం బిర్లా అంగీకరించలేదని సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా సభకు తెలిపారు.

అటు రాజ్యసభలోనూ నిబంధన 267 కింద సభ్యులు ఇచ్చిన నోటీసులను డిప్యూటీ చైర్మన్ హరివంశ్ తిరస్కరించారు. లోక్‌సభ ఉదయం ప్రారంభమైనప్పుడు రెండవ ప్రపంచ యుద్ధమప్పుడు జపాన్‌లోని హిరోషిమా-నాగసాకిపై అణు బాంబు దాడికి 80 ఏళ్లు అయినట్లు స్పీకర్ గుర్తుచేశారు. నాటి విపత్తు బాధితుల గౌరవార్థం సభ రెండు నిమిషాల మౌనం పాటించింది. రాజ్యసభ కార్యక్రమాల ప్రారంభానికి ముందు జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ సంతాపం ప్రకటించారు.

'స్థానికత' చిక్కులు!

(మొదటిపేజీ తరువాయి)

స్థానికతగా గుర్తించేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఓయూ, ఏయూ, ఎస్వీయూగా మూడు రీజియన్లుగా ఉండేవి. ఓయూ పరిధిలో తెలంగాణ జిల్లాలు, ఏయూలో శ్రీకాకుళం నుంచి ఒంగోలు వరకు, ఎస్వీయూ నెల్లూరుతో పాటు రాయలసీమ జిల్లాలను విభజించారు. ఆయా రీజియన్లలో విద్యార్థులు 6 నుంచి 12వ తరగతి వరకు ఎక్కువ కాలం అక్కడ చదివితే... ఆ ప్రాంతాన్ని స్థానికతగా గుర్తించేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంతో ఓయూ రీజియన్ జిల్లాలు పూర్తిగా తెలంగాణకు వెళ్లిపోయాయి. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు కావడంతో ఏపీ ప్రభుత్వం ఏయూ, ఎస్వీయూలో తెలంగాణ వారిని స్థానికేతరులుగా నిర్ధారిస్తూ, వారికి ఎక్కడా సీట్లు ఇచ్చే అవకాశం లేదనీ హడావుడీగా ఈ ఏడాది మే 20న ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీజేసింది. దీనిపై ఆరంభం నుంచి అనేక అభ్యంతరాలు వ్యక్తమైనప్పటికీ, ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించకపోవడంతో సమస్యలు తలెత్తాయి.

తెలంగాణ తరహా జీవోతోనే సమస్యలు

బి.టెక్, ఎంబీబీఎస్ తదితర అండర్ గ్రాడ్యుయేషన్ (యూజీ) కోర్సుల్లో ప్రవేశాలకుగాను... సదరు విద్యార్థి 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్లల్లో కనీసం ఒక ఏడాది సంబంధిత రీజియన్‌లో కాకుండా బయట చదివితే... వారిని స్థానికేతరులుగా జీవో సారాంశం ఉంది. ముందు ఈ తరహా ఉత్తర్వులను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాగా... దానిని వ్యతిరేకిస్తూ ఆ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు హైదరాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. అదే బాటలో ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు తేవడంతో ప్రవేశాలకు ఆటంకాలు ఎదురయ్యాయి. దీనిపై సుప్రీం కోర్టును విద్యార్థులు ఆశ్రయించారు. స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వాలే సరైన నిర్ణయం తీసుకోవాలని, ఒక ఏడాది బయట చదివిన వారికి స్థానికత వర్తించబోదనే ఉత్తర్వులు ఇవ్వడం సరికాదంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని సుప్రీం ఆదేశించింది. అంత తతంగం తెలంగాణలో జరుగుతున్నప్పటికీ, ఏ మాత్రం ఏపీ ప్రభుత్వం గమనించకుండా అదే తరహాగా హడావుడీగా జీవో ఇవ్వడంతో విద్యార్థుల ప్రవేశాలకు సమస్యలు తలెత్తాయి. ఫలితంగా ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ సీట్ల ఖరారు ప్రక్రియ నిలిచిపోయింది. ఏపీ హైకోర్టు ఎలాంటి ఆదేశాలిస్తుందనేదీ చూడాలి. అసలే జాప్యంతో మొదలైన కౌన్సెలింగ్‌కు మరింత అడ్డంకులు రావడంతో విద్యార్థులకు దిక్కు తోచడం లేదు. దీనికి మొత్తం ఉన్నత విద్యామండలి, సాంకేతిక విద్యాశాఖ అధికారులే బాధ్యత వహించాలి. వారి నిర్లక్ష్యం, ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వెరసి విద్యార్థుల ప్రవేశాలకు ఆటంకమైంది. ఇప్పటికైనా చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే స్పందించి స్థానికత అంశంపై చొరవ చూపి... విద్యార్థుల ప్రవేశాలకు సాంకేతిక సమస్యలు ఎదురవ్వకుండా చర్యలకు ఉపక్రమించాలి.

మరో 25 శాతం వడ్డన

(మొదటిపేజీ తరువాయి)

టారిఫ్ విధిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. ప్రతీకార సుంకాల్లో భాగంగా ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానుండగా... కొత్తగా విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి వర్తింపజేస్తున్నట్లు ట్రంప్ తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో పేర్కొన్నారు.

ఒకవేళ ఈ సుంకాలకు ప్రతీకారంగా భారత్ ఏదైనా సుంకాలు వడ్డించాలని ప్రయత్నిస్తే ఈ టారిఫ్‌లను అధ్యక్షుడు సవరించొచ్చని వైట్‌హౌస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడంలో ఒక్కో దేశాన్ని తన దారికి తెచ్చుకునే ఎత్తుగడలో భాగంగా ట్రంప్ ఇప్పటికే పలు దేశాలపై సుంకాలు విధించారు. తాజాగా రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయలేదన్న కారణంతో భారత్‌పై ఏకంగా 50 శాతం టారిఫ్ మోపారు. దీంతో చైనా తర్వాత ఆసియాలో అత్యధిక టారిఫ్‌లు ఎదుర్కొంటున్న దేశంగా భారత్ నిలిచింది. ప్రస్తుతం చైనా ఉత్పత్తులపై 51 శాతం సుంకం అమెరికా విధిస్తోంది. మలేసియాపై 25 శాతం, శ్రీలంకపై 30, వియత్నాంపై 20 శాతం, ఇండోనేసియాపై 19 శాతం చొప్పున ట్రంప్ టారిఫ్ విధించారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా జపాన్‌పై 15 శాతం టారిఫ్ ప్రకటించారు.

ధైర్యం చూపండి: కాంగ్రెస్

తాజా పరిణామంపై కాంగ్రెస్ స్పందించింది. నరేంద్ర మోదీ మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మొత్తంగా 50 శాతం సుంకం విధించారని తెలిపింది. ట్రంప్ నిరంతరం మన దేశంపై చర్యలు తీసుకుంటున్నా... ప్రధాని మోదీ మాత్రం కనీసం ఆయన పేరును కూడా ప్రస్తావించడం లేదని విమర్శించింది. ఇప్పటికైనా మోదీ ధైర్యం చూపించాలని, ట్రంప్ చర్యలకు తగిన సమాధానం ఇవ్వాలని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

పోరాటం ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్రం మద్దతిస్తుందని ఆశిస్తున్నా: భట్టి

బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం నుంచి మద్దతు లభిస్తుందని ఆశిస్తున్నానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అసెంబ్లీలో మద్దతు తెలిపిన బీజేపీ పార్లమెంట్ లోను మద్దతు తెలియజేస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. జంతర్ మంతర్ ధర్నా భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది అని అన్నారు. 1.05 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల సేవలు వినియోగించుకుని ఏ రాజకీయ పార్టీ ప్రశ్నించలేని రీతిలో సర్వేను విజయవంతంగా పూర్తి చేశాం అన్నారు.

బీసీలకు 42 శాతం చరిత్రలో నిలిచే అంశం: మీనాక్షి నటరాజన్

వినోభాబావే... భూదాన ఉద్యమం మొదలు పెట్టినప్పుడు తెలంగాణకు చెందిన ఓ రెడ్డి భూస్వామి భూదానం చేసి పెద్ద మనస్సు చాటుకున్నారని తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెడ్డి సామాజిక వర్గానికి చెందినప్పటికీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులు ఆమోదించడం చరిత్రలో నిలిచిపోయే అంశమని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటాం: ఎంపీ కనిమొళి

బీసీ రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి అండగా ఉంటామని డీఎంకే ఎంపీ కనిమొళి తెలిపారు. 'తమిళనాడులో 69శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. న్యాయంగా ఎలాంటి పరిమితులు విధించవద్దు. రిజర్వేషన్లకు 50శాతం పరిమితి ఉండాలని ఎవరూ చెప్పలేరు' అని కనిమొళి అన్నారు.

రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది: సుప్రియా సూలే

సీఎం అవుతానని రేవంత్‌రెడ్డి ఎప్పుడూ చెప్పలేదని... కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని మాత్రమే చెప్పారని ఎన్సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. ఒక కార్యకర్త... జీరో నుంచి సీఎం వరకు ఎదిగారని చెప్పారు. 'పంచితులు, పీడితుల తరపున రేవంత్‌రెడ్డి పోరాడుతున్నారు. దేశంలో తొలిసారి 69 శాతం రిజర్వేషన్లను కరుణానిధి అమలుచేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్‌రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. కాంగ్రెస్‌కు మా పార్టీ అండగా నిలుస్తుంది' అని సూలే అన్నారు.

బీజేపీ నేతలు చేతగానివాళ్లు: మహేశ్‌కుమార్ గౌడ్

రిజర్వేషన్ల అంశాన్ని మతంతో ముడిపెట్టి అడ్డుకోవడమే బీజేపీ నేతల లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కిషన్ రెడ్డి ... ఎస్సీలు, ఎస్టీలు, బీసీల మద్దతు లేకుండా సికింద్రాబాద్‌లో నామినేషన్ వేయగలరా అని ప్రశ్నించారు. బీసీల పేరిట గెలిచిన బండి సంజయ్, కిషన్ రెడ్డికి వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. బీజేపీ నేతలను చేతగాని దద్దమ్మలని ఘాటుగా విమర్శించారు.

అణగారిన వర్గాలందరి కోసమే ఈ పోరాటం: రాహుల్ గాంధీ

కులగణన ఆధారంగా సామాజిక న్యాయం కోరుతున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన బీసీ ధర్నాపై ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించాలనే డిమాండ్‌తో ధర్నా జరిగినట్లు చెప్పారు. 'కాంగ్రెస్ మహాధర్నాకు రాష్ట్రపతి స్పందిస్తారని ఆశిస్తున్నా. బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదిస్తే గొప్ప ముందడుగు అవుతుంది. ఈ పోరాటం కేవలం తెలంగాణ కోసమే కాదు... దేశంలోని అణగారిన వర్గాలందరి కోసం. ఈ ధర్నాకు హాజరైన ఇండియా ఐక్య సంఘటన నేతలకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

విమానాశ్రయాలకు ఉగ్ర ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దీంతో కేంద్ర పౌర విమానయాన భద్రతా బ్యూరో అన్ని విమానాశ్రయాలకు సూచనలు జారీ చేసింది. విమానాశ్రయాల్లో తక్షణమే భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. రన్‌వేలు, హెలీప్యాడ్లు, ఫ్లైయింగ్ స్కూళ్లు, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లలో భద్రత పెంచాలని సూచించింది. దీంతో విమానాశ్రయాల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. టెర్మినల్స్, పార్కింగ్ ఏరియా, పెరీమీటర్ జోన్, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పెంచారు. స్థానిక పోలీసుల సహకారంతో విమానాశ్రయాలకు వెళ్లే మార్గాల్లోనూ తనిఖీలు చేపట్టారు. అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో పంపే మెయిల్ పార్సిళ్లను క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. సిబ్బంది, కాంట్రాక్టర్లు, విజిటర్లను కూడా తనిఖీ చేయాలని నిర్ణయించారు. విమానాశ్రయాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు గానీ, లగేజీ గానీ కన్పిస్తే తక్షణమే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ప్రయాణికులకు సూచించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్‌ను యాక్టివేట్ చేశారు. అవసరమైతే మాక్ డ్రిల్స్ చేపట్టాలని పౌర విమానయాన భద్రతా బ్యూరో సంబంధిత అధికారులకు సూచించింది.

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

కార్యక్రమంలో రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కేంద్రమంత్రి అమిత్ షాపై ఆరోపణలు చేశారు. ఆ సమయంలో అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ వ్యాఖ్యలు అప్పట్లో తీవ్ర దుమారం రేపాయి.

ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి చైబాసాలోని మేజిస్ట్రేట్ కోర్టులో రాహుల్ గాంధీపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు. ఆయన ప్రకటనలు అమిత్ షా ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్నాయని ఆరోపించారు. ఈ కేసుపై బుధవారం విచారణ జరిపిన ప్రజాప్రతినిధుల కోర్టు రాహుల్‌కు బెయిల్ మంజూరు చేసింది.

పారిశ్రామిక పార్కులకు ఆర్థికసాయం

(మొదటిపేజీ తరువాయి)

మంత్రికి తెలిపారు. రాష్ట్రంలో 119 చిన్న స్థాయి ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలతో కూడిన ఎంఎస్ ఎంఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ ఎంఎస్ ఎంఈ పార్కుల్లో హాస్టళ్లు, కిచెన్లు, టాయిలెట్లు, టెస్టింగ్ సెంటర్లు, ఇతర సాధారణ వసతులు... వ్యాపార అభివృద్ధి, ఉత్పత్తి ఆవిష్కరణ, మార్కెట్ వ్యూహం వంటి సేవలు అందుబాటులో ఉంటాయని, మహిళా ప్రాధాన్యత గల సంస్థలకు ప్రోత్సాహంగా స్త్రీనిధి పథకం ద్వారా రుణాల మద్దతు కూడా ఇవ్వనున్నామని కేంద్రమంత్రికి వివరించారు. దీని ద్వారా మహిళల జీవనోపాధి అవకాశాలు విస్తరిస్తాయన్నారు.

ప్రభుత్వం ఇప్పటికే 25 ప్రాజెక్టులను కేంద్ర ఎంఎస్ ఎంఈ మంత్రిత్వశాఖ సహకారంతో అమలు చేస్తోంది. ఈ క్రమంలో కేంద్ర ఎంఎస్ ఎంఈ మంత్రిత్వశాఖ మద్దతుతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎంఎస్ ఎంఈ పార్కులను నెలకొల్పడానికి సంబంధిత పథకాల ద్వారా ఆర్థిక సహాయం కోరుతోంది. ఈ ప్రయోజనాత్మక కార్యక్రమాల ద్వారా భారతదేశం లక్ష్యంగా పెట్టుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా తెలంగాణ రాష్ట్రం కీలక భాగస్వామిగా నిలుస్తుందనే నమ్మకాన్ని కేంద్ర మంత్రి వద్ద వ్యక్తం చేశారు.

వైసీపీ కుట్రలపై అప్రమత్తం

- లిక్కర్ కేసుపై అతిగా స్పందించొద్దు
- మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం

విశాలాంధ్ర-సచివాలయం: ఏడాది పాలిడే సమయం పూర్తయిం దని, ఇంక కార్యరంగంలోకి దిగాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హితవు పలికారు. రాష్ట్ర కేబినెట్ సమావేశం అనంతరం చంద్రబాబు మంత్రులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ ఏడాది కాలంలో మంత్రులు మెరుగ్గా పనిచేశారని చంద్రబాబు చెప్పారు. ఇక నుంచి పరిపాలనలో దూకుడు పెంచాలని మంత్రులకు సూచించారు. తప్పుడు వార్తలు నిజం చేయడం కోసం వైసీపీ ప్రయత్నిస్తోందని, వైసీపీ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, వీలైనంత ఎక్కువ సమయం క్షేత్రస్థాయిలో ఉండాలని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి సానుకూలత ఉందన్నారు. మంత్రుల పనితీరుతో ఆ సానుకూలత పెరగాలన్నారు. పనితీరు బాగోకుంటే ప్రతికూలత పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటి వరకు 24 మంది ఎమ్మెల్యేలతో ముఖాముఖి మాట్లాడానని, తప్పులు అంగీకరించి సరిదిద్దుకుంటామని కొందరు హామీ ఇచ్చారన్నారు. క్షేత్రస్థాయిలో జనసేన, బీజేపీ నాయకులతో మాట్లాడి... లోపాలు సరిదిద్దుకోవాలన్నారు. మంత్రులు తమ శాఖలపై ప్రగతి నివేదికలు తయారు చేసుకోవాలని, వచ్చే మంత్రివర్గ సమావేశం నుంచి ఒక్కో మంత్రితో తమ శాఖ ఘనతపై కాసేపు మాట్లాడిస్తానని చంద్రబాబు చెప్పారు. మహిళలను అసభ్యంగా తిట్టే వాళ్ల చర్యలను గట్టిగా తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై సింగపూర్ ప్రభుత్వానికి సడలిన నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు చాలా కష్టపడాల్సి వచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వ నిర్వాకం వల్ల సింగపూర్ ప్రభుత్వం భయపడిన తీరును మంత్రులకు వివరించారు. నవంబర్‌లో జరిగే పెట్టుబడుల సదస్సుకు రావడానికి సింగపూర్ ప్రభుత్వం అంత తేలికగా అంగీకరించలేదన్నారు. గత ప్రభుత్వంలో అక్కడికి వెళ్లి సింగపూర్ మంత్రులను వైసీపీ బెదిరించిందని చంద్రబాబు చెప్పారు. కేసులు పెడతామని భయపెట్టిందన్నారు. భాగస్వామ్య సదస్సుకు రావాల్సిందిగా సింగపూర్ ప్రభుత్వాన్ని ఆహ్వానించామన్నారు. స్నేహ సంబంధాలు కొనసాగించాలని సూచించినట్లు పేర్కొన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 41 సమావేశాల్లో పాల్గొన్నానని వివరించారు. అంతర్జాతీయ సంబంధాల కోసం కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. సింగపూర్ విధానాలు అధ్యయనం చేసేందుకు మంత్రులు దశల వారీగా సింగపూర్ వెళ్లాలని సూచించారు. కొన్ని జిల్లాల పేర్లు మార్పు, పలు నియోజకవర్గాలు పక్క జిల్లాల్లో విలీన ప్రక్రియ ప్రతిపాదనలు నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వం సృష్టించిన గందరగోళ పరిస్థితికి త్వరితగతిన తెరదించాలన్నారు. దీనిపై ఇటీవలే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైనందున పని వేగవంతం చేయాలని సూచించారు. లిక్కర్ స్కామ్ కేసు దర్యాప్తు దశలో ఉందన్నారు. దర్యాప్తు ఆధారంగా అరెస్టులు ఉంటాయన్నారు. అయితే, లిక్కర్ కేసు విషయంలో మంత్రులు ఆచితూచి స్పందించాలన్నారు. లిక్కర్ కేసు సున్నితమైన అంశమని, అందువల్ల మంత్రులు కూడా దానిపై అతిగా స్పందించవద్దని, ఏదిపడితే అది మాట్లాడొద్దని హితవు పలికారు. అదే సమయంలో ఏపీ లిక్కర్ స్కామ్ కేసు విషయంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారాన్ని ఖండించాలని సూచించారు. ఆ పార్టీ నేతల ఎదురుదాడిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని మంత్రులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

రోడ్డు ప్రమాదంలో సీపీఐ నేత అయోధ్య దుర్మరణం

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగించారు. పినపాక నియోజకవర్గంలో గ్రామ గ్రామాన సీపీఐని విస్తరించడంలో ఆయన పాత్ర మరువలేనిది. నిర్బంధాలు ఎన్ని ఎదురైనా ప్రజల పక్షాన నిలిచి సమస్యలు పరిష్కరించడంలో దిట్టగా ఆయనకు మంచి పేరు ఉంది. నిరంతరం పేదలకు అండగా నిలిచారు. తుది శ్వాస విడిచే వరకు పార్టీ సిద్ధాంతాలు ఆచరిస్తూ ఆచరణాత్మక జీవితాన్ని గడిపారు. అయోధ్య ను బూర్జువ పార్టీలు ప్రభావితం చేయలేకపోయాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా జడ్పీ ఉపాధ్యక్షులుగా, మణుగూరు జడ్పీటీసీగా పదవులు అలంకరించిన ఆయన ప్రజా క్షేత్రంలో ఆయా పదవులకే వన్నె తెచ్చారు. ఏడుపదుల వయస్సులో కూడా ఏజెన్సీ ప్రాంత వాసులకు బాసటగా నిలిచి అనేక పోరాటాలతో స్ఫూర్తిని నింపుతూ వస్తున్నారు. నీతి నిజాయితీకి కమ్యూనిస్టుల సిద్ధాంతాలకు భావాజాలమై ప్రయాణించారు. ఉద్యమ నేతకు నివాళులు అర్పించేందుకు వచ్చిన యావత్ ప్రజానీకంతో మణుగూరు జనసంద్రంగా మారింది. కడసారి చూసి ఘన నివాళులర్పించారు. అయోధ్య అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామమైన రామానుజవరంలో జరగనున్నాయి.

నారాయణ, కూనంనేని సంతాపం

అయోధ్య మృతికి సీపీఐ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చాడా వెంకట్‌రెడ్డి, సాబీర్ పాషా, నెల్లికంటి సత్యం, చెన్నకేశవులు, బి. వెంకటేశం, నేర్లకంటి శ్రీకాంత్, శ్రీరాములు, అంజయ్య, దశరథ్, శివ, తక్కలపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, రేణుకా చౌదరి, భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు, సీతక్క, తమ్మినేని వీరభద్రం, ఈటల నరసింహ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. బుదవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపట్టానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి పి ఓ దేవ్‌రాజ్, డి పి ఆర్ ఓ రఫిక్, కలెక్టరేట్ ఏ.ఓ. రాజ్ కుమార్, సూపర్ ఇండెంట్ మంజుల, శివకుమార్, మాధవి, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర-మరిపెడ: ఉన్నత ఫలితాలను సాధించాలంటే రాజీలేని పోరాటాలు చేయాలని, లక్ష్యం సాధించేవరకు విశ్రమించకూడదని దీనికి ఆచార్య జయశంకర్ సార్ నిదర్శమని వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరిపెడ ప్రధానోపాధ్యాయులు అనంతరావు అన్నారు. బుధవారం మరిపెడ ఉన్నత పాఠశాలలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ ఉపాధ్యాయులు నందిగామ జనార్దనా చారి మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ తెలంగాణ కోసం ఆజన్మ బ్రహ్మచారిగా ఉంటూ అవిశ్రాంతంగా, అలుపెరుగని పోరాటం చేశారన్నారు. ఉపాధ్యాయులు దేవ్లా, శ్రీశైలం, నెహ్రూ, ప్రకాష్, శౌరి, లెనిన్, ప్రసాదరావు, సారయ్య, జహేదా బేగం, సురేష్, బాబురావు, అనిత విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వనపర్తి : తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ కీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య పాల్గొని నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం కోసం అహర్నిశలు పాటుపడిన గొప్పవ్యక్తి జయశంకర్ అని కొనియాడారు. ఏవో భాను ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల పురపాలిక పరిధిలోని రామాపురం నందుగల ఎం జె పి టి బి సి బాలుర గురుకుల పాఠశాలలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా, వారి చిత్రపటానికి పూలతో ఘనమైన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మల్లేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జయశంకర్ ఆలోచనలు, సిద్ధాంతాలతోనే తెలంగాణ రాష్ట్రం కల సాకారమైందని, వారి ఆశయ సాధనకు తెలంగాణ ప్రజానీకం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్‌తో పాటు ఏటీపీ నాగరాజు, డిప్యూటీ వార్డెన్ సోమయ్య, ఎన్సిసి సీటీవో గోపాలరావు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: గోదావరిఖని సింగరేణి ఆర్జీ-1 జీఎం కార్యాలయంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. జీఎం డి.లలిత్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. తెలంగాణాకు సంబంధించిన నీరు, నిధులు, నియమాకాలు మనవి మనమే సాధించుకోవాలని అహర్నిషలు పోరాటం చేసిన మహానుభావుడని తెలిపారు. అధికారులు ఆంజనేయ ప్రసాద్, రవీందర్ రెడ్డి, క్రాంతి కుమార్, హనుమంత రావు,ఎఐటియుసి ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గోదావరిఖని టిబీజీకెఎస్ కార్యాలయంలో నిర్వహించినన వేడుకల్లో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ముఖ్యఅతిధిగా పాల్గొని జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి తెలంగాణ ఉద్యమానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. నాయకులు గోపు ఐలయ్య యాదవ్, నారాయణదాసు మారుతి, బోడ్డు రవీందర్ కల్వచర్ల కృష్ణవేణి పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని స్టేట్ ఫంక్షన్ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపట్టానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై ఫోక్సో కేసు నమోదు చేయాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతి గిరిజన విద్యార్థిని పట్ల కంప్యూటర్ ఆపరేటర్, ఉపాధ్యాయుడు గత కొంత కాలంగా లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ మాట్లాడారు. ఏకలవ్య పాఠశాలలో టీచర్ గుడిగా మారిన ఉపాధ్యాయుడిపై వెంటనే ఫోక్సో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైన విద్యార్థిని తన తల్లిదండ్రులకు ఈ విషయం వెల్లడించినట్టు తెలిపారు. ఏజెన్సీ మండలాలు గ్రామాల్లో నిర్వహిస్తున్న గురుకులాల్లో ఆదివాసి విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. గతంలో కూడా అనేక ఉదంతాలు జరిగాయని వాటిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోలేదని, పర్యవేక్షణ లోపాలు కూడా అనేకం ఉన్నాయని విమర్శించారు. ఉపాధ్యాయులే ఆడ పిల్లలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, లైంగిక వేధింపులకు గురి చేస్తుంటే ఇంకా ఎక్కడ రక్షణ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లల గురుకులాలు పాఠశాలల్లో మహిళ ఉపాధ్యాయులు, సిబ్బంది నే నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి విద్యార్థి సంఘం నాయకుడు ఇర్ప ప్రకాష్ దొర, చర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, ఇర్ప అరుణ్ కుమార్, కోర్స నరేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పురోగతి పెంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ఈనెల 13 నాటికి నకిరేకల్ నియోజక వర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని 20 శాతానికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె కేతేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ఏపిఎంలతో ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నియోజక వర్గంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతి తక్కువ శాతం ఉన్న మండలాలు ఈ నెల 13 నాటికి కనీసం 20 శాతం పురోగతి తీసుకురావాలని చెప్పారు. పురోగతి తక్కువగా ఉండడానికి గల కారణాలను విశ్లేషించగా ఇసుక సమస్య ఉందని, ఎం పి డి వోలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఇసుక, మెటల్, రా మెటీరియల్ సమస్యలు రాకుండా తహసిల్దార్లు పరిష్కరించాలని చెప్పారు. "మన ఇసుక మన వాహనం" ద్వారా ఇసుకను ఇచ్చే విధంగా చూడాలని, ఏ రీచ్ నుండి ఎంత ఇసుకని ఇస్తున్నారో మ్యాపింగ్ చేయాలని, ఈ విషయంలో ఆర్డీవో ఏ మండలం నుండి ఎక్కడ ఇసుక ఇవ్వాలో నిర్ణయించాలని చెప్పారు. ఇండ్లు మంజూరై నిర్మాణం చేసుకోలేని అతి బీదవారిని గుర్తించి స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల ఋణం ఇచ్చేందుకు గుర్తించిన లబ్దిదారుల జాబితాను ఈ నెల 8లోగా బ్యాంకులకు పంపించే బాధ్యత ఏపీఎంలపై ఉందని అన్నారు. ఎవరైనా స్వయం సహాయక మహిళా సంఘాలలో సభ్యత్వం లేని వారు ఉంటే వారిని వెంటనే సభ్యులుగా నమోదు చేసుకుని వారికి లోన్ వచ్చేలాగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల బాధ్యత అందరిదని, ఈ విషయంలో తహసిల్దారులు, ఎంపీడీవోలు చొరవ తీసుకోవాలని, ముఖ్యంగా లక్ష రూపాయల రుణం ఇప్పించే విషయంలో కచ్చితంగా పురోగతి తీసుకువచ్చేలా ఏపిఎంలు పనిచేయాలన్నారు. వన మహోత్సవం కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని, భూభారతి దరఖాస్తులను కలెక్టర్ సమీక్షించారు.గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, జడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, నల్గొండ ఆర్ డి ఓ వై.అశోక్‌రెడ్డిలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

విశాలాంధ్ర బ్యూరో - నాగర్‌కర్నూల్ : ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, వైద్యులకు కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పేద ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేలా క్షేత్రస్థాయిలో వైద్యులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం బిజినపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, ఔషధాల నిలువలను కలెక్టర్ పరిశీలించారు. బిజినపల్లి మండల కేంద్రంలోని గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, వైద్యులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అందరూ రెగ్యులర్ విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గదులు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు ఎన్ని డెలివరీ కేసులు నమోదు అయ్యాయని ఎన్ని నార్మల్ ప్రసవాలు జరిగాయని, జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, వైద్యులకు కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, పేద ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేలా క్షేత్రస్థాయిలో వైద్యులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

భక్తులకు మజ్జిగ వితరణ

విశాలాంధ్ర - తొర్రూర్: లైన్స్ క్లబ్ తొర్రూర్ ఆధ్వర్యంలో బుధవారం తొర్రూర్ లో బోనాల పండుగ సందర్భంగా ముత్యాలమ్మ గుడి దగ్గరికి వచ్చిన భక్తులకు మజ్జిగ, వాటర్‌ను అందించడం జరిగిందని లైన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ సూర్నం రామనరసయ్య అన్నారు. క్యాలెండర్ ఆఫ్ ఈవెంట్ హిరోషిమా డే సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తులకు తో ఆయన మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం చివరి దశలో జపాన్ నగరాలైనా హిరోషిమా, నాగసాకిలపై అమెరికా పాచ్యత్య దేశాలు జరిపిన అణుబాంబు దాడి, దాని వలన కలిగిన దుష్పరిణామాలు, నష్టాలు గురించి ఆ తర్వాత నెలల్లో గాయాల వలన రేడియేషన్ వలన, సిక్నెస్ వలన పౌష్టికాహార లోపంతో చాలా మంది ప్రజలు మరణించారని ప్రజలకు అవేర్నెస్ కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ సెక్రెటరీ తంగళ్ళపల్లి వెంకన్న, క్లబ్ సెక్రటరీ ముదుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, క్లబ్ జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఉత్పత్తులతో కుటుంబాలకు ఆదరణ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: మహిళా సంఘాల తయారు చేసిన ఉత్పత్తుల ద్వారా కుటుంబాలకు మేలు జరుగుతుందని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ లెనిన్ వాత్సల్ టోప్పో అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని తొర్రూరు బస్టాండ్ నందు ఏర్పాటు చేసిన ఆకాంక్ష హాట్ స్టాల్స్, ఆకాంక్షిత గంగారం మండలంలో భాగంగా ఈనెల 4వ తేదీ నుండి 8వ తేదీ వరకు తొర్రూర్ బస్టాండ్ నందు వోకల్ ఫర్ లోకల్ ఆకాంక్ష హాట్‌లో 20కి పైగా ప్రామాణిక సాంప్రదాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం 12 స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. ఇట్టి ప్రదర్శనలో మహబూబా బాద్ జిల్లాలో మహిళా స్వయం సహాయక బృందాలు, ఆదివాసి కళాకారులు, గ్రామీణ పారిశ్రామికులు తయారు చేసిన ఉత్పత్తులు ప్రదర్శించడం జరిగిందని, ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొని, మహిళా సంఘాల కృషిని ప్రశంసించి వారి ఉత్పత్తులను రుచి చూశారు. ఇందులో ప్రధానంగా అడవిలో లభ్యమయ్యే ఇప్పపువ్వు ద్వారా లడ్డు తయారీ, మిల్లెట్ బిస్కెట్లు గిరిజన తేనె, చేతితో తయారయ్యే జ్యూట్ బ్యాగులు, గిరిజన ఉత్పత్తులు, మరెన్నో ప్రత్యేక ఉత్పత్తులు ఇట్టి ప్రదర్శనలో ప్రదర్శించారని తెలిపారు. ఎంపిడిఓ మీర్జా మునవర్ బేగ్, మహబూబాబాద్ తాసిల్దార్ రాజేశ్వర్, అస్పిరేషనల్ బ్లాక్ అధికారి శ్రీనాథ్ హళ్కే, ఎంపీడీవో రఘుపతి రెడ్డి, మెప్మా పిడి విజయ, మహిళా సంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

తెలంగాణ సాంస్కృతిక ప్రతిభకు జాతీయ గుర్తింపు



విశాలాంధ్ర - బూర్గంపాడు : జాతీయ స్థాయిలో అమలవుతున్న నూతన జాతీయ విద్యా విధానం 2020లో భాగంగా, రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లోని సీసీఆర్టీ (సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రెయినింగ్) కేంద్రంలో నిర్వహించిన 21 రోజుల జాతీయ ఉపాధ్యాయ శిక్షణా శిబిరంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బెస్ట్ ప్రాక్టీస్ ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా నిలిచారు. ఇందులో ముఖ్యంగా కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజరలోని జెడ్ పి ఎస్ ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు మోహన్ తన బెస్ట్ ప్రాక్టీస్‌ను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఆయనతో పాటు ఉమా మహేశ్వరరావు, ఓదెలు, పవిత్ర, శంకర్, మహమ్మద్ షఫీ, ఇర్షాద్ అలీ, ఆచరిత, సీతల్ ఉత్తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ శిక్షణలో వారు తెలంగాణ సాంస్కృతిక సంపదలైన బతుకమ్మ, బోనాలు, తీజ్, సమ్మక్క సారలమ్మ జాతర వంటి పండుగలు కండ్లకు కట్టినట్టు ప్రదర్శించడంతో పాటు జయ జయహే తెలంగాణ అంటూ రాష్ట్ర గీతాన్ని ఆలపిస్తూ ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులను ఉత్సాహ పరిచారు. ఎఫ్ ఎల్ ఎన్, నిపున్ భారత్, నిస్తా, లిప్ వంటి విద్యా అంశాలపై అవగాహన పెంపొందించడమే కాక, ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్, స్వచ్ఛ భారత్, విలువ విద్య, విద్యలో సాంస్కృతిక సమన్వయంపై పలు మాడ్యూల్స్,ఐసీటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ నీ శిక్షణలో భాగంగా చేసి చూపించడం జరిగింది. పేపర్ మేశీ, టెర్రకోట శిల్పకళ, చిత్రకళ, బంధిని డిజైన్లు, పప్పెట్ షోలు, చిత్రకళా ప్రదర్శనలు, సంగీతం-నాట్యం వంటి కళా రూపాలను విద్యా సాధనంగా ఎలా ఉపయోగించాలో అనుభవాత్మకంగా నేర్చుకున్నారు. అలాగే శిల్పగ్రామ్, చిత్తోడ్ ఫుడ్ కోట,సిటీ ప్యాలెస్, హల్దీ ఘాటీ, సాస్ బహు దేవాలయం, ఏకలింగేశ్వర ఆలయం వంటి చారిత్రక ప్రదేశాలను, విద్యా సంస్థలను సందర్శించి రాజస్థాన్ లో అమలవుతున్న విద్యా విధానం ను పరిశీలించడం జరిగింది. ఈ శిక్షణలో జిల్లా ఉపాధ్యాయులు తెలంగాణ సత్తాను జాతీయ స్థాయిలో నిలబెట్టడంతో సర్వత్ర అభినందనలు వ్యక్తమవుతున్నాయి.

ఆచార్య జయశంకర్‌కు కలెక్టర్ నివాళులు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర ఏర్పాటుకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య జయశంకర్ అని కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో బుధవారం తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ 91వ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిఆర్ఓ భుజంగరావు, ఏవో యునస్, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, సహాయ అధికారి గంగా కిషన్, ఎస్సీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, వసతి గృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

ఆకుపచ్చ తెలంగాణ మనకర్తవ్యం

పర్యావరణ రక్షణకు ఆకుపచ్చ తెలంగాణగా తీర్చిదిద్దడమే మనందరి కర్తవ్యమని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పరిషత్ హై స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. నర్సాపూర్ ప్రభుత్వ కళాశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా 1000 మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి వాటి సంరక్షణకు వారే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నంతరం నర్సాపూర్ రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు.

ప్రతి నెల అర్హులందరికీ పెన్షన్ అందేలా చూడాలి

విశాలాంధ్ర -ములుగు జిల్లా బ్యూరో : ప్రతి నెల అర్హులందరికీ పెన్షన్ అందే విధంగా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పెన్షన్ అమలుపై ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్, పంచాయతీ కార్యదర్శులకు, బిల్లు కలెక్టర్లు, పోస్టల్ డిపార్ట్మెంటకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పెన్షన్‌కు అర్హత ఉన్న వారందరినీ ప్రతినెల పెన్షన్ ఇప్పించే విధంగా కృషి చేయాలని, ముఖచిత్రం ద్వారా పెన్షన్ ఇవ్వడం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. డిపిఓ దేవ్‌రాజ్, అదనపు డిఆర్డిఓ గొట్టే శ్రీనివాస్, ములుగు మున్సిపాల్ కమీషనర్ సంపత్, టీజీ ఆన్లైన్ ప్రతినిధి రాజు, జిల్లాలోని ఎంపీడీవోలు, సెర్ప్ డిపిఎంలు, ఏపిఎంలు, సిసీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌరికుంట తండాలో వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రారంభోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుంది అని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ప్రతి ఒక్కరూ వెంకటేశ్వర స్వామి అనుగ్రహం పొందాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతు బంధు అధ్యక్షులు కేసాని లింగారెడ్డి, పెద్దిశెట్టి సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రమావత్ తులిసిరం, మాజీ సర్పంచ్ రమావత్ దీప్ల నాయక్, రమావత్ రమేష్, రమావత్ కృష్ణ, వెంకటయ్య, శివ పాల్గొన్నారు.

పోడు భూముల సాధనకు రైతుల పాదయాత్ర

విశాలాంధ్ర - కొమరం భీం : చింతలమానేపల్లి, దిందా గ్రామానికి చెందిన పోడు రైతులు బుధవారం తమ హక్కుల కోసం పాదయాత్ర ప్రారంభించారు. హైదరాబాదు బేగంపేటలోని ప్రజాభవన్ వరకు ఈ పాదయాత్ర చేపట్టారు. దశాబ్దాలుగా సాగుచేస్తున్న భూములను తమకు అధికారికంగా మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి పలుమార్లు వినతులు చేసినా స్పందన లేకపోవడంతో తమ పోరాటాన్ని హైదరాబాదుకి తీసుకెళ్తున్నామని తెలిపారు.

ఢిల్లీ ధర్నాలో పెద్దపల్లి ఎంపి గడ్డం

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి: బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించాలంటూ ఢిల్లీలో జరిగిన భారీ ధర్నాలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ ధర్నాకు దేశం నలుమూలల నుండి 50 మంది కాంగ్రెస్ ఎంపీలు సంఘీభావం ప్రకటించారని వంశీ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం బీసీలను పట్టించుకోవడం లేదు. రాహుల్ గాంధీ నాయకత్వంలో బీసీలకు న్యాయం జరిగే దాకా మా పోరాటం ఆగదని అన్నారు. ధర్నాలో ఉత్సాహంగా పాల్గొన్న నాయకులకు, కార్యకర్తలకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. బీసీల హక్కుల కోసం ఎక్కడైనా, ఎప్పుడైనా నేను పోరాటానికి సిద్ధం అని అన్నారు

నిబద్ధత గల నాయకుడు అయోధ్య

విశాలాంధ్ర - ఖమ్మం : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొల్లోజు అయోధ్య మరణంతో కమ్యూనిస్టు పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయిందని సిపిఐ నేతలు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన సిపిఐ నాయకుడు బొల్లోజు అయోధ్య మృతదేహాన్ని ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్కు తీసుకు వచ్చారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, పోకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దాబ్బాయి), సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఎస్కె సాబీర్పాషా, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు అయోధ్య పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే ఎర్ర జెండా పట్టిన అయోధ్య తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడలోనే పని చేశారని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన నాయకుడన్నారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మణుగూరు ప్రాంతంలోని -వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నిర్మాణం కోసం అయోధ్య విశేష కృషి చేశారని ఆయన తెలిపారు. ఆయన మరణం పేద ప్రజలకు, హక్కుల కోసం పోరాడే వారికి తీవ్ర నష్టమని ఆయన తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పునరంకితమవుతామన్నారు. నివాళులర్పించిన వారిలో పోకాలపాటి లలిత రాజేశ్వరి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, -మిరియాల రంగయ్య, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, ముత్యాల సత్యనారాయణ, పలువురు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు ఉన్నారు.

అయోధ్య మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బి.అయోధ్య మృతి చెందటం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్కె సాబిర్ పాషా అన్నారు. బుధవారం తెల్లవారుజామున సూర్యాపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. హైదరాబాదులో వైద్యం చేయించుకొని గురువారం జరగనున్న రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొనేందుకు వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కలిచివేసిందన్నారు. బుధవారం సాయంత్రం అయోధ్య పార్థివ దేహాన్ని జిల్లా సిపిఐ కార్యాలయం 'శేషగిరిభవన్'కు పార్టీ శ్రేణుల సందర్శనార్థం తరలించారు. సిపిఐ, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయపక్షాల నాయకులు అయోధ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా రాజకీయాల్లో కమ్యూనిస్టు నేతగా ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. జిల్లా రాజకీయాలను శాశించే స్థాయికి కమ్యూనిస్టు పార్టీని తీసుకెళ్లడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. అయోధ్య మృతి ప్రజా ఉద్యమాలకు, కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కొత్తగూడెం పట్టణ పురవీధులమీదుగా భారీ ఊరేగింపుతో వీడ్కోలు పలికారు. నివాళిలర్పించిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్య, ఉర్దూఘర్ చైర్మన్, మైనార్టీ రాష్ట్ర నాయకులు నయీమ్ ఖురేషి, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి ముద్ద బిక్షం, కాంగ్రెస్ నాయకులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, భూక్యా దస్రు, వాసిరెడ్డి మురళి, యు.రాహుల్, ఎస్ కె ఫహీమ్, జిల్లా సమితి సభ్యులు దమ్మాలపాటి శేషయ్య, జి వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వరరావు, గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, పద్మ, ధనలక్ష్మి, దార శ్రీను, అబిద్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర- చర్ల : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలే కాకుండా ప్రజల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేస్తూ పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం చర్ల లోని రైతు వేదిక వద్ద నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా 18 మంది లబ్దిదారులకు చెక్కులు, నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాలుగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వల్ల సామాన్య పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రవ్యా ప్తంగా రేషన్ కార్డులు లేని పేద వారందరికీ పంపిణీ చేయటం గర్వంగా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యు త్ ప్రభుత్వానికి చాలా సంతృప్తినిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈదయ్య, ఎంపివో వలీ హుజ్రత్, సివిల్ సప్లయ్ డిటి రాజులు, ఏపిఎం లక్ష్మి దుర్గ, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలలో హిరోషిమా డే సెమినార్

విశాలాంధ్ర - భద్రాచలం : రెండవ ప్రపంచ యుద్ధంలో అమెరికా అణు బాంబు వల్ల ధ్వంసమైన జపాన్ లోని హీరోషిమా, నాగసాకి నగరాల చరిత్ర పై విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమంలో నిర్వహించారు. అణు దాడి వలన జరిగే నష్టాలను ఆ పట్టణాలు ఎదుర్కొన్న పరిస్థితుల మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కమల రాజశేఖర్, పరిమి సోమశేఖర్ మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం ముగింపు దశలో జపాన్ నగరాల మీద అమెరికా అణు బాంబు మానవ చారిత్రకత తప్పిదంగా మారిందన్నారు. మానవజాతి చరిత్రలో అత్యంత దారుణమైన సంఘటనగా దీన్ని చరిత్రలో ఎక్కించినట్లు తెలిపారు. కాగా వ్యాసరచనలో మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థునిలకు బహుమతులు ఇచ్చారు.

సరికొత్త ప్యాక్‌లో సంతూర్ రాయల్ సాండిల్

కర్నూలు : సంతూర్ రాయల్ సాండిల్ అనేది విప్రో వినియోగదారుల సంరక్షణ, కాంతి అనేది ఒక ప్రీమియం సంతూర్ పోర్ట్‌ఫోలియో కిందకి వస్తుంది. అది కొత్త ట్రిపుల్ సాండిల్ ప్యాక్‌ను పరిచయం చేస్తూ దాని చర్మ సంరక్షణ రేంజిని విస్తరించింది. సినీ నటి మీనాక్షి చౌదరీ టీవీ కమర్షియల్ ద్వారా దీన్ని లాంచ్ చేశారు. ఈ కొత్త ఆఫర్ మూడు ఉత్పత్తులు అయిన సోప్, సాండిల్ వుడ్ ఫేస్ ప్యాక్, సాన్డిల్ ఫేస్ క్రీమ్‌లతో మనల్ని దగ్గరకు చేరుస్తుంది. మూడు దశల చర్మ సంరక్షణలో భాగంగా మెరుగైన పనితీరుని అందిస్తూ చర్మ సౌందర్యాన్ని పెంచుతూ నల్ల మచ్చలను తగ్గిస్తుంది. ఎంఎస్ పరిశోధన క్లినిక్ నిర్వహించిన క్లినికల్ అధ్యయనం ప్రకారం ఒక వారం రోజుల వాడుక తరువాత మెరుగైన మురుగుదలని చూసామని రెజిమెన్ వివరించారు. టాన్ తగ్గడం మాత్రమే కాకుండా నాల్గవ వారంలో నల్ల మచ్చలు కుడా తగ్గి మంచి కాంతిని గమనించారు. ఈ ఫార్ములాని డెర్మటాలజీ ప్రకారం టెస్ట్ చేసారు. ఇది అన్ని రకాల చర్మాల వారికి సరిపోతుందని లైటెనింగ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ప్రసన్న రాయ్ అన్నారు.

సంపాదకీయం

పిచ్చివాడి చేతిలో రాయి

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ది మొదటి నుంచీ విపరీతమైన ప్రవర్తనే. గత జనవరిలో అధ్యక్షుడైన తరవాత ఆయన ప్రవర్తనలో వైపరీత్యం మరింత పెరిగింది. మన దేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వస్తువుల మీద విపరీతమైన సుంకాలు విధిస్తోందన్న వాదన మొదలు పెట్టారు. ప్రతీకారంగా మనం ఎగుమతి చేసే వస్తువులపై 25 శాతం సుంకం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ వైపరీత్యాన్ని ఎదిరించే ప్రయత్నం చాలాకాలం మోదీ ప్రభుత్వం చేయనే లేదు. ట్రంప్ తనకు సన్నిహిత మిత్రుడని మోదీ ఎంతగా చెప్పుకున్నా ట్రంప్ మాత్రం మన దేశం విషయంలో శత్రుపూరిత వైఖరే అనుసరిస్తున్నారు. అయితే ఆయన సుంకాల విధింపు చెలగాటం మన ఒక్క దేశానికే పరిమితమైంది కాదు. ఇతర దేశాలతో కూడా ఇలాగే వ్యవహరిస్తున్నారు. చివరకు మోదీ ప్రభుత్వం కూడా సుంకాల విషయంలో ట్రంప్‌ను ఎదిరించక తప్పని స్థితి ఏర్పడింది. ప్రపంచంలో తనంత మొనగాడు లేడని ట్రంప్ భావిస్తారు. ఆయన కోపతాపాలు, అభిమానాలు ఏ రోజు ఎలా ఉంటాయో చెప్పలేం. అవి అనునిత్యం మారుతూనే ఉంటాయి. నిలకడగా ఉండడం ట్రంప్ నైజం కాదు. ఒక రోజు భారత్ తనకు అత్యంత సన్నిహిత దేశం అంటారు. అదే నోటితో పాకిస్థాన్ మీద కూడా ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తారు. ఈ ధోరణిని కేవలం భౌగోళిక రాజకీయాలలో భాగంగా కొట్టి పారేయలేం. ఇది కేవలం ట్రంప్ చంచల స్వభావానికే నిదర్శనం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా అధ్యక్షుడిని గట్టిగా ఆలింగనం చేసుకుంటారో లేక ట్రంపే ఆ పనిచేస్తారో తెలియదు. అమెరికా అధ్యక్షుడిగా తాను ప్రమాణం స్వీకరించే ఉత్సవానికి మోదీని ఆహ్వానించలేదు. ట్రంప్ దగ్గర నుంచి ఆహ్వానం రాబట్టడానికి మన విదేశాంగ మంత్రి జై శంకర్ వారం రోజులు అమెరికాలోనే ఉండి ప్రయత్నించినా ఆహ్వానం అందనేలేదు. ఆ సమయంలో జై శంకర్‌కు కనీసం ట్రంప్‌ను కలుసుకునే అవకాశమైనా రాలేదంటారు. వాణిజ్యానికి సంబంధించినంత మేరకు రష్యాతో మన వాణిజ్యం ట్రంప్‌కు కంటగింపుగా ఉంది. ఏ దేశం మరే దేశంతో వాణిజ్య సంబంధాలు పెట్టుకోవాలో కూడా తానే నిర్ణయించాలనుకుంటారు ట్రంప్. కానీ వివిధ దేశాల మధ్య సంబంధాలు ఆయన ఇష్టానుసారం సాగవు. ఏ దేశ ప్రయోజనాలు ఆ దేశానికి ఉంటాయి. రష్యాతో మన బంధం, వాణిజ్య సంబంధాలు, ఆయుధ వ్యాపారం ఈ నాటివి కావు. మునుపటి సోవియట్ యూనియన్ కాలం నుంచి మనకు రష్యాతో సాన్నిహిత్యం ఉంది. మనం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఆదుకున్నది రష్యానే. రష్యాతో వాణిజ్య సంబంధాలు పెట్టుకుంటే మన దేశం మీద జరిమానా విధిస్తామంటారు ట్రంప్. ఇరవై నాలుగు గంటలు గడవక ముందే ఈ జరిమానా మరింత పెంచుతానని హుంకరిస్తారు. ఉక్రెయిన్ మీద యుద్ధం చేస్తున్న రష్యాతో భారత్ వాణిజ్య సంబంధాలు ఏమిటి, స్నేహం ఏమిటి అని కూడా ఆయన ప్రశ్నిస్తారు. పాకిస్థాన్‌తో మనం ఘర్షణ పడవలసి వచ్చినప్పుడు అండగా నిలబడింది రష్యానే అని మోదీ కూడా గుర్తు చేసుకోకపోవచ్చు కానీ వాస్తవం అది. పాకిస్థాన్‌లో గ్యాస్, పెట్రోలియం నిలవల కోసం తాము అన్వేషిస్తామని అప్పుడు పాకిస్థాన్ నుంచి చమురు, గ్యాస్ దిగుమతి చేసుకోవలసిన స్థితి వస్తుందని ట్రంప్ శపిస్తారు. ఈ శాపాల మాట ఎలా ఉన్నా చమురు, గ్యాస్ అన్వేషణ విషయంలో అమెరికా మనల్ని ఎంత మోసం చేసిందో విస్మరించడం కష్టమే. మన దేశంలో చమురు, గ్యాస్ నిలవలు కనిపెట్టే బాధ్యతను నెహ్రూ హయాంలోనే అమెరికాకే అప్పగించారు. కానీ ఈ దేశంలో ఒక్క ఔన్స్ గ్యాస్ కానీ, ఒక్క చుక్క చమురు కానీ లేదని అప్పుడు అమెరికా చెప్పేసింది. ఆ తరవాత చమురు నిలవల అన్వేషణ బాధ్యతను అప్పటి సోవియట్ యూనియన్‌కు అప్పగించాం. అప్పుడే బాంబే హైలో చమురు నిల్వలు బయటపడ్డాయి.

అమెరికాతో మనకు అనేక రకాల సంబంధాలు ఉండొచ్చు. కానీ ఆ సంబంధాలు శాశ్వతం కావు అని ట్రంప్ నిరూపిస్తున్నారు. అమెరికాను నమ్మలేం అన్న ఆత్మజ్ఞానం కలిగిస్తున్నారు ఆయన. ట్రంప్‌కు సొంతంగా అనేక వ్యాపారాలున్నాయి. స్థిరాస్తి వ్యాపారంలో కూడా ఆయనది పెద్ద చేయే. ట్రంప్ స్థిరాస్తి వ్యాపారం మన దేశంలోనూ కొనసాగుతోంది. 2012 నుంచి 2024-2025 మధ్య మన దేశంలో ట్రంప్ స్థిరాస్తి వ్యాపారం అనేక రెట్లు పెరిగింది. ముంబై, బెంగళూరు, హైదరాబాద్, నోయిడా లాంటి చోట్ల ట్రంప్ స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారం, నివాస భవనాల నిర్మాణం మొదలైన అనేక రంగాలలో ట్రంప్ కంపెనీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఆయన కంపెనీలు వందలు, వేల కోట్ల లాభాలు మూటగట్టుకు వెళ్తున్నాయి. మన దేశంలో ట్రంప్ వ్యాపారాలకు ఎర్ర తివాచీలు పరిచేటప్పుడు ప్రధానమంత్రి మోదీకి "స్వదేశీ" అన్న మాటే గుర్తురాదు. స్వదేశీ గురించి ఆయన ప్రబోధాలన్నీ సామాన్యుల కోసమే. భవన నిర్మాణరంగంలో ఉన్నవారు మన దేశంలో ట్రంప్ వ్యాపారాల్లో పెట్టుబడి పెడుతున్నారు. కలిసి వ్యాపారాలు చేస్తున్నారు. ట్రంప్ ఆర్గనైజేషన్ ఇండియా పేర ఈ వ్యాపార సంబంధాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆరు నగరాల్లో ట్రంప్ భవన నిర్మాణ కార్యక్రమాలు 11 మిలియన్ చదరపు అడుగుల మేర విస్తరించి ఉన్నాయి. ముంబై, గుర్‌గాం, నోయిడా, బెంగళూర్, హైదరాబాద్ లాంటి చోట్ల మరో ఏడు భవన నిర్మాణ కార్యక్రమాలతో ట్రంప్ కంపెనీలకు సంబంధం ఉంది. లాభాలు నొల్లుకోవడానికి అపారమైన అవకాశాలు ఇచ్చాం. ఇంత భారీ ఎత్తున ట్రంప్ కంపెనీల వ్యాపారం కొనసాగుతూ ఉంటే భారత్ ఆర్థికవ్యవస్థ మృత ప్రాయమైంది అన్న ఉన్మాదపూరిత వ్యాఖ్యలు ట్రంప్ తప్ప మరెవరూ చేయలేరు. మృత ప్రాయమైన ఆర్థిక వ్యవస్థ ఉన్న దేశంలో ట్రంప్ ఎందుకు వ్యాపారం చేస్తున్నట్టు? అమెరికా వెలుపల విస్తరించి ఉన్న ట్రంప్ స్థిరాస్తి వ్యాపారంలో జ్యేష్ఠ భాగం భారత్‌లో ట్రంప్ కంపెనీలదే. గత ఎనిమిది నెలల కాలంగా మన దేశంలో స్థిరాస్తి వ్యాపారం అవధుల్లేకుండా పెరిగిపోతోంది. ట్రిబేకా డెవలపర్స్ ట్రంప్ స్థిరాస్తి వ్యాపారంలో ప్రధాన భాగస్వామి. ఇది మచ్చుకు మాత్రమే. అనేక కంపెనీలకు ట్రంప్‌తో భాగస్వామ్యం ఉంది. ఒక్క హైదరాబాద్‌లోనే చూస్తే 63 అంతస్తుల భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటి ద్వారా ట్రంప్‌కు 3,500 కోట్ల రూపాయల లాభం సమకూరనుంది. ఇన్ని లాభాలు మన దేశం నుంచి తరలిచుకుపోతున్న ట్రంప్ మనది మృతప్రాయమైన ఆర్థికవ్యవస్థ అంటారు. సామాన్యుల దృష్టిలో చూస్తే ఈ మాట నిజమే అనిపించవచ్చు. కాని బడా వ్యాపారులు పండగ చేసుకుంటున్నారు. సుంకాలు విధిస్తామని, రష్యాతో వ్యాపారం చేస్తున్నందుకు జరిమానా విధిస్తామని ట్రంప్ హుంకరించడం కేవలం ఉన్మాదం కాదు. ఇది బడా వ్యాపారవేత్తల అహంకారం.

బురదలోని కెందామర సత్యపాల్ మాలిక్

ఆర్వీ రామారావ్

బీహార్, జమ్మూ-కశ్మీర్, గోవా, మేఘాలయ రాష్ట్రాల గవర్నర్‌గా పని చేసిన సత్యపాల్ మాలిక్ మరణం బీజేపీ నేతలలో ఎలాంటి విచారమూ మిగిల్చినట్టు లేదు. ఆయన మరణం తరవాత నాలుగు గంటల దాకా ఏ బీజేపీ నాయకుడూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ప్రధానమంత్రి మోదీ కేవలం 11 పదాలలో "ఎక్స్" వేదిక మీంచి మొక్కుబడి సందేశం మాత్రం పంపారు. రాజకీయ నాయకుడిగా ఆయన జీవితం సగటు రాజకీయ నాయకుడి జీవితం కన్నా ఏ మాత్రం భిన్నమైంది కాదు. 1974లో ఉత్తరప్రదేశ్ శాసన సభ్యుడిగా ఎన్నికైన దగ్గర నుంచి 2022 అక్టోబర్ దాకా మేఘాలయ గవర్నర్‌గా పని చేసినంత కాలం ఆయన రాజకీయాలు సగటు రాజకీయాలకు పరిమితం అయినాయి. సత్యపాల్ మాలిక్ కశ్మీర్ గవర్నర్‌గా ఉండగానే మోదీ ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణాన్ని రద్దు చేసింది. అది ఆయనకు అయిష్టం అయినా అప్పుడూ ఆయన పెదవి విప్పలేదు. 370వ అధికరణం రద్దు 2019 ఆగస్టు అయిదున జరిగితే 2019 ఫిబ్రవరిలోనే పుల్వామాలో తీవ్రవాద దాడిలో 40మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఊచకోతకు గురయ్యారు. ఇది ఆయన మనసును తీవ్రంగా కలచి వేసింది. సీఆర్‌పీఎఫ్ జవాన్లను తరలించడానికి విమానాలో, హెలీకాప్టర్లో అందుబాటులో ఉంచడానికి అప్పటి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిరాకరించింది. అప్పుడు కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్. వారు ట్రక్‌ల్లో వెళ్లకుండా వాయు మార్గంలో వెళ్లినట్టయితే ఆ 40 ప్రాణాలూ మిగిలేవి. సీఆర్‌పీఎఫ్ జవాన్లను తరలించడానికి విమానాలో, హెలీకాప్టర్లో అందుబాటులో ఉంచడానికి నిరాకరించడానికి కేవలం రాజ్‌నాథ్ సింగ్ బాధ్యత మాత్రమే లేదు. బీజేపీ సర్కారులో అంతా మోదీ, అమిత్ కనుసన్నల్లోనే సాగుతుంది. ఈ ఘటన గురించి, 40 మంది జవాన్ల మరణానికి ప్రభుత్వ వైఫల్యమే కారణం అని మాలిక్ ప్రధానమంత్రికి నివేదించాలనుకున్నారు. కానీ మోదీ ఏదో డాక్యుమెంటరీ చిత్రీకరణలో ఉన్నందువల్ల ఎన్నిసార్లు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. చివరకు అందుబాటులోకి వచ్చి మాలిక్‌తో మాట్లాడితే ఆయన అసలు విషయం చెప్పారు. కానీ మోదీ "మీరు నోరు విప్పకండి" అని మాలిక్‌ను ఆదేశించారు. ఆ తరవాత ఎప్పటికో సత్యపాల్ మాలిక్ ఈ వ్యవహారం అంతా బయట పెట్టారు. పుల్వామా మారణకాండను ఎన్నికలలో విజయం కోసం మోదీ ఎంతగా వినియోగించుకున్నారో అందరికీ తెలుసు.

పుల్వామా ఘటన గురించి నిజం బయట పెట్టే దాకా మాలిక్ సగటు రాజకీయ నాయకుడిలాగే వ్యవహరించారు. అందుకే 370వ అధికరణం రద్దును ఎదిరించలేక పోయారు. కానీ మాలిక్ వ్యక్తిత్వానికి మరో పార్శ్వమూ ఉంది. ఆయన సోషలిస్టు భావాలు ఉన్న వారు. అయితే ఎప్పుడూ సోషలిస్టు పార్టీలో లేరు. నిజానికి మాలిక్ రాజకీయాల్లో ఎదిగే నాటికి సోషలిస్టు పార్టీ దాదాపు కనుమరుగై పోయింది. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు ఏడాదిగా నిరసన తెలియజేసినప్పుడు అధికార పక్షంలో ఉన్నా గొంతెత్తింది మాత్రం మాలిక్‌నే. ఆయన రైతు పక్షపాతి. ప్రజాస్వామ్యం మీద విశ్వాసం ఉన్నవారు.

పుల్వామా గురించి అసలు గుట్టు బయట పెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు మాలిక్ తన ఆత్మ ఘోష విన్నారు. అనేక విషయాల్లో ఆయన మౌనంగా ఉన్నా ఆ మౌనం అంతరార్థం కూడా మోదీ మీద దాడే. మాలిక్ రాజకీయాలలో ఉన్నా అవినీతికి పాల్పడిన దాఖలాలు లేవు. చివరకు ఆయన ఆర్థిక కష్టాలు అనుభవించాల్సి వచ్చింది. కశ్మీర్ నుంచి ఆయనను గోవా గవర్నరుగా బదిలీ చేసినప్పుడు నేను అయిదు కుర్తాలు, అయిదు పైజామాలతో వచ్చాను. వాటితోనే వెళ్లిపోతాను అన్నారు. కశ్మీర్‌లో ఒక పథకం అమలు కోసం ఆయనకు 150 కోట్ల రూపాయల లంచం ఇవ్వజూపారు. కానీ ఆయన లొంగలేదు. వైపరీత్యం ఏమిటంటే లంచం పుచ్చుకుని ఏ పథకానికి అనుమతించడానికి ఆయన నిరాకరించారో అదే పథకం ఆధారంగా చివరి దశలో ఆయన మీద సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఎన్‌ఐఏ ముప్పేట దాడులు చేశాయి. ఆయన డ్రైవర్, సహాయకుడి మీద కూడా ఈ దాడులు జరిగాయి.

జమ్మూ-కశ్మీర్ గవర్నరుగా ఉన్నప్పుడు మాలిక్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని శ్రీనగర్ విమానాశ్రయం నుంచి బయటకు అడుగుపెట్టకుండా కట్టడి చేశారు. అదే రాహుల్ గాంధీ మాలిక్‌ను కలుసుకుని సుదీర్ఘంగా సంభాషించారు. ఒక రకంగా చెప్పాలంటే రాహుల్ పత్రికా రచయిత అవతారమెత్తి మాలిక్ ను ఇంటర్వ్యూ చేశారు. అద్వానీ పాకిస్థాన్ వెళ్లి జిన్నా సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచినందుకు అద్వానీ చేత రాజీనామా చేయించిన పార్టీ బీజేపీ. అప్పుడు అటల్ బిహారీ వాజ్‌పేయి కూడా అద్వానీని కాపాడలేక పోయారు. అనేక పార్టీలు తిరిగి చివరకు బీజేపీ పంచన చేరినందుకు మాలిక్‌కు కూడా దాదాపు అలాంటి "సత్కారమే" జరిగింది. పుల్వామా మారణకాండకు బాధ్యత ప్రభుత్వానిదేనని తెగేసి చెప్పినందుకే మోదీ దృష్టిలో ఆయన దోషిగా మిగిలారు. అనారోగ్యంతో రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో పడి ఉన్నప్పుడూ ఆయన నిజం మాట్లాడడానికి జంకకపోవడమే ఆయన గొప్పతనం. ఆయన మౌనం ద్వారా తన అభిప్రాయాన్ని మరింత బిగ్గరగా వినిపించారు. మోదీ అవినీతి చేయిస్తారు, ఆ డబ్బు అదానీకి వెళ్తుంది అని తెగేసి చెప్పారు. అధికార రాజకీయాలలో భాగంగా ఆయన అన్యాయాన్ని సహించగలిగినన్ని రోజులు సహించారు. ఆదేశాలు అమలు చేశారు. నిజం చెప్పడం మొదలు పెట్టినప్పటి నుంచి ఆయన పాలకులకు కానివాడై పోయారు. మాలిక్ చివరి మూడేళ్ల జీవితాన్ని జనం గుర్తుపెట్టుకుంటారు. ప్రస్తుత రాజకీయాలలో విద్వేషం కన్నా ప్రమాదకరమైంది మౌనం అని మాలిక్ నిరూపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరవాతే ఆయన బీహార్, జమ్మూ-కశ్మీర్, గోవా, మేఘాలయ గవర్నరుగా పని చేశారు. కొంత కాలం ఒడిశా గవర్నరుగా అదనపు బాధ్యతలూ నిర్వర్తించారు. అంత సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తి మరణిస్తే కనీసం సంతాపం తెలియజేసే సాహసం కూడా ఏ బీజేపీ నాయకుడికీ లేదు. జీవిత చరమాంకంలో నిజం చెప్పి మాలిక్ తన పాత పాపాలన్ని కడిగేసుకున్నారు. నిష్ఠూరం మూటగట్టుకున్నారు. ఎన్ని పదవులు అనుభవించినా అధికారం ఆయన తలకెక్కలేదు. అధికార పంజరంలో జీవించినా అవినీతి మకిలి అంటని జీవితం ఆయనది. చివరి మూడేళ్ల కాలంలో ఆయన అంతరాత్మ మేలుకుంది. ప్రజలు ఆయనను గుర్తు పెట్టుకునేది ఈ రుజువర్తన కోసమే. ఆయన మీద ప్రజాభిమానాన్ని మోదీ ప్రభుత్వం అడ్డుకోలేదుగా!

సంక్షోభంలో చేనేత రంగం

తూతిక శ్రీనివాస విశ్వనాథ్

విదేశీ వస్త్రాలను బహిష్కరించి మగ్గంపై తయారుచేసే ఉత్పత్తులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగస్టు 7 న జాతీయ చేనేత దినోత్సవం జరుపుతున్నాయి. వ్యవసాయం తర్వాత స్థానంలో అతిపెద్ద ఉపాధి రంగమైన చేనేత రంగం నేడు సంక్షోభంలోకి నెట్టబడింది. దాంతో ఇప్పుడు చేనేత కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారాయి. ప్రభుత్వ విధానాల కారణంగా ఆప్కో బకాయిలు పేరుకుపోతున్న తరుణంలో ఎక్కడికక్కడ ఉత్పత్తులు నిలిచిపోతున్నాయి. దాంతో పరిశ్రమ నానాటికీ కుంటుపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సాయం కోసం నేతన్నలు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో సుమారు 550 సహకార సంఘాలలో సుమారు లక్షా యాభైవేల మంది చేనేత కార్మికులుగా నమోదై వున్నారు. సంఘాలతో సంబంధం లేకుండా మరో రెండు లక్షల మంది, మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి చేసుకుంటున్న వారు మరో 60 వేల మంది వుంటారు. యూ కొత్తపల్లి, ధర్మవరం, వెంకటగిరి, పొందూరు, మంగళగిరి, దూళ్ల, తదితర ప్రాంతాల్లో మగ్గంపై ఆధారపడి బతుకుతున్న చేనేత కార్మికులున్నారు. ఆంధ్ర, ఉత్తరాంధ్ర, రాయలసీమలో లక్షలాది మంది చేనేత కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేనేతరంగంపై బతుకుతున్నారు.

కోట్లలో ఆప్కో బకాయిలు: ఆప్కో కొనుగోలు చేసిన దుస్తులకు సహకార సంఘాలకు కోట్లలో సొమ్ము చెల్లించాల్సి వుంది. చాలా సంవత్సరాల నుంచి ఖరీదు చేసిన వస్త్రాలకు సొమ్ములు అందకపోవడంతో చేనేత కార్మికులు పస్తులుండే పరిస్థితులు దాపురించాయి.

> **భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచినా చేనేత భారతదేశ వారసత్వ సంపద, చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వాలే చర్యలు చేపట్టవల్సి ఉంది. ఆర్థిక సంక్షోభంతో సంబంధం లేకుండా అన్ని రంగాలు అభివృద్ధి వైపు పరుగులెడుతుంటే చేనేత రంగం ఎందుకు నష్టాలలో కురుకుపోతుందో పాలకులు ఆలోచించాలి. పర్యావరణానికి హాని కలగకుండా ఉపాధి పొందే రంగం చేనేత ఒక్కటే.**

చేనేత రంగంపై విధించిన జీఎస్టీని ఎత్తివేయాలని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా

ప్రభుత్వాలు ఆప్కోకు బకాయిలు చెల్లించక పోవటంతో ఈ సంఘాలకు ఆప్కో బకాయిలు చెల్లించలేకపోతోంది. దీంతో చేనేత పరిశ్రమ మూతపడే స్థితికి చేరుకుంది. సొమ్ములు చెల్లించని కారణంగా చేనేతలు వస్త్రాల ఉత్పత్తులను నిలిపివేశారు. ఆప్కో సైతం చేనేత సహకార సంఘాల నుంచి కొనుగోళ్లను నిలిపివేసింది. దీంతో ఆటు కొన్న వాటికి సొమ్ము చెల్లించక ఇటు ఉత్పత్తి చేసిన వాటిని కొనుగోలు చేయకపోవడంతో చేనేత రంగం పరిస్థితి దారుణంగా మారింది. పాలకుల నిర్లక్ష్యం వలన ఆప్కో పాలకవర్గానికి, సహకార సంఘాలకు ఎన్నికలు జరపకుండా సంవత్సరాలుగా ఇంచార్జి పాలనలో కార్యకలాపాలు జరపడంతో ఆప్కోలో అవినీతి పెరగడంతో దాని ప్రభావం ప్రత్యక్షంగా చేనేత రంగంపై పడడంతో నేతన్నలు నష్టపోతున్నారు. మరోపక్క జీఎస్టీ విధించి చేనేత రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. దీనిపై చేనేత కార్మిక సంఘాలు అనేక రూపాలలో ఆందోళనలు కూడా నిర్వహించాయి. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల నుంచి ఆప్కో వస్త్రాలను కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో కేంద్రం విధించిన జీఎస్టీ వస్త్రాలపై పడుతోంది. ఆప్కో కొనుగోలు చేస్తున్న వస్త్రాలకు చేనేత సహకార సంఘాలు జీఎస్టీని చెల్లిస్తున్నాయి. సహకార సంఘాలు చెల్లించిన జీఎస్టీని తిరిగి ఆప్కో జమ చేయాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలకు కోట్లలో ఆప్కో జీఎస్టీని చెల్లించాల్సి ఉంది. జీఎస్టీ విధించడం వలన చేనేత ఉత్పత్తులు, అమ్మకాలు తగ్గి నేతకార్మికులు నష్టపోతున్నారు. ప్రభుత్వ విధాన పరమైన లోపాలు వలన ముఖ్యంగా చేనేత రంగానికి ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం వలన నేత కార్మికులు నేసిన బట్టకు గిట్టుబాటు ధర లేకపోవడం వలన నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్న సందర్భాలు ఉన్నాయి. ప్రకృతి విపత్తుల సమయాల్లో సైతం చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. వర్షాలు, వరదల కారణంగా మగ్గాలు, రాట్నాలు, మరసులు దెబ్బతిని వేలాది మంది కార్మికులు ఉపాధిని కోల్పోయారు. చాలా మంది నేత వృత్తి వదిలి అసంఘటిత రంగంవైపు వెళ్లిపోయారు. వర్షాలకు మగ్గాల్లోకి నీరు చేరడంతో వర్షాకాలంలో దాదాపు నాలుగు నెలల పాటు చేనేత కార్మికుల కుటుంబాలు పస్తులతో కాలం వెళ్లదీస్తుంటాయి. చేనేతను ఆదుకుంటామని రాజకీయ పార్టీలు ఎన్నికల హామీ హామీగానే మిగిలిపోతోంది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వాలు నేత కార్మికుల సంక్షేమం కోసం సమగ్ర చేనేత విధానం అమలు చేయాల్సివున్నా చేయలేక పోతున్నారు.

కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి అన్యాయం జరుగుతూ వస్తోంది. కేంద్ర వార్షిక బడ్జెట్లో చేనేతకు దాదాపు రూ.400 కోట్లు కేటాయించి కోట్లాది మంది చేనేత, అనుబంధం చేనేత కార్మికులకు అన్యాయం చేసింది. దేశ వారసత్వ సంపదైన చేనేతకు కేంద్ర బడ్జెట్‌లో న్యాయం జరుగుతుందని ఆశతో చూసిన చేనేత కార్మికుల ఆశలపై కేంద్రం నీళ్లు జల్లింది. 2017 లో కేంద్రం రూ.710 కోట్లు చేనేతకు కేటాయిస్తే 2018 లో రూ.106 కోట్లు కోత విధించి కేవలం రూ.604 కోట్లే కేటాయించింది. రాను రాను ఈ వార్షిక బడ్జెట్ కేటాయింపులలో కేంద్ర ప్రభుత్వం కోత విధించుకుంటూ పోవడంతో చేనేత రంగం కుదేలు అవుతోంది. రాష్ట్రంలో నేతన్నలకు అరకొర సహాయం తప్ప సంక్షోభంలో ఉన్న చేనేత రంగానికి ఊపిరి పొయ్యాలని ఎటువంటి ప్రణాళికలు లేకపోవడం శోచనీయం. దుర్భర పరిస్థితుల నడుమ చేనేతను నమ్ముకుని రంగాన్ని కాపాడుతూ కుటుంబాలను పోషించుకుంటున్న చేనేత కార్మికులను గత ప్రభుత్వాలు విస్మరించాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం కావస్తున్న తరుణంలో ఎంతో ఆశగా చూస్తున్న చేనేత కార్మికులకు చేయూతను ఇచ్చి సీఎం చంద్రబాబు ప్రభుత్వం తరపున ఆదుకోవాలి. దేశ వారసత్వ సంపదైన చేనేతరంగాన్ని పరిరక్షించడానికి, భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి కారకులైన నేతన్నల సంక్షేమం కోసం, నేతన్నల జీవన భరోసా కోసం విజన్ ఉన్న నాయకుడుగా పేరున్న చంద్రబాబు నాయకత్వంలో ఉన్న కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని ప్రపంచానికి నాగరికత నేర్పించిన నేతన్నలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

చేనేత రంగం అభివృద్ధికి, నేత కార్మికుల సంక్షేమానికి సమగ్ర చేనేత విధానం అమలు చేస్తే చేనేత రంగం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది, లక్షలాది మంది చేనేత కార్మికులకు ఊరట కలుగుతుంది. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలిచినా చేనేత భారతదేశ వారసత్వ సంపద, చేనేత రంగం పరిరక్షణకు ప్రభుత్వాలే చర్యలు చేపట్టవల్సి ఉంది. ఆర్థిక సంక్షోభంతో సంబంధం లేకుండా అన్ని రంగాలు అభివృద్ధి వైపు పరుగులెడుతుంటే చేనేత రంగం ఎందుకు నష్టాలలో కురుకుపోతుందో పాలకులు ఆలోచించాలి. పర్యావరణానికి హాని కలగకుండా ఉపాధి పొందే రంగం చేనేత ఒక్కటే. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న నైపుణ్యం లేని ఉపాధి శ్రామికులకు రోజుకు దక్కే 300 రూపాయిలు శ్రమ ఫలితం కూడా జాతిపిత మహాత్మా గాంధీ మెచ్చి, ఖాదీ, స్వదేశీ ఉద్యమానికి కారణమైన నైపుణ్యం ఉన్న చేనేత కార్మికులకు దక్కకపోవడం విచారించదగ్గ పరిణామం. చేనేత కార్మికులకు చేతినిండా పని ఉండి, నేసిన బట్టకు గిట్టుబాటు ధర దొరికి అప్పులపాలు కాకుండా, ఆకలి చావులు లేకుండా, ఆత్మహత్యలు లేని రోజు మాత్రమే చేనేత దినోత్సవానికి నిజమైన అర్థం ఉంటుందని పాలకులు గుర్తించాలి.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
ఆంధ్రప్రదేశ్ వీవర్స్ యునైటెడ్ ఫ్రంట్
సెల్: 675924666

హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్

కేవీవీ ప్రసాద్
ప్రధాన కార్యదర్శి
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, అంతర్జాతీయ సంస్థల నిర్వహణాధికారి, హరితవిప్లవ పితామహుడు, జాతీయ రైతు కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ శత జయంతిని ఆగస్టు 7న దేశ వ్యాపితంగా నిర్వహించుకుంటున్నాం. స్వామినాథన్ 1925 ఆగస్టు 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారు. ఆయన డాక్టర్ ఎంకే సాంబశివన్, పార్వతి దంపతులకు రెండవ కుమారుడు. ఆయన తండ్రి నుంచి అసాధ్యం అనే మాట ఉండరాదన్న దృఢ సంకల్పంతో గొప్ప పనులు సాధించిన కృషీవలుడు. తమిళనాడులో భారత స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా జరిగిన దేవాలయ ప్రవేశ ఉద్యమంలో దళితుల ఆలయ ప్రవేశ కార్యక్రమానికి ఎంకే సాంబశివన్ నాయకత్వం వహించారు. ఫైలేరియా సిస్ అనే భయంకరమైన వ్యాధితో బాధపడుతున్న కుంభకోణం ప్రాంతంలో ఆ వ్యాధి నిర్మూలనకు ఆయన విశిష్ట కృషి చేశారు. తన తండ్రి చేస్తున్న బహుముఖ సేవా కార్యక్రమాలతో ఉత్తేజితులైన ఎంఎస్ స్వామినాథన్‌కు బాల్యంలోనే సేవాభావన ఆలోచన రేకెత్తింది. స్వామినాథన్ 11వ ఏట తండ్రి మరణించడంతో ఆయన బాధ్యతలు మేనమామ ఎంకే నారాయణ స్వామి(రేడియాలజిస్టు) చూస్తుండే వారు. స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించిన స్వామినాథన్ కుంభకోణంలో హైస్కూల్ విద్య పూర్తి చేశారు. 1943 భయంకరమైన బెంగాల్ కరువును చూసిన ఆయన భారతదేశం నుంచి ఆకలిని తొలగించడానికి తన జీవితాన్నే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయం అయనను వైద్య రంగం నుంచి వ్యవసాయ రంగం వైపు మరలించింది. 1943 బెంగాల్ కరువు తీవ్ర ఆహార ధాన్యాల కొరతను ఎదుర్కొంది. బెంగాల్‌లో ముప్పై లక్షల మంది ఆకలితో మరణించారు. వ్యవసాయంలో అధికోత్పత్తి సాధించాలనే ధ్యేయంతో స్వామినాథన్ దృష్టి వ్యవసాయ పరిశోధనల వైపు మళ్లింది. స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజల అవసరాలకు సరిపడినంత ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయలేని పరిస్థితులలో మన

దేశం ఉంది. ఆ కాలంలో నోబెల్ బహుమతి గ్రహీత నార్మన్ బోర్లాగ్ సృష్టించిన మెక్సికన్ పొట్టి గోధుమ రకాలను మన దేశంలోకి ప్రవేశపెట్టారు. వీటి ప్రభావంతో పరిశోధనలు సాగించి అధిక దిగుబడులు ఇచ్చే గోధుమ రకాలను స్వామినాథన్ రూపొందించారు. దీంతో గోధుమ ఉత్పత్తి గణనీయంగా పెరిగింది.

అధికోత్పత్తిపై విస్తృత పరిశోధనలు: 1949-55 మధ్య కాలంలో బంగాళదుంప, గోధుమ, వరి, జనపనార జన్యువులపై విస్తృత పరిశోధనలు చేశారు. అనంతరం మెక్సికన్ పొట్టి గోధుమ వంగడాలపై పరిశోధన చేసి ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో గోధుమ, వరి, జెర్మో ప్లాసం నమూనాలను అభివృద్ధిపరిచారు. భారతదేశంలో మొక్కలు, జంతువులు, చేపల జన్యువనరుల కోసం జాతీయ బ్యూరో ఏర్పాటులో విశేష కృషిసల్పారు. అంతర్జాతీయ మొక్కల జన్యువనరుల సంస్థ ఏర్పాటు జరిగింది. ఇది 2006లో బయోడైవర్సిటీ ఇంటర్‌నేషనల్‌గా మార్పు జరిగింది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ కౌన్సిల్, మొక్కల జన్యువనరుల కమిషన్ స్థాపించడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారు. రైతుల హక్కుల భావన ప్లాంట్ జనెటిక్స్ రిసోర్సెస్‌కు చెందిన గ్రంథం రూపకల్పనను అభివృద్ధి పరిచారు. ఇంటర్‌నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అంతర్జాతీయ రైస్ జర్మ్‌ప్లాసమ్ వ్యవస్థాపనకు కృషి జరిగింది. ఇంటర్నేషనల్ స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా మొక్కల జర్మ్‌ప్లాసమ్ లభ్యత, ఉపయోగం, మార్పిడి, రక్షణ గురించి విశేష కృషి చేశారు. జీవ వైవిధ్యానికి సంబంధించిన ముసాయిదా చట్టం, పెంపకందారులు, రైతుల హక్కుల చట్టం రూపకల్పనలో భారత ప్రభుత్వం నియమించిన అనేక కమిటీలలో స్థానం పొంది రైతుల శ్రేయస్సు కోసం కృషి చేశారు. నేషనల్ పాపులేషన్ పాలసీ డ్రాఫ్ట్ రూపకల్పనలో భారత పార్లమెంట్ నియమించిన నిపుణుల బృందానికి స్వామినాథన్ నాయకత్వం వహించి 1994లో పార్లమెంట్‌కు నివేదిక అందజేశారు. 2004 నుంచి 14 వరకు నేషనల్ కమిషన్ ఆన్ ఫార్మర్స్ చైర్మన్‌గా విశేష కృషి చేశారు. భారతదేశంలో వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చేసేందుకు ఆయన చేసిన కృషి అద్వితీయం. 1925 ఆగస్టు 7న జన్మించిన ఎంఎస్ స్వామినాథన్ 98 సంవత్సరాల వయస్సులో 2023 సెప్టెంబర్ 28న తుదిశ్వాస విడిచారు. తన జీవితకాలంలో అనేక పురస్కారాలు పొందారు. 1967లో పద్మశ్రీ, 1971లో రామన్ మెగాసెస్, 1972లో పద్మభూషణ్, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వరల్డ్ ఆఫ్ సైన్స్, 1987లో వరల్డ్ ఫుడ్ ప్రైజ్, 1989లో పద్మవిభూషణ్, 1991లో టైలర్ ప్రైజ్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ అచీవ్‌మెంట్, 1999లో ఓల్వో ఎన్విరాన్‌మెంటల్ ప్రైజ్, ఇందిరాగాంధీ శాంతిబహుమతి, 2013లో ఇందిరాగాంధీ జాతీయ సమైక్యతా పురస్కారం లాంటి అనేక అవార్డులు ఆయన సొంతం చేసుకున్నారు. భారతదేశ వ్యాపితంగా కోట్లాది మంది రైతుల మనస్సులో చిరస్థాయిగా నిలిచారు. స్వామినాథన్ ఆశయ సాధనకు మరో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో రైతాంగం ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉంది.

జాతీయ రైతు కమిషన్ నివేదిక:

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన ఏర్పడిన జాతీయ రైతు కమిషన్ 2004 డిసెంబర్-2006 అక్టోబర్ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వానికి ఐదు నివేదికలను సమర్పించింది. మొదటి నాలుగు నివేదికల తరువాత సమర్పించిన తుది నివేదిక రైతు సంక్షోభాలకు కారణాలు, రైతు ఆత్మహత్యల నివారణ, మద్దతు ధరలు తదితర అంశాలపై దృష్టి సారించింది. రైతులకు సమగ్ర జాతీయ విధానం ఉండాలన్న సిఫార్సు చేసింది. పరిశోధనలు, సిఫార్సులు, వనరులు, సామాజిక భద్రతా హక్కులను పొందే అంశాలను ఈ నివేదికలో ప్రముఖంగా ప్రస్తావించారు. భూ సంస్కరణలు, నీటి పారుదల, రైతులకు అవసరమైన రుణాలు, పంటల బీమా సౌకర్యం, ఆహార భద్రతా, ఉపాధి, వ్యవసాయ ఉత్పాదకత, రైతుల్లో పోటీతత్వం పెంచడం తదితర అంశాలు నివేదికలో ప్రస్తావించారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన 2004 నవంబర్ 18న జాతీయ రైతుల కమిషన్(ఎన్‌సీఎఫ్) ఏర్పడింది. కమిషన్ 2004 డిసెంబర్, 2005 ఆగస్టు, 2005 డిసెంబర్, 2006 ఏప్రిల్‌లో వరుసగా నాలుగు నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఐదవ, తుది నివేదిక 2006 అక్టోబర్ 4న సమర్పించింది. 11వ పంచవర్ష ప్రణాళిక విధానంలో ఊహించిన విధంగా వేగవంతమైన,మరింత సమ్మిళిత వృద్ధి లక్ష్యాన్ని సాధించడానికి ఈ నివేదికల ద్వారా అనేక సూచనలు చేశారు.

(ఆగస్టు 7న స్వామినాథన్ శతజయంతి సందర్భంగా)

ధరాలిలో సహాయక చర్యలు ముమ్మరం

- 150 మందిని రక్షించిన బృందాలు
- 28 మంది కేరళ పర్యాటకులు గల్లంతు

ఉత్తరకాశి : ఉత్తరాఖండ్ వరద బీభత్సంలో 28 మందితో కూడిన కేరళ పర్యాటక బృందం గల్లంతయ్యింది. ఖీర్ గంగా నదిలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కారణంగా సంభవించిన ఆకస్మిక వరదల్లో ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి జిల్లాలో కనీసం నలుగురు మరణించగా, డజన్ల కొద్దీ మంది కొట్టుకుపోయారని భయపడుతున్నారు. అయితే 11 మంది సైనిక దళాలు ఇంకా కనిపించకుండా పోయినప్పటికీ, దాదాపు 150 మందిని రక్షించామని ఎన్‌డీఆర్‌ఎఫ్ అధికారి బుధవారం తెలిపారు. ఐటీబీపీ ప్రతినిధి కమలేశ్ కమల్ ప్రకారం... మంగళవారం ఉత్తరకాశిపై సంభవించిన మేఘావృతం కారణంగా మొత్తం ఐదుగురు మరణించారు. మంగళవారం నుంచి దాదాపు 400 మందిని రక్షించినట్లు ఐటీబీపీ ప్రతినిధి తెలిపారు. '130 మంది జవాన్లతో కూడిన ఐదు ఐటీబీపీ బృందాలు ధరాలిలో ఉన్నాయి. 100 మందికి పైగా జవాన్లు మార్గమధ్యంలో ఉన్నారు. వారు త్వరలో అక్కడికి చేరుకుంటారు. ఈ ఉదయం మేము ఒక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నాం. 100 మందికి పైగా ప్రజలను రక్షించాం. బుధవారం మేము కమ్యూనికేషన్‌ను కూడా ఏర్పాటు చేశాము. ఇప్పుడు పరికరాలను అందించడం జరిగింది. ఈ సహాయక ఆపరేషన్ ఊపందుకునే అవకాశం ఉంది' అని ఆయన విలేకరులతో అన్నారు. 'నిన్న, కిన్నౌర్‌కు వెళ్లే మార్గంలో ఒకే ఒక చెక్క మాక్సి-షిఫ్ట్ వంతెన కొట్టుకుపోయిందని మాకు సమాచారం అందింది. ప్రారంభ దశలో సుమారు 100 మంది చిక్కుకుపోయారని మేము తెలుసుకున్నాం. బుధవారం ఉదయం వరకు 413 మందిని సురక్షితంగా రక్షించారు. ఉదయం నుంచి ఇప్పటివరకు, 57 మందిని రక్షించారు. మరో 100 మంది అక్కడ చిక్కుకుపోయారని సమాచారం. సాయంత్రం నాటికి వారిని కూడా రక్షించనున్నారు' అని ఆయన వివరించారు. కాగా కేరళ పర్యాటక బృందానికి సంబంధించి గల్లంతయిన 28 మందిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన వారు కాగా.. మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందినవారిగా గుర్తించారు. ఈ బృందంలోని ఓ జంట బంధువు మీడియాతో మాట్లాడుతూ వారితో మాట్లాడి ఒక రోజు గడిచిందన్నారు. 'తాము మాట్లాడినప్పుడు ఉత్తరకాశీ నుంచి ఉదయం 8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు వెల్లడించారు. వారి మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ తర్వాత నుంచి వారితో ఎటువంటి కాంటాక్టు లేదు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయిందా... లేక వారున్నచోట సిగ్నల్ లేదా అనేది అర్థం కావడం లేదు' అని పేర్కొన్నారు. హరిద్వార్‌కు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ 10 రోజుల పాటు ఉత్తరాఖండ్ యాత్ర ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంగళవారం ఉత్తరాఖండ్‌లో సముద్ర మట్టానికి 8,600 అడుగుల ఎత్తులో ఉన్న ధరాలి పట్టణంలోని హోటళ్లు, నివాస భవనాలను వరదలు ముంచెత్తాయి. అక్కడ నివాసితులు రికార్డ్ చేసిన వీడియో ఫుటేజ్‌లో భారీ నీటి అలలు ఆ ప్రాంతం గుండా ఎగిసిపడ్డాయి. ప్రజలు, ఇళ్లతో సహా వారి మార్గంలో ఉన్న ప్రతిదాన్ని అత్యంత వేగంతో వరద నీటితో ముంచెత్తిన దృశ్యాలు కనిపించాయి. ఇదిలాఉండగా, శిథిలాల మధ్య వరద బాధితులను రక్షించేందుకు సహాయ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కానీ భారీ వర్షం ఆ పనులకు ఆటంకం కలిగిస్తోంది. భారత సైన్యం, ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీసులు, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్&), జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), స్థానిక నివాసితులు పాల్గొన్న ఈ సహాయ కార్యక్రమాలను ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి పరిశీలించారు. ఇక్కడ ఇప్పటికే 150 మందిని రక్షించారు.

51 మంది మహారాష్ట్ర పర్యాటకులు సురక్షితం

ధరాలి గ్రామంలో ఆకస్మిక వరదలు విధ్వంసం సృష్టించిన ఒక రోజు తర్వాత ఉత్తరకాశి జిల్లాలో చిక్కుకున్న మహారాష్ట్ర నుంచి 51 మంది పర్యాటకులు సురక్షితంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం తెలిపింది. 11 మంది పర్యాటకులు నాందేడ్ జిల్లాకు చెందినవారని, మిగిలిన 40 మంది మహారాష్ట్రలోని వివిధ జిల్లాల నుండి వచ్చారని రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం (ఎస్‌ఈవోసీ) తెలిపింది.

మరోవైపు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఉత్తరాఖండ్ అంతటా, ముఖ్యంగా పర్వత ప్రాంత జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైనిటాల్, చంపావత్, ఉధమ్ సింగ్ నగర్, బాగేశ్వర్, పౌరి, తెహ్రీ, హరిద్వార్, డెహ్రాడూన్... ఈ ఏడు జిల్లాలకు భారీ వర్షసూచన చేసింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యగా ఆయా జిల్లాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.

రిషికేశ్‌లో పెరిగిన గంగానది నీటి మట్టం

రిషికేశ్‌లోని పర్మార్థ్ నికేతన్ ఆశ్రమంలో గంగా నది నీటి మట్టం గణనీయంగా పెరిగింది. ఆశ్రమంలోని ఆర్తి స్థల్‌లోని శివుని విగ్రహాన్ని నీరు తాకినట్లు కనిపించింది. పర్మార్థ్ నికేతన్ ఆశ్రమ ఉద్యోగి పంకజ్ కుమార్ ద్వివేది మాట్లాడుతూ మంగళవారం ఉత్తరకాశిలో జరిగిన మేఘాల విస్ఫోటనం వల్ల నీటి మట్టం ప్రమాద స్థాయిని మించి పెరిగిందని అన్నారు. ఉత్తరాఖండ్‌లో నిరంతర భారీ వర్షాల తర్వాత ఉత్తరకాశి, గంగోత్రి మధ్య ఎన్‌హెచ్-34 హైవేపై రోడ్లు దెబ్బతిన్నాయని సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్‌వో) తెలిపింది. పాపడ్‌గడ్ వద్ద 100 మీటర్ల దూరం మేర రహదారి కొట్టుకుపోయింది. ధరాలి సమీపంలో పెద్ద శిథిలాలు రోడ్డుకు అడ్డంగా పడి ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సంసిద్ధతతో సహాయ, పునరావాస చర్యల్లో నిమగ్నమై ఉందని ముఖ్యమంత్రి ధామి ప్రధాన మంత్రికి తెలిపారు. నిరంతర భారీ వర్షాల కారణంగా కొన్ని ప్రాంతాలలో ఇబ్బందులు తలెత్తాయి. అయితే సంబంధిత అన్ని సంస్థలు బాధిత ప్రజలకు త్వరిత సహాయం అందించడానికి సమన్వయంతో పని చేస్తున్నాయి.

'ఓటు బందీ' చర్చపై రాజీ లేదు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయ సభల్లో ఎన్నికల సంఘం ద్వారా 'ఓటు బందీ' అంశంపై చర్చ కోసం ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్ విషయంలో రాజీ ప్రసక్తే లేదని కాంగ్రెస్ బుధవారం స్పష్టంచేసింది. బీహార్‌లో ఓటర్ల జాబితాల పున:పరిశీలన పేరిట చేపట్టిన ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల తొలగింపు ఉద్దేశంతోనే ఎస్‌ఐఆర్ చేపట్టినట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ప్రక్రియ రద్దునకు డిమాండ్ చేస్తున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఇంచార్జి, కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ సామాజిక మాధ్యమంగా స్పందిస్తూ 'రాజ్యసభలో సభాపతి స్థానం శాశ్వతం. చైర్మన్‌లు వస్తారు... వెళతారు. షెడ్యూల్, అన్‌షెడ్యూల్ ఉండవచ్చు' అని వ్యాఖ్యానించారు. 'పార్లమెంటులో ఎన్నికల సంఘానికి సంబంధించిన ఏ అంశాన్ని చర్చించడానికి వీల్లేదంటూ 1988, డిసెంబరు 14న లోక్‌సభ స్పీకర్ స్పష్టం చేసినట్లు డిప్యూటీ చైర్మన్ గుర్తుచేశారు. కానీ, మోదీ నియమిత రాజ్యసభ చైర్మన్ 2023, జులై 21న ఒక్కటి మినహా ఈ భూమ్మీదుంటే దేని గురించి అయినా రాజ్యసభ చర్చించవచ్చన్నారు. ఆ ఒక్కటి జడ్జి తొలగింపు కోరే తీర్మానానికి సంబంధించిన అంశం. న్యాయ పరిశీలనలో ఉన్న అంశం అనే దానిని పూర్తిస్థాయిలో తప్పుగా అర్థం చేసుకున్నారంటూ అప్పట్లో చైర్మన్ అన్నారు' అని ఎక్స్‌లో జైరాం రమేశ్ పేర్కొన్నారు. 2023, జులై 21న నాటి చైర్మన్ చెప్పినదానికి ఎందుకు ఉద్దేశపూర్వకంగా బేఖాతరు చేస్తున్నారంటూ ఆయన ప్రశ్నించారు. బీహార్‌లో ఎన్నికల సంఘం ద్వారా ప్రభుత్వ పెద్దలు చేయించి... పశ్చిమ బెంగాల్, అసోం తదితర రాష్ట్రాల్లో చేయించాలనుకునే 'ఓటు బందీ, ఓటు చోరీ'పై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చ కోసం ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై రాజీ ప్రసక్తే లేదని జైరాం రమేశ్ తేల్చిచెప్పారు.

ట్రంప్ బెదిరింపుల వేళ రష్యాకు దోవల్

న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై సుంకాలు పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరిస్తున్న వేళ... జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాస్కో పర్యటనకు వెళ్లారు. దోవల్ పర్యటన చర్చనీయాంశంగా మారింది. అయితే, దోవల్ పర్యటన షెడ్యూల్ ముందుగానే ఖరారైందని అధికార వర్గాలు చెబుతున్నాయి. భారత్- రష్యా సంబంధాలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. మాస్కోతో రక్షణ, ఇంధన సంబంధాల బలోపేతమే ఈ పర్యటన ఉద్దేశమని ఆ వర్గాలు తెలిపాయి. రష్యా చమురు సరఫరాలు, పరిశ్రమల సహకారం వంటి వాటితో పాటు మరిన్ని ఎస్-400 క్షిపణి వ్యవస్థలు, రష్యాకు చెందిన ఎస్‌యూ-57 యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలక అంశాలపై మాస్కో అధికారులతో దోవల్ చర్చలు జరిపే అవకాశం ఉందని వెల్లడించాయి. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కూడా ఈ నెలాఖరులో రష్యాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. రెండు దేశాల మధ్య రక్షణ, ఇంధన, వాణిజ్య చర్చలే లక్ష్యంగా ఆయన పర్యటన ఉండనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చర్చించేందుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో సమావేశం కానున్నారు.

బీహార్‌లో కుల దురహంకార హత్య

పట్నా: బీహార్‌లో కుల దురహంకార హత్య కలకలం సృష్టించింది. రాష్ట్రంలోని దర్భాంగా మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ (డీఎంసీహెచ్)లో నర్సింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న రాహుల్ కుమార్(25)ను అతని మామ కాల్చి చంపినట్లు అధికారులు బుధవారం తెలిపారు. సుపౌల్‌కి చెందిన రాహుల్, ప్రేమ్ శంకర్ ఝా కుమార్తె కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ ఈ ఏడాది ఏప్రిల్‌లో కులాంతర వివాహం చేసుకున్నారు. ఝా ఈ వివాహాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. మంగళవారం సాయంత్రం కాలేజీకి చేరుకున్న ఆయన రాహుల్‌ను పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపాడు. ఆగ్రహించిన తోటి విద్యార్థులు ఝాను చితగ్గొట్టారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు విద్యార్థులను అడ్డుకుని... ఝాను ఆస్పత్రిలో చేర్చారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో పట్నాలోని ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని అన్నారు. ఈ ఘటన అనంతరం ఆస్పత్రిలో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహించిన నర్సింగ్ విద్యార్థులు ఆస్పత్రి గేటును దిగ్బంధించారు. దీంతో వైద్య సేవలకు అంతరాయం కలిగింది. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు లాఠీ చార్జ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఆస్పత్రి ఎదుట భారీ సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించామని అన్నారు.

నా కుమారుడిపై కేసు కొట్టేయండి

హెచ్‌డీ రేవణ్ణ పిటిషన్



బెంగళూరు: జేడీయూ ఎంపీ, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ మనవడు ప్రజ్వల్ రేవణ్ణను లైంగిక వేధింపుల కేసు నుంచి బయటపడేసేందుకు అతడి తండ్రి, జేడీయూ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. తన కుమారుడిపై నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టివేయాలంటూ కర్నాటక హైకోర్టులో పిటిషన్ వేశాడు. పని మనిషిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలతో హసన్ జిల్లాలోని హోలెనరసిపుర పోలీస్‌స్టేషన్‌లో ప్రజ్వల్ రేవణ్ణపై కేసు నమోదైంది. దాంతోపాటు అతడిపై మరో మూడు లైంగిక వేధింపుల కేసులు కూడా నమోదయ్యాయి. వాటిలో ఒక కేసులో ఇటీవల ప్రజాప్రతినిధుల కోర్టు ప్రజ్వల్‌ను దోషిగా తేల్చింది. అతడికి జీవితఖైదు విధించింది. ఈ నేపథ్యంలో హోలెనరసిపుర పీఎస్‌లో నమోదైన కేసును కొట్టివేయాలని హెచ్‌డీ రేవణ్ణ హైకోర్టును ఆశ్రయించారు.

ఒకేచోట కీలక మంత్రిత్వ శాఖల కార్యాలయాలు

కర్తవ్య భవన్ ప్రారంభించిన మోదీ

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ కీలక మంత్రిత్వ శాఖల కార్యాలయాలన్నింటినీ ఒకచోట చేర్చే 'కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ బిల్డింగ్స్'లో మొదటిదైన 'కర్తవ్య భవన్ 3'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఢిల్లీలోని అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల కార్యాలయాలు ఇక నుంచి ఇక్కడ నుంచే పనిచేయనున్నాయి. ఈ తరహాలో 10 కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ బిల్డింగ్‌లు నిర్మించేందుకు కేంద్రం సంకల్పించింది. ఢిల్లీలో వేర్వేరు చోట్ల ఉన్న ప్రభుత్వ మంత్రిత్వ శాఖల కార్యాలయాలను ఒకేచోటకు తీసుకురావడం ద్వారా పనిసామర్థ్యం, సమన్వయం పెరుగుతుందని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగా మొదటి కర్తవ్య భవన్-3ను ప్రధాని ప్రారంభించారు. హోం శాఖ, విదేశాంగ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఈ, డీఓపీటీ, పెట్రోలియర్, ప్రిన్సిపల్ సైంటిఫిక్ అడ్వయిజర్ కార్యాలయాలు ఇక్కడి నుంచి పనిచేయనున్నాయి. నార్త్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న ఈ కార్యాలయాలు కర్తవ్య భవన్‌కు తరలిరానున్నాయి. రైసిన్ హిల్‌లో రెండు బ్లాక్‌లను భారతదేశ ఇతిహాస, ఆధునిక చరిత్రను ప్రతిబింబించే మ్యూజియంగా మార్చనున్నారు. ప్రస్తుతం పలు కేంద్ర మంత్రిత్వ శాఖల కార్యాలయాలు పాతపడిన శాస్త్రి భవన్, క్రిషి భవన్, ఉద్యోగ్ భవన్, నిర్మాణ్ భవన్‌లలో నడుస్తున్నాయి. ఇవన్నీ 1950-1970 మధ్య నిర్మితమయ్యాయి. ఇవన్నీ నిర్మాణపరంగా కాలం చెల్లినవిగా ప్రభుత్వం భావిస్తోంది. ప్రత్యామ్నాయంగా సెంట్రల్ విస్టా రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ (సీసీఎస్) కింద పది భవంతులు నిర్మించాలని కేంద్ర గృహ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. వీటిలో 2-3 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. అవి వచ్చే నెలలో పూర్తయ్యే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి 10 సీసీఎస్ భవనాల నిర్మాణం పూర్తికావాల్సి ఉంది.

అదుపుతప్పి నదిలో పడిన కారు... ముగ్గురి మృతి

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం సిమ్లాలో ఓ కారు అదుపుతప్పి నదిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల ప్రకారం... చిర్గావ్ ప్రాంతానికి చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో డ్రైవర్ కారుపై నియంత్రణ కోల్పోయాడు.

దీంతో కారు అదుపుతప్పి పబ్బర్ నదిలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురిలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా... ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతులను విశాల్ ఠాకూర్, అభ్య కందియాన్, హిమాన్షుగాను, గాయపడిన వ్యక్తిని హర్ష్ చౌహాన్‌గా గుర్తించారు. నది నుంచి మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బెంగాలీలను బీజేపీ వేధిస్తోంది

మమతా బెనర్జీ విమర్శ

ఝర్‌గ్రామ్ : పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ బుధవారం బెంగాలీ మాట్లాడే వలసదారులపై జరిగిన దాడులను ఖండించారు. పౌరసత్వం, ఓటర్ల జాబితా సవరణ పేరుతో బెంగాలీలను వేధించడానికి బీజేపీ ఒక ప్రచారం చేస్తోందని విమర్శించారు. గిరిజన ప్రాబల్య ప్రాంతమైన ఝర్‌గ్రామ్‌లో భారీ నిరసన ర్యాలీకి నాయకత్వం వహిస్తూ, అవసరమైతే, బెంగాలీ భాష, బెంగాల్ ప్రజలపై జరిగిన దాడులపై బీజేపీ, కేంద్రం వైఖరిని తాను బయటపెడతానని టీఎంసీ చీఫ్ అన్నారు. 'వారు (బీజేపీ) బెంగాలీ అనే భాష లేదని చెబుతున్నారు. నేను వాటిని ప్రపంచం ముందు బయటపెడతాను. మీరు బెంగాలీ భాష, బెంగాల్ ప్రజలపై దాడి చేస్తే, నేను మౌనంగా ఉండను' అని తెలిపారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) పై బీజేపీని విమర్శిస్తూ, 'ఎస్‌ఐఆర్ పేరుతో ఓటరు జాబితా నుంచి ఒక్క ఓటర్లను కూడా తొలగించకూడదు. వారు ఓటరు జాబితా కాకుండా బీజేపీ జాబితాను రూపొందించడానికి ప్రయత్నిస్తున్నారు' అని మండిపడ్డారు. ఎస్‌ఐఆర్ కసరత్తు ద్వారా జాతీయ పౌర నమోదు (ఎన్‌ఆర్‌సీ) అమలు చేయడానికి ఒక పెద్ద ప్రణాళికలో భాగమని బెనర్జీ ఆరోపించారు. 'ఎస్‌ఐఆర్ వెనుక ఉన్న కుట్ర ఏమిటంటే ఎన్‌ఆర్‌సీని వెనుక తలుపు ద్వారా తీసుకురావడం. ప్రజలు ఇప్పటికే భయంతో ఆత్మహత్య చేసుకుంటున్నారు' అని చెప్పారు. 'ఒక వ్యక్తి బెంగాలీలో మాట్లాడటం వల్ల బంగ్లాదేశీయుడిగా ఎలా ముద్ర వేయబడతారు?' అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 'ఇది మన ప్రజలను వేధించడానికి చేసిన కుట్ర తప్ప మరొకటి కాదు' అని అన్నారు. పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి పత్రాలు ఇవ్వాలనే బీజేపీ డిమాండ్‌ను విమర్శిస్తూ, 'బీజేపీ నాయకులకు వారి జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయా?, ఇతరుల గుర్తింపును ప్రశ్నించడానికి వారికి ఏ హక్కు ఉంది?' అని ప్రశ్నించారు. ఝర్‌గ్రామ్ ర్యాలీలో వలస కుటుంబాలు, విద్యార్థులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీక్లీ కాంట్రాక్టుల నిలిపివేత అవాస్తవం: సెబీ

ముంబై: స్టాక్ మార్కెట్‌లో స్పెక్యులేషన్‌ను నియంత్రించేందుకు వారంతపు ఎక్స్‌పైరీలను నిలిపివేసే ప్రతిపాదనలేవీ లేవని, ప్రచారంలో ఉన్నవి ఊహాజనితాలేనని బుధవారం సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే వివరణ ఇచ్చారు. తమ వద్దకు అటువంటి ప్రతిపాదన ఏమీ రాలేదని, మీడియాలో వచ్చిన కథనాలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. ఇటువంటి సంస్కరణలను పద్ధతి ప్రకారం చర్చిస్తామని చెప్పారు. పాండే వివరణ తర్వాత బీఎస్ఈ షేర్లు వేగంగా కోలుకొన్నాయి. మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 1.50 శాతం పుంజుకొని రూ.2405 వద్దకు చేరుకొన్నాయి. వాస్తవానికి సెబీ వారంతపు ఎక్స్‌పైరీలు నిలిపివేస్తుందని, దీన్ని రెండు వారాలకు ఒక్కసారిగా మారుస్తుందని మంగళవారం కొన్ని మీడియా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి. ఇది జరిగితే బీఎస్ఈ, నిఫ్టీ ఎక్స్‌పైరీలు మారిపోతాయి. ప్రస్తుతం బీఎస్ఈ మంగళవారం, నిఫ్టీ 50 కాంట్రాక్టులు గురువారం ముగుస్తున్నాయి.

ప్రచారం జరిగినట్లు మారితే... ఇవి ప్రతి రెండు వారాలకు ఒకసారి ముగుస్తాయి. గత నెల సెబీ పూర్తికాల సభ్యుడు అనంత్ నారాయణన్ స్వల్పకాల ఎఫ్ అండ్ ఓ కాంట్రాక్టులు భారీ వాల్యూమ్‌ల్లో ట్రేడ్‌కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

'ప్రపంచానికి హిందూయిజం అవసరం'

పూనె: ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాల గురించి ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ ఆందోళన వ్యక్తం చేశారు. పూనెలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. సంఘర్షణలతో నిండిన ప్రపంచానికి హిందూయిజం అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే అన్ని రకాల వైవిధ్యాలను ఎలా అంగీకరించాలి? ఎలా పాటించాలనే విషయాన్ని హిందూయిజం మాత్రమే ప్రపంచ దేశాలకు నేర్పుతుందన్నారు. సంఘర్షణలను ఎలా నియంత్రించాలో ప్రపంచ దేశాలకు తెలియకపోవడం వల్లే రోజురోజుకు ఘర్షణలు తీవ్ర రూపం దాలుస్తున్నాయని భగవత్ అన్నారు. ధర్మాన్ని బోధించే హిందూయిజాన్ని పాటించడం మాత్రమే అన్ని సమస్యలకు పరిష్కారమని పేర్కొన్నారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని పాటించగలిగే జీవన విధానాన్ని హిందూ సంస్కృతీ సంప్రదాయాలు అలవాటు చేస్తాయని ఆయన తెలిపారు. హిందూయిజం అనేది మతం కాదని, ఓ సార్వత్రిక విశ్వాసం, మానవత్వం, ప్రకృతితో మమేకమైన జీవన విధానమని చెప్పుకొచ్చారు. భారత ప్రజలు నమ్మే ధర్మం కోసం పూర్వీకులు అనేక త్యాగాలు చేసినట్లు దేశ చరిత్ర ప్రపంచానికి తెలియజేస్తోందని, ప్రాణాలు పోతున్నా శివాజీలాంటి మహాత్ములు ధర్మాన్ని తప్పలేదని గుర్తు చేశారు.

ట్రంప్‌ను మోదీ ఎదిరించలేరు

రాహుల్

న్యూఢిల్లీ: భారత్‌పై సుంకాలు పెంచుతామని, 24 గంటల్లోనే ప్రకటిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా ప్రకటనలు ఇస్తున్నారు. గురువారంలోగా కీలక నిర్ణయాన్ని తీసుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. రష్యాతో చమురు కొనుగోళ్లను సాకుగా చూపుతూ సుంకాల పేరిట భారత్‌ను పదేపదే ట్రంప్ బెదిరిస్తున్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు నిధులను భారత్ సమకూరుస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాని మోదీ మౌనాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఇదే క్రమంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం ఎక్స్ మాధ్యమంగా మోదీని విమర్శించారు. అదానీ-అంబానీతో ఆయన బంధాన్ని పరోక్షంగా వ్యాఖ్యానించారు. అదానీ గ్రూపు లంచాల వ్యవహారం వల్లే డొనాల్డ్ ట్రంప్‌ను ప్రధాని మోదీ ఎదిరించలేకపోతున్నారని ఆరోపించారు. 'భారత్, దయచేసి అర్థం చేసుకోవాలి: వరుస బెదిరింపులు తర్వాత కూడా ట్రంప్‌ను మోదీ ఎదిరించలేకపోతుండటానికి కారణం అదానీపై అమెరికా దర్యాప్తు కొనసాగుతుండటమే' అని రాహుల్ పోస్టు పెట్టారు. మోదీ, ఏఏ, రష్యా చమురు ఒప్పందాల మధ్య ఆర్థిక సంబంధాలను బహిర్గతం చేస్తామన్న ఒక్క బెదిరింపు మోదీ చేతులు కట్టిపారేసిందంటూ ఎక్స్ మాధ్యమంగా దుయ్యబట్టారు. ఏఏ అర్థమేమిటో రాహుల్ వెల్లడించలేదు కానీ అదానీ, అంబానీలతో మోదీకి ఆర్థికపరంగా సంబంధాలు ఉన్నాయని ఆయన చాలా సార్లు ఆరోపించిన దృష్ట్యా ఏఏ అంటే అదానీ, అంబానీగా అర్థం చేసుకోవచ్చు.

65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి

ఈసీకి సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: బీహార్‌లో ఓటరు జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. అయితే, తాజాగా తొలగించిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించాలని సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది. ఇందుకోసం ఈనెల 9 వరకు గడువు ఇచ్చింది. బీహార్‌లో ఈసీ ఓటర్ల ప్రత్యేక సవరణ నిర్వహించడాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే ఎన్‌జీవో గతంలో సుప్రీంలో సవాల్ చేసింది. ఈసీ ముసాయిదా విడుదల నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలు వెల్లడించాలంటూ మరో దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై అత్యున్నత న్యాయస్థానంలో బుధవారం విచారణ జరగ్గా... ఇప్పటికే రాజకీయ పార్టీలకు వివరాలు సమర్పించినందున ఎన్‌జీవోకు కూడా వాటిని అందించాలని ఆదేశించింది. రాజకీయ పార్టీలకు జాబితా ఇచ్చినప్పటికీ... తొలగింపునకు గల కారణాలు తెలపలేదని ఎన్‌జీవో తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ... ప్రస్తుతం జాబితా వివరాలు మాత్రమే అందిస్తుందని, ఆ తర్వాత కారణాలు వెల్లడిస్తుందని స్పష్టంచేసింది. ఈ సందర్భంగా పోల్ ప్యానెల్ సిబ్బంది ఓటరు జాబితా నుంచి కొంతమంది ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తీసేశారని ఎన్‌జీవో తరపు న్యాయవాది ఆరోపించారు. ఎస్‌ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈనెల 12న విచారిస్తామని, అక్కడ మీ వాదనలు వినిపించవచ్చని న్యాయస్థానం పేర్కొంది. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ ఈసీ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ పూర్తవడంతో దానికి సంబంధించిన ముసాయిదాను ఇటీవల విడుదల చేసింది. ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఈసీ చర్యను తీవ్రంగా తప్పుబడుతున్నాయి.

ఏఐతో ఉద్యోగాలు పోవు

హర్ష్ గొయెంకా

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వల్ల ఉద్యోగాలు పోవని ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్‌పీజీ గ్రూప్ చైర్మన్ హర్ష్ గొయెంకా తన ఎక్స్ ఖాతాలో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఏఐ రాకతో ఉద్యోగాలు పోతాయని కొందరు నిపుణులు అంటుండగా, ఉద్యోగాలకు ఎలాంటి ముప్పు ఉండదని మరికొందరు చెబుతున్నారు. అధికశాతం ఉద్యోగుల్లో మాత్రం ఏఐపై భయాందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హర్ష్ గొయెంకా తాజాగా ఓ చర్చలో చేరారు. ఏఐ రాకతో ఉద్యోగాలు పోతాయా? అనే ప్రశ్నకు ఆయన వివరణ ఇస్తూ భవిష్యత్తులో ఏఐ వల్ల ఉద్యోగాలను కోల్పోవడం గురించే అందరూ ఆందోళన చెందుతున్నారని, కానీ అదేమీ జరగదని, అయితే ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకొస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రాంప్ట్ ఇంజినీర్లు, ఏఐ ప్రొడక్ట్ మేనేజర్లు, ఏఐ ఎథిక్స్ ఎక్స్‌పర్ట్స్ వంటి కొత్త ఉద్యోగాలు పుట్టే అవకాశం ఉందన్నారు. స్మార్ట్ వర్క్ చేసేవారు వీటిలో బాగా రాణిస్తారని అన్నారు. గొయెంకా పోస్టు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. గొయెంకా చెప్పినట్లుగా ఏఐ ఉద్యోగాల తొలగింపునకు కాకుండా... నూతన ఉద్యోగ మార్కెట్‌కు తెర తీస్తోందని ఓ నెటిజన్ అభిప్రాయపడ్డాడు. 'కాప్ జెమిని' వంటి కంపెనీలు కొత్త వారిని నియమించుకుంటున్నాయని మరో నెటిజన్ స్పందించాడు. ఏఐ ప్రతి రంగంలో ఉత్పాదకతను పెంచుతుందని, పెట్టుబడిపై రాబడిని మెరుగుపరుస్తుందని, దాంతో ఆర్థికవృద్ధి సైతం పెరుగుతుందని పేర్కొన్నాడు. కంటెంట్ క్రియేషన్, కోడింగ్, డిజైనింగ్ రంగాల్లో ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగాలపై కొంతమేర ప్రభావం పడుతుందని మరో నెటిజన్ అభిప్రాయపడ్డాడు.

అమెరికా కన్నా మన ఆర్థిక వ్యవస్థే పటిష్టం

ముంబై: భారత్ 'డెడ్ ఎకానమీ' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, ప్రపంచ వృద్ధికి అమెరికా కన్నా భారత్ ఎక్కువ దోహదం చేస్తోందని చెప్పారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) ప్రకారం ప్రపంచ వృద్ధి 3 శాతంగా ఉంటే.. భారత్ వృద్ధి అంచనాలు మాత్రం 6.5 శాతంగా ఉన్నాయన్నారు. 'ప్రపంచ వృద్ధికి భారత్ దాదాపు 18 శాతం దోహదం చేస్తోంది. అమెరికా భాగస్వామ్యం కేవలం 11శాతం కంటే తక్కువగా ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. మరింత పురోగతి సాధిస్తాం' అని ఆర్‌బీఐ గవర్నర్ పేర్కొన్నారు. భారత జీడీపీపై అమెరికా సుంకాల ప్రభావం ఏ మేరకు ఉంటుందన్న దానిపై స్పందిస్తూ... భారత్‌పై అమెరికా విధించిన సుంకాల ప్రభావాన్ని ప్రస్తుతం అంచనా వేయడం కొంచెం కష్టమేనన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు మాత్రం వృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. మనం ప్రతీకార సుంకాలు విధిస్తే తప్పితే... మన ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ప్రభావం ఉండదని చెప్పారు. 'వృద్ధిపై ఇప్పటికే అంచనాలు చాలా వరకు తగ్గించాం. అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో వృద్ధి అంచనాలను 6.7 శాతం నుంచి 6.5 శాతానికి సవరించాం. అయినప్పటికీ అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న క్రమంలో సుంకాల ప్రభావం ఏ విధంగా ఉంటుందన్నది అంచనా వేయడం కష్టమే. సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తాం. ప్రస్తుతానికి జీడీపీ అంచనాలు సవరించడానికి మా వద్ద తగినంత డేటా లేదు' అని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ఆర్‌బీఐ గవర్నరు మాట్లాడుతూ స్థూల ఆర్థిక పరిస్థితులను విధానపరమైన అంశాల వారీగా పర్యవేక్షిస్తూనే ఉంటామన్నారు. వాటికి తగినట్లు నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం చాలా అనిశ్చితి కొనసాగుతోందని, వడ్డీ రేట్లలో 100 బేసిస్ పాయింట్లు ఇదివరకే తగ్గించామన్నారు. ధరల స్థిరత్వాన్ని కొనసాగిస్తూనే స్థిర వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం చర్చల గురించి మాట్లాడుతూ... అవి సామరస్యంగా పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాలాంధ్ర హైదరాబాద్

భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిష్కార దిశలో భాగంగా శామీర్‌పేట్ తహసీల్దారు కార్యాలయాన్ని అదనపు కలెక్టరు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ భూభారతి ఆన్‌లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు దారులు ఇచ్చిన దరఖాస్తులు ఎంత వరకు పరిష్కారమయ్యాయని శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి అవుతున్న జాప్యానికి గల కారణాలను పరిశీలించారు. సాంకేతిక పరమైన ఏమైన ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే క్లియర్ చేసుకోవాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్‌లో మ్యానువల్‌గా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను అదనపు కలెక్టరు పరిశీలించారు.

15, 16 తేదీల్లో పశువుల కబేళాలు, బీఫ్ దుకాణాలను మూసివేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆగస్టు 15, 16, 2025 తేదీల్లో స్వాతంత్ర్య దినోత్సవం, శ్రీ కృష్ణ జన్మాష్టమి దృష్ట్యా తన పరిధిలోని అన్ని పశువుల కబేళాలు, రిటైల్ బీఫ్ దుకాణాలను మూసివేయాలని జీహెచ్ఎంసి ఆదేశాలు జారీ చేసింది. జీహెచ్ఎంసి చట్టం, 1955లోని సెక్షన్ 533 (బి) కింద జారీ చేసిన నోటీసు ప్రకారం స్వాతంత్ర్య దినోత్సవం, జన్మాష్టమిల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. పశువుల కబేళాలు బీఫ్ దుకాణాలను మూసివేతను అమలు చేయడంలో పురపాలక అధికారులకు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్, సైబరాబాద్ రాచకొండ పోలీసు కమిషనర్లను జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ కోరారు.

సిసి రోడ్ నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతంలో మల్కాజిగిరి శాసన సభ్యులు రాజశేఖర్ రెడ్డి మంజూరు చేయించిన సిసి రోడ్ నిర్మాణ పనులను మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీష్ గౌడ్ బుధవారం ముస్లిం బస్తీలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందని కాలనీలపై మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక దృష్టి చేస్తున్నారని ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధిని చేపట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని జగదీష్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జలీల్, ఖాదర్, ఇబ్రహీం, అష్రఫ్, అహ్మద్, జమీన్, వినోద్, రఫీక్, సలీం, సాజిద్, సల్మాన్, ఆరిఫ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా అగర్వాల్ సమాజ్ మహిళా సేవిక 'సావన్ కీ సైర్'

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : అగర్వాల్ సమాజ్ మహిళా సేవిక అత్తాపూర్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం 'సావన్ కీ సైర్' కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. తొలుత లోటస్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు జరిపారు. ఆ తర్వాత అగ్రసేన్ మహారాజ్ పూజతో కార్యక్రమం ప్రారంభమైంది. 'సావన్ కీ సైర్' సందర్భంగా ఆటలు, రుచికరమైన వంటకాల ఏర్పాటు, ఇతర వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు కార్యక్రమాలను ఎంతగానో ఆస్వాదించడంతో వేడుక విజయవంతంగా ముగిసింది. అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షులు అనిరుధ్ గుప్తా జీ, ఉపాధ్యక్షులు రూపేష్ అగర్వాల్ జీ, ఐపిపి మనీష్ అగర్వాల్ జీ కూడా ఈ 'సావన్ కీ సైర్' కార్యక్రమంలో పాల్గొని నిర్వహణను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు డింపుల్ అగర్వాల్, ఉపాధ్యక్షురాలు రాజ్ అగర్వాల్, కార్యదర్శి అంజు అగర్వాల్, సంయుక్త కార్యదర్శి సీమా అగర్వాల్, కోశాధికారి రిధిమా అగర్వాల్, కేంద్ర కమిటీ సభ్యురాలు నిధి అగర్వాల్ మహిళలందరూ ఉత్సాహంగా పాల్గొన్నట్లు అధ్యక్షురాలు డింపుల్ అగర్వాల్ వెల్లడించారు.

పిల్లలకు రోగనిరోధక శక్తి టీకాలు సకాలంలో వేయించాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : టీకా ద్వారా నివారించగల వ్యాధుల నుండి పిల్లలను రక్షించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాల నడుమ, పాఠశాల ప్రవేశ వయస్సులో అంటే 4, 6 సంవత్సరాల మధ్య పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు (డిటిపి), పోలియోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. శిశువులుగా వున్నప్పుడు ఇవ్వబడిన ప్రాథమిక టీకాలు ప్రాథమికంగా రక్షణను అందిస్తున్నప్పటికీ, డిఫ్తీరియా, కోరింత దగ్గు, పోలియో వంటి వ్యాధులకు యాంటీబాడీ స్థాయిలు పిల్లలు పాఠశాలకు వెళ్లే వయస్సు వచ్చే సమయానికి గణనీయంగా తగ్గుతాయని పరిశోధనలో తేలింది. జాతీయ ఇమ్యునైజేషన్ షెడ్యూల్ ప్రకారం, 6, 10, 14 వారాలలో మూడు డిటిపి మోతాదులను, తరువాత 16 నుండి 24 నెలలకు బూస్టర్‌ను భారత ప్రభుత్వం సిఫార్సు చేస్తుంది. డాక్టర్ అంజుల్ దయాల్, సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్, డైరెక్టర్ ఆఫ్ పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్, అంకుర హాస్పిటల్ వారు మాట్లాడుతూ "పాఠశాలలోకి అడుగు పెట్టటమంటే సామాజికంగా చురుకైన వాతావరణంలోకి ప్రవేశిస్తున్నట్లే ఈ దశలో, సిఫార్సు చేయబడిన బూస్టర్‌తో వారి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది.

ఘనంగా సుష్మాస్వరాజ్ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర - మొయినాబాద్: కేంద్ర మంత్రిగా సుష్మాస్వరాజ్ చేసిన సేవలు చిరస్మరణీయం అని బీజేపీ చేవెళ్ల పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి తెలిపారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో దివంగత కేంద్ర మంత్రి సుష్మాస్వరాజ్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలతో ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సుష్మాస్వరాజ్ కీలకంగా వ్యవహరించారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల్లో చిన్నమ్మగా సుష్మాస్వరాజ్ చెరగని ముద్రవేసుకున్నారని చెప్పారు. సుష్మాస్వరాజ్ ఆశయాలను బీజేపీ పార్టీ కొనసాగిస్తుందన్నారు. శంకర్ గౌడ్, దేవుని శర్వలింగం, ప్రవీణ్ రెడ్డి, అశోక్, శ్రీకాంత్, జయసింహారెడ్డి, శ్రీనివాస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

తెలంగాణ బియ్యంపై ఫిలిప్పీన్స్ మంత్రి ప్రశంసలు

ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ మంత్రి ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్‌ను ఢిల్లీలో కలిశారు. తెలంగాణ నుంచి మరింత బియ్యం ఎగుమతిపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. స్నేహపూర్వక, సహకార వాతావరణంలో ఈ సమావేశం జరిగింది. తెలంగాణ నుంచి దిగుమతి చేసుకుంటున్న నాణ్యత ఉన్న బియ్యం పట్ల ఫిలిప్పీన్స్ మంత్రి ప్రశంసలు కురిపించారు. తెలంగాణ నుంచి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతుల పరిధిని విస్తరించడానికి ఆయన ఆసక్తి కనబర్చారు. తమతో భేటీ అవ్వడానికి సమయం కేటాయించినందుకు ఫిలిప్పీన్స్ మంత్రికి.. తెలంగాణ పౌర సరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కృతజ్ఞతలు చెప్పారు. అలాగే తెలంగాణ బియ్యం నాణ్యతను గుర్తించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ, ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్య సంబంధాన్ని విస్తరించడానికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఈ ఏడాది చివర్లో తెలంగాణలో పర్యటించాలని ఫిలిప్పీన్స్ మంత్రిని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆహ్వానించారు. దీనిపై ఫ్రాన్సిస్కో పి.టియు లారెల్ జూనియర్ సానుకూలత వ్యక్తం చేశారు. బియ్యంతో పాటు వరి ధాన్యాన్ని ఎగుమతి చేయాలనే తెలంగాణ ప్రతిపాదనపై ఫిలిప్పీన్స్ మంత్రి సానుకూలంగా స్పందించారు. పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్.. తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048) బియ్యం రకాన్ని ఎగుమతి చేసుకోవచ్చని సూచించారు. దీనిపైనా ఫిలిప్పీన్స్ మంత్రి ఆసక్తి చూపించారు. అంతేకాకుండా తెలంగాణ నుంచి మొక్కజొన్నను దిగుమతి చేసుకునే అవకాశం గురించి ఫిలిప్పీన్స్ మంత్రి ఆరా తీశారు. తెలంగాణలో పర్యటించాలని కోరిన ఉత్తమ్ కుమార్ రెడ్డిని.. ఫిలిప్పీన్స్ మంత్రి వారి దేశంలో పర్యటించాలని ఆహ్వానించారు. వాణిజ్య సంబంధం, సహకారాన్ని మరింతగా పెంచుకోవాలనే బలమైన కోరికను ఇరు పక్షాలు వ్యక్తం చేశాయి. దీంతో ఈ సమావేశం చాలా సానుకూలంగా ముగిసింది.

భయాన్ని వదిలి, ఆలోచనలను వెల్లడించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : విద్యార్థులు మనసులోని భయాన్ని బిడియాన్ని వదిలి తమ ఆలోచనలను అందరి ముందు చెప్పినప్పుడే వారి శక్తి సామర్థ్యాలు సృజనాత్మకత మెరుగవుతుందని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు విద్యార్థులకు పరిశుభ్రమైన పౌష్టికాహారాన్ని అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారు లకు సూచించారు. మూడు చింతలపల్లి మండలంలోని జగ్గం గుడాలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ జూనియర్ కాలేజ్ బాయ్స్ వసతి గృహాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటిస్తూ బోర్డుపై లెక్కలను బోధించారు గణితాన్ని అర్థం చేసుకొని ప్రాక్టీస్ చేయాలని విద్యార్థులకు సూచించారు. వసతి గృహం లో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని రికార్డులు పరిశీలించారు స్టోర్ రూమ్ ను వంటగదిని ఆహారాన్ని పరిశీలించారు. ఏ ఏ సబ్జెక్ట్ లు ఎలా సిద్ధం అవుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఆటలు ఆడుతారని అడిగారు. భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు విద్యార్థులకు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి వత్తిడి లేకుండా చదవాలని సూచించారు. వెనుకంజలో ఉన్న సబ్జెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని తెలిపారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టంతో కాకుండా ఇష్టంగా చదవాలని, మానసిక ఒత్తిడికి గురికావొద్దని సూచించారు.

మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ముద్చింతలపల్లి ఎమ్మార్వో ప్రిన్సిపల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళులు : మహేష్ గౌడ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ప్రజాయుద్ధ నౌక వర్ధంతి, ప్రో.జయశంకర్ జయంతి సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ వారికి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప ప్రజాయోధుడు గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని, ఆయన సేవలను టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత "పీడిత ప్రజల గొంతుకగా, ఉద్యమాలే ఊపిరిగా నిలిచిన మహోన్నత వ్యక్తి గద్దర్," అని ఆయన పేర్కొన్నారు. ఆయన పోరాట పటిమ అనేక మంది ఉద్యమకారులకు స్ఫూర్తిగా నిలిచిందని చెప్పారు. ఆయన చేసిన సాంస్కృతిక, సాహిత్య సేవలకు గుర్తింపుగా జూన్ 14న గద్దర్ పేరిట తెలంగాణ ఫిల్మ్ అవార్డులను ప్రారంభించి, సినీ కళాకారులకు, ప్రముఖులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రదానం చేసిందని వివరించారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా గద్దర్ తన నమ్మిన సిద్ధాంతానికి అంకితమై పని చేశారని, పాటను తూటాగా మార్చి ప్రజల మనసుల్లో ఉద్యమాన్ని రగిలించిన యోధుడు ఆయన అని అన్నారు. తెలంగాణ ప్రజల స్ఫూర్తిగా గద్దర్ జీవితం, పోరాట మార్గం తరతరాలకూ ఆదర్శంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. తెలంగాణా ఉద్యమ సిద్ధాంతకర్త, రాష్ట్ర స్వప్నానికి ప్రాణం పోసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన నిర్విరామ కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని మహేష్ కుమార్ గుర్తుచేశారు. తెలంగాణే శ్వాసగా, ధ్యాసగా, బతికిన ఆయన ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారని, తన జీవితం మొత్తం తెలంగాణకు అంకితంగా నిలిచిన గొప్ప పోరాట యోధుడు జయశంకర్ అని అన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పోరాటాలను అణిచివేస్తున్న బీజేపీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : వెనుకబాటుతనం, పేదరికం, ఆకలి, నిరుద్యోగం, దోపిడీ నుండి విముక్తి పొందేందుకు ప్రజలు చేస్తున్న ప్రజాస్వామ్య పోరాటాలను బీజేపీ అణిచివేస్తుందని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి తెలిపారు. ప్రజా వ్యతరేక మోదీ ప్రభుత్వ విభజన ఆలోచనలు, తిరోగమన విధానాలకు వ్యతిరేకంగా దృఢ సంకల్పంతో పోరాడాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్, హిమాయత్ నగర్, సత్యనారాయణ రెడ్డి భవన్ లో బుధవారం సిపిఐ ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం 4 మహాసభలు నియోజకవర్గం కార్యదర్శి మామిడిచెట్ల వెంకట్ స్వామి అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభలకు ఎస్. ఛాయాదేవి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ 1925 సంవత్సరంలో భారతదేశంలో సిపిఐ ఆవిర్భవించిందని, 100 సంవత్సరాలలో స్వాతంత్రం కోసం దేశంలో ఉన్న కార్మికులు కర్షకులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం నిర్వహించిందని, నాటి నుండి నేటి వరకు పేద, మధ్యతరగతి ప్రజల పక్షాన ఉంటూ ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ అనేక పోరాట చేసిందని తెలిపారు.దీనితోపాటు ప్రమాదంలో ఉన్న రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం రక్షణకై జరుగుతున్న అన్ని ఉద్యమాలలలో కమ్యూనిస్ట్ శ్రేణులు పాల్గొనాలని అలాగే రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్. డీజిల్, వంటగ్యాస్ ధరలకు వ్యతరేకంగా పెద్దఎత్తున పోరాటాలు నిర్మించాలని ఎస్. ఛాయాదేవి కోరారు. ఈ సభలో సిపిఐ సీనియర్ నాయకురాలు పి.ప్రేమపావని, సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయకార్యదర్శి కమతం యాదగిరి, కార్యవర్గ సభ్యులు పడాల నళిని, నిర్లేకంటి శ్రీకాంత్, ఎన్. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ ఖైరతాబాద్ నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక

కార్యదర్శిగా మామిడి చెట్ల వెంకటస్వామి ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నుకోవడం తోపాటు కార్యవర్గ సభ్యులుగా నారమోలి నరసింహ, నారముని చిన్న రాముడు, చిన్న భీమేష్, గడ్డి కోపుల బాలరాజు, మామిడి చెట్ల కిరణ్ కుమార్, ఏ, బాల్ చంద్రయ్య, మామిడి చెట్ల భగత్ సింగ్, గొడుగు పాండు ఎన్నికైయ్యారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సమన్వయ సమావేశం

విశాలాంధ్ర, మల్కాజిగిరి : గణేష్ నవరాత్రి ఉత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా ఆధ్వర్యంలో రాబోయే గణేష్ నవరాత్రుల ఉత్సవాల నిర్వహణ కోసం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, వివిధ శాఖలతో సమన్వయ కమిటీ సమావేశం బుధవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి, పోలీసు, రెవెన్యూ, నీటిపారుదల, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్, సివరేజ్ బోర్డ్, ఆర్ అండ్ బి, విద్యుత్, ట్రాఫిక్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ... గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా, సామరస్యంగా జరగాలన్నదే లక్ష్యమని, అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనిలో భాగంగా సమావేశానికి హాజరైన సభ్యులకు పలు సూచనలు చేసారు. మండపాల వద్ద ప్రతిరోజు పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తారని, బ్లాక్ కవర్‌ల ఏర్పాటు చేస్తామని, చెత్తను స్వచ్ఛ ఆటోలు లకు అందించాలని సూచించారు. పోలీసు శాఖకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్ పోలీస్ అందుబాటులో ఉంటారని, చెట్ల కొమ్మలు కత్తిరించేందుకు ఆర్టికల్చర్ అధికారి ఉమామహేశ్వరి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. మినీ ట్యాంక్ బండ్ పైన నిమజ్జన ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని ఈ.ఈ లక్ష్మణ్ కు సూచించారు. వైద్య బృందం ఆరోగ్య సంబంధిత అవసరాల కోసం సిద్ధంగా ఉంటుందని, మల్కాజిగిరిలో నిమజ్జన సమయంలో మద్యపానం లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్, ఎక్సైజ్ శాఖలను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఊరపల్లి శ్రవణ్, పోలీస్ అధికారులు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై శంకర్ రెడ్డి, అగ్నిమాపక, వైద్య, ఎలక్ట్రికల్, ఆర్టికల్చర్, జలమండలి, ఆర్ అండ్ బి అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు నవీన్, హృతిక్, కిరణ్, కరణం గోపి, చంద్రశేఖర్, మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గణేష్ ఉత్సవాలను శోభాయమానంగా, భద్రతా ప్రమాణాలతో జరగాలని అధికారులని సూచించారు.

వంద శాతం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకే కాంగ్రెస్ ధర్నా

విశాలాంధ్ర - హైదరాబాద్ : న్యూఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 100 శాతం ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించేందుకే జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తోంది తప్ప బీసీల కోసం కానేకాదని, కామారెడ్డి డిక్లరేషన్ పై కాంగ్రెస్ మాట తప్పిందని, మైనారిటీ ఓట్ల కోసం ముస్లిం డిక్లరేషన్‌ను అమలు చేయాలనుకుంటోందని, బీసీలను ఘోరంగా మోసం చేస్తోందని, అందుకే కాంగ్రెస్ ధర్నాకు బీసీల మద్దతు కరువైంది పలువురు బిజెపి పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నా అసలైన ఉద్దేశ్యం బీసీల హక్కుల పరిరక్షణ కాదని, ముస్లిం రిజర్వేషన్ల కోసమేనన్నారు. న్యూఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నా, బీసీల హక్కుల కోసం కాదని, బీసీలపై చిత్తశుద్ధితో పోరాటం కాదన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు పూర్తిగా 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని తమ మేనిఫెస్టో లో హామీ ఇచ్చిందని, కానీ ఇప్పుడు బీసీ బిల్లు పేరిట అందులో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు కట్టబెట్టాలని చూస్తోందన్నారు. అంటే అసలు 42 శాతంలో బీసీలకు అందేది కేవలం 32 శాతం మాత్రమేనని, కాంగ్రెస్ పార్టీ తామే ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ నుంచి మాట తప్పిందన్నారు. మైనారిటీ ఓట్ల కోసమే ముస్లిం డిక్లరేషన్ అమలు చేయాలనుకుంటోం దని, బీసీలను ఘోరంగా మోసం చేస్తోందని, అందుకే ఈ ధర్నాకు బీసీలా మద్దతు కనిపించడం లేదన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామంటే మాత్రమే తాము మద్దతు ఇస్తామన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధాని చేశారా? ఉమ్మడి ఏపీ, తెలంగాణాలో 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎం చేశారా? రాష్ట్ర కేబినెట్‌లో, నామినేటెడ్ పదవులను ఎంతమంది బీసీలకు ఇచ్చారో చర్చిద్దామా? లోక్ సభ సభ్యుల్లో ఎంతమంది బీసీలకు సీట్లిచ్చారో కాంగ్రెస్ సమాధానమివ్వాలన్నారు. ముస్లిం ఓట్ల కోసమే కాంగ్రెస్ బీసీల నెపం తీసుకుంటూ, రిజర్వేషన్లను మళ్లిస్తోందన్నారు. యూపీ, బెంగాల్, బీహార్ తరహాలోనూ తెలం గాణలోనూ కాంగ్రెస్‌కు కనుమరుగవడం తథ్యమన్నారు. దేశానికి తొలి బీసీ ప్రధానిని చేసిన ఘనత బీజేపీదేనని, ఇప్పటివరకు 27 మంది బీసీలను కేంద్ర మంత్రులుగా, అనేక రాష్ట్రాల్లో బీసీ సీఎంలుగా నియమించిన ఘనత కూడా బీజేపీకె దక్కుతోదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అని చెప్పుకుంటున్న కాంగ్రెస్42 శాతంలోనే ముస్లింలకు 10శాతం ఇస్తున్నదని, దీనికి వ్యతిరేకంగా బీజేపీ పోరాడుతుందన్నారు. బిజెపి గోల్కొండ జిల్లా అధ్యక్షులు ఉమా మహేందర్, బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు చెరుకుల ఉదయ్‌కుమార్, జియాగూడ బీజేపీ కార్పొరేటర్ బోని దర్శన్, ఎస్సీ మోర్చ అధ్యక్షులు రాజేందర్ డిగన్, బిజెపి ఓబిసి మోర్చా ప్రధాన కార్యదర్శి కట్ట నర్సింగ్ రావు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మనీష్ జాయిన్ పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనకు జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య కొత్తపల్లి : కలెక్టర్

విశాలాంధ్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ 91వ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుంచే తెలంగాణకు జరుగుతోన్న అన్యాయాలపట్ల, అసమానతల పట్ల తీవ్రంగా పోరాటం చేశారని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని పసిగట్టి ఉద్యమానికి ఊపిరి పోశారని కలెక్టర్ కొనియాడారు. ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏఓ సునీల్ కుమార్, బి.సి.వెల్ఫేర్ అధికారి కేషురాం, వెనుకబడిన సంఘాల నాయకులు మల్లేష్ యాదవ్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశంలో 20 సంవత్సరాల టయోట ఇన్నోవా విజయయాత్ర

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశం లో తన ప్రయాణంలో గర్వించదగిన మైలురా యిని చేరుకున్న టయోటా కిర్లోస్కర్ మోటార్, మిలియన్ల భారతీయ కుటుంబాలు మరియు వ్యాపారాలకు విశ్వసనీయ సహచరుడిగా నిలిచిన టయోటా ఇన్నోవా 20 అద్భుతమైన సంవత్సరాలను జరుపుకుంది. టయోటా ఇన్నోవా మైలురాయి సందర్భంగా సంస్థ సేల్స్, సర్వీస్, యూస్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరిందర్ వాధ్వా మాట్లాడుతూ ఇన్నోవా, ఇన్నోవా క్రిస్టా, ఇన్నోవా హైక్రాస్ వేరియంట్లలో ఇప్పటివరకు 12 లక్షలకు పైగా యూనిట్ల విక్రయాలతో, ఈ బ్రాండ్ వినియోగదారుల అపారమైన విశ్వాసానికి, కాలాతీత విలువలకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు. గత రెండు దశాబ్దాలుగా, వినియోగదారుల అభిరుచులు మరియు జీవనశైలిలో చోటుచేసుకున్న మార్పులను ప్రతిబింబిస్తూ ఇన్నోవా నిరంతర అభివృద్ధి చెందుతూ, టయోటా నాణ్యత, మన్నిక, విశ్వసనీయత అనే క్యూడీఆర్ తత్వశాస్త్రాన్ని స్థిరంగా నిబద్ధతగా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ విజయ మైలురాయి కేవలం సంఖ్యల గణాంకం మాత్రమే కాదు, ఇది లక్షలాది కుటుంబాల జీవితాల్లో నిలిచిపోయేలా చేసిన అసంఖ్యాక ప్రయాణాలకు, అప్రతిహత విశ్వాసానికి, విలువైన జ్ఞాపకాలకు దృఢమైన గుర్తింపుగా నిలుస్తుందని వివరించారు."గత రెండు దశాబ్దాలుగా, టయోటా ఇన్నోవా భారతీయ వినియోగదారులతో అపారమైన భావోద్వేగ అనుబంధాన్ని ఏర్పరచుకుందన్నారు.

రూ. 480 కోట్ల సిరీస్ డి ఫండింగ్‌లో పొందిన స్లీప్ కంపెనీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారతదేశంలోని ప్రముఖ కంఫర్ట్-టెక్ బ్రాండ్ అయిన ది స్లీప్ కంపెనీ, భారతదేశ అతిపెద్ద, అత్యంత స్థిరపడిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థలైన క్రిస్ క్యాపిటల్, 360 వన్ అసెట్ నేతృత్వంలోని సిరీస్ డి నిధుల రౌండ్‌లో రూ. 480 కోట్లు సేకరించింది. ఈ నిధులు తయారీని అధికం చేయడం, ఆఫ్‌లైన్ ఉనికిని పెంచడం, కొత్త ఉత్పత్తి విభాగాలను ప్రారంభించడం, తన తదుపరి దశ వృద్ధికి సిద్ధమవుతున్నప్పుడు ఆవిష్కరణ, ప్రతిభలో పెట్టుబడి పెట్టడం వంటి కంపెనీ ప్రణాళికలను వేగవంతం చేస్తాయని ది స్లీప్ కంపెనీ సహ వ్యవస్థాపకులు ప్రియాంక సలోట్, హర్షిల్ సలోట్‌లు తెలిపారు. కొన్ని సంవత్సరాలలోనే ది స్లీప్ కంపెనీ రూ. 700 కోట్ల వార్షిక ఆదాయ రన్ రేట్‌ను దాటిందని వివరించారు.

ఆర్థిక సంవత్సరం 2025లో 60శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఇటీవలే తన 150వ ప్రత్యేక బ్రాండ్ అవుట్‌లెట్ ప్రారంభోత్సవాన్ని వేడుక చేసుకుంది. కంపెనీ తన ఆదాయాన్ని చివరిసారిగా పెంచినప్పటి నుండి నెలవారీ ఆదాయాన్ని రెట్టింపు చేసిందని పేర్కొన్నారు. తన బృందాన్ని 650 నుండి 1,500 కంటే ఎక్కువ ఉద్యోగులకు పెంచిందన్నారు. ఇది బలమైన వినియోగదా రుల డిమాండ్, కార్యాచరణ స్థాయిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.

కొత్తపల్లి జయశంకర్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ కృషి, విశేష సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ హాల్ నందు 91వ జయంతి సందర్భంగా అదనపు కలెక్టర్ కదిరవన్ పలనితో కలసి ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మహనీయ నేతకు ఘనంగా నివాళులర్పించారు. తదుపరి అదనపు కలెక్టర్ కదిరన్ పలని మాట్లాడుతూ సిద్ధాంతకర్తగా, రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మహోన్నతమైన వ్యక్తిగా, తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని త్యాగం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని ఆయన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఈ సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీవితమంతా తెలంగాణ ఉద్యమానికి, స్వరాష్ట్ర సాధనకు అంకితం చేసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ అని జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అన్నారు. బుధవారం ఆచార్య జయశంకర్ జయంతి నీ పురస్కరించుకుని జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆచార్య జయశంకర్ సేవలను గుర్తు చేసుకున్నారు. ఆచార్య జయశంకర్ ప్రొఫెసర్‌గా విద్యార్థులకు మార్గదర్శనం చేస్తూనే తన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పూర్తిగా అంకితం చేశారనీ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ పేర్కొన్నారు. వారి సేవలు చిరస్మరణీయమని చెప్పారు. అదనపు కమిషనర్‌లు రఘు ప్రసాద్, గీతా రాధిక, వేణు గోపాల్, సిఈ రత్నాకర్, అకౌంట్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రజా సంబంధాల అధికారి మహమ్మద్ ముర్తుజా, పిఆర్ఓ యం దశరథం పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జీవితం అందరికి ఆచరణీయమని, ఎంతో స్ఫూర్తి దాయకమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయశంకర్ 91 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ హరిప్రియతో కలిసి జిల్లా కలెక్టరు జ్యోతి ప్రజ్వలన గావించి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని అన్నారు. ప్రతి ఉద్యోగి, పౌరుడు ఆయన ను స్ఫూర్తిగా తీసుకొని పని చేస్తే, అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా బిసి వెల్ఫేర్ ఆఫీసర్ ఝాన్సీరాణీ, ఎఓ రాంమోహన్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని, ఆయన చిత్రపటానికి మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, ఆలోచనలు ఎప్పటికీ ఆదర్శప్రాయమైనవే. వారి కలల తెలంగాణను సమగ్ర అభివృద్ధితో తీర్చిదిద్దడమే మనం దరి కర్తవ్యంగా భావించాలి అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం ప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రధాన ప్రొ.జయశంకర్ జయంతి వేడుక ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగింది. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి పాల్గొని ప్రొ.జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం నిరంతరం తపించిన స్వాప్నికుడు ప్రొ.జయశంకర్ అని ఆయన కొనియాడారు. జలమండలి ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్- 2 ప్రవీణ్ కుమార్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్, ఫైనాన్స్ డైరెక్టర్ పద్మావతి, పర్సనల్ డైరెక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎంలు, జీఎంలు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నేడు హైదరాబాద్ మెట్రో రైల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.వి.ఎస్ రెడ్డి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. మెట్రో రైల్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎండీ ప్రొఫసర్ జయశంకర్ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మెట్రో రైల్ అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ జయశంకర్ నిస్వార్థ సేవలను, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన చేసిన అవిశ్రాంత పోరాటాన్ని శ్లాఘించారు. ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని, ఆయన కలలను సాకారం చేయాలని ఎన్.వి.ఎస్ పిలుపు నిచ్చారు. హెచ్ఎంఆర్ఎల్ అధికారులు, సిబ్బంది ప్రొఫసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు మనందరికీ ఆదర్శమని కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటిన మహా జ్ఞాని, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గౌతమ్ నగర్ లోని జయశంకర్ విగ్రహానికి గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, బిఆర్ఎస్ నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, బైరు అనిల్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) బుధవారం హైదరాబాద్‌లోని టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో అవిశ్రాంత కృషి, కీలకపాత్ర పోషించిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బోర్డు సీనియర్ అధికారులు, సిబ్బంది పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా టీజీపీసీబీ చీఫ్ ఇంజనీర్ బి.రఘుప్రో జయశంకర్ ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. టీజీపీసీబీ చీఫ్ ఇంజనీర్ బి.రఘు మాట్లాడుతూ ప్రజలలో ఉద్యమ భావజాలాన్ని ప్రొఫెసర్ జయశంకర్ రగిలించారని స్మరించుకున్నారు. జయశంకర్ స్ఫూర్తితో ఉద్యమాన్ని కొనసాగించి సాహసోపేత పోరాటం చేసి స్వరాష్ట్రాన్ని సాధించుకొన్నామని పేర్కొన్నారు. పిసిబి ఉద్యోగులు, సిబ్బంది ఘన నివాళులు అర్పించారు.

విశాలాంధ్ర - పటాన్ చెరువు : తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివని తెలంగాణ ఉన్నంతకాలం జయశంకర్ ఆశయాలు ప్రతి తెలంగాణ బిడ్డలో బతికే ఉంటాయని పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. నీళ్లు నిధులు నియామకాలు అనే సిద్ధాంతాన్ని నమ్ముకొని దగా పడుతున్న తెలంగాణను రక్షించేందుకు ఉద్యమ పంతాన్ని ఎంచుకున్న గొప్ప నాయకుడు అభ్యుదయ వాది ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. బుధవారం తెలంగాణ ఉద్యమ ఊపిరి, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో గల జయశంకర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్థానిక బి ఆర్ ఎస్ నాయకులతో కలసి జయశంకర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించడం జరిగింది. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై జరిగిన తొలి, మలి ఉద్యమాలకు ఊపిరి పోసిన గొప్ప పోరాట యోధుడు, ఉద్యమ ఆద్యుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని కొనియాడారు. పటాన్ చెరువు పట్టణ టిఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు యాదవ్, బండ్లగూడ కాలనీ అధ్యక్షుడు భరత్ కుమార్, ఆల్విన్ కాలనీ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మొయినాబాద్: తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా అలు పెరుగని పోరాటం సాగించి ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ త్యాగం చిరస్మరణీయమని తెలంగాణ ఉద్యమకారుల జిల్లా అధ్యక్షులు కుమ్మరి రమేష్ పేర్కొన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా మొయినాబాద్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసి తెలంగాణ స్వరాష్ట్రం సాధన కొరకు కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్, మండల అధ్యక్షులు అవినాష్, ఉపాధ్యక్షులు ముకుందా రెడ్డి, మండల కార్యదర్శి నరసింహ, నవీన్, బిక్షపతి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్ ది బోల్డెస్ట్ బ్లాక్‌ను విడుదల చేసిన నిస్సాన్

విశాలాంధ్ర - వరంగల్ : నిస్సాన్ మోటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ ఎం ఐ పీ ఎల్), ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న కొత్త నిస్సాన్ మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను నేడు విడుదల చేసినట్లు వెల్లడిం చింది. ఈ సందర్భంగా నిస్సాన్ ఇండియా మోటార్స్ డైరెక్టర్ సౌరబ్ వత్స మాట్లాడుతూ ఇది దాని ప్రసిద్ధ కాంపాక్ట్ ఎస్యువి అద్భుతమైన ప్రీమియం, బ్లాక్-థీమ్ వేరియంట్. రూ.8.30 లక్షల (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ) ప్రారంభ ధర కలిగిన కురో స్పెషల్ ఎడిషన్ బోల్డెస్ట్ బ్లాక్ ఫిలాసఫీతో అత్యంత ఆకర్షణీయమైన శైలి, సువేవ్ ఇంటీరియర్ బ్లాక్ థీమ్, జపనీస్ ఇన్స్పైర్డ్ డిజైన్ సూచనలను కలిగి ఉంటుందని చెప్పారు. కొత్త నిస్సాన్ మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్‌ను సరసమైన రీతిలో కేవలం రూ.11,000 చెల్లించి బుకింగ్ చేసుకోవటానికి అందుబాటులో ఉందన్నారు. కస్టమర్లు తమ వాహనాన్ని అధీకృత నిస్సాన్ మోటర్ ఇండియా డీలర్‌షిప్‌ల ద్వారా లేదా అధికారిక నిస్సాన్ మోటర్ ఇండియా వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ నిస్సాన్ డాట్ ఇన్‌ను సందర్శించడం ద్వారా రిజర్వ్ చేసుకోవచ్చన్నారు. మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్ దాని పేరును జపనీస్ పదం 'బ్లాక్' నుండి తీసుకుందని, ఇది అధునాతన విలాసం, జపనీస్ డిజైన్ ఖచ్చితత్వాన్ని వేడుక జరుపుకుంటుందన్నారు. ఈ స్పెషల్ ఎడిషన్ పూర్తి నల్లటి బాహ్య, లోపలి భాగాలను కలిగి ఉంటుంది. వెలుపల, లోపల ప్రీమియం, గంభీరమైన, ఆకర్షణీయమైన స్టేట్‌మెంట్‌ను చేస్తుంది. కస్టమర్ అనుభవా న్ని, సౌలభ్యాన్ని మెరుగుపరచడానికి, మాగ్నైట్ కురో స్పెషల్ ఎడిషన్ నిస్సాన్ వెబ్‌సైట్‌లో ఫోటోరియలిస్టిక్ విజువల్స్, ఫీచర్ ఇంటరాక్షన్‌లు సమగ్రమైన ప్రయాణంతో దృశ్యపరంగా ప్రభావవంతమైన 3 డీ కాన్ఫిగరేటర్ ద్వారా అందుబాటులో ఉందన్నారు.

సత్యానిదే గెలుపు...

విశాలాంధ్ర - బషీర్ బాగ్: నిజాయితీ ఎప్పటికీ గెలుస్తుందనీ, బిజెపి ఎన్ని కుట్రలు చేసినా ఎన్ని కుతంత్రాలు పన్నినా బిజెపికి ప్రత్యామ్నాయంగా మారిన ఆమ్ ఆద్మీ పార్టీ నేతలపై సిబిఐ ద్వారా అవినీతి ఆరోపణలు చేసినా సత్యం (ఆమ్ ఆద్మీ) గెలుపును ఎవరు ఆపలేరని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అసత్య ఆరోపణల కేసు నుండి ఆప్ సత్యేంద్ర జైన్‌కు ఢిల్లీ కోర్టు క్లీన్ చిట్ హర్షణీయం అని అన్నారు. సిబిఐ అధికారులపై సత్యేంద్ర జైన్ న్యాయపోరాటం చేశారనీ అన్నారు. సాక్ష్యాధారాలను సమర్పించడంలో సీబీఐ విఫలమైందనీ, ఎవరినైనా అరెస్ట్ చేయాలంటే అనుమానం ఉంటే సరిపోదని తదుపరి చర్యలకు నేరానికి పాల్పడ్డారని అనడానికి బలమైన ఆధారాలు ఉండాల'ని కోర్టు తెలిపిందన్నారు. దీంతో బీజేపీ అంటే "బురద జల్లే పార్టీ అని" స్పష్టమవుతుందని అన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర రాము గౌడ్ మాట్లాడుతూ, "ఎన్నో నిందలు తమ నాయకుల పైన మోపారనీ ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్, సిసోడియా పైన అలాగే తమ నాయకులు అందరి పైన పెట్టిన కేసులు త్వరలోనే ఈ కేసు లాగానే కొట్టి వేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోర్ కమిటీ సభ్యులు మహమ్మద్ మజీద్, మాజీ మహిళా అధ్యక్షురాలు హేమాజిల్లోజు, మాజీ అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్, ఎం శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, రాకేష్ సింగ్, వివేక్, మౌనిక, లియాఖతాన్, జీశాన్ నెహ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ల పరిధిలో బ్యాటరీ స్వాపింగ్ కేంద్రాలు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి : పట్టణ ప్రయాణాలను పునర్నిర్వచించేలా ఓ సరికొత్త అడుగు పడింది. దేశంలోనే ప్రముఖ బ్యాటరీ స్వాపింగ్ ప్రొవైడర్ అయిన ఇండోఫాస్ట్ ఎనర్జీతో భారతీయ రైల్వేశాఖ చేతులు కలిపింది. ఇంధన దిగ్గజం అయిన ఇండియన్ ఆయిల్, సుస్థిర మొబిలిటీ సంస్థ అయిన సన్ మొబిలిటీలతో 50-50 జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసి, హైదరా బాద్, సికింద్రాబాద్ డివిజన్ల లోని కీలక రైల్వేస్టేషన్ల వద్ద అత్యాధునిక బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్లను ఏర్పాటుచేస్తున్నారు. ఈ భాగస్వామ్యం కింద ఇప్పటికే 25 రైల్వేస్టేషన్ల పరిధిలో మొత్తం 80 స్వాపింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. వీటిలో 56 స్వాపింగ్ స్టేషన్లు సికింద్రాబాద్ డివిజన్‌లోను, మరో 24 హైదరాబాద్ డివిజన్‌లోను ఉన్నాయి. రాబోయే మూడు నెలల్లో ఇంకో 40 స్వాపింగ్ స్టేషన్లనూ ఏర్పాటుచేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ ఇంధన మిషన్‌కు తోడ్పాటు అందించి, విద్యుత్ వాహనాల వాడకాన్ని మరింత ప్రోత్సహించేందుకు ఈ చొరవ ఎంతగానో ఉపయోగపడనుంది. ప్రయాణికులు, వ్యాపార కోణాల్లో ఎలా చూసినా ఈ స్వాపింగ్ స్టేషన్లు రోజువారీ అవసరాలను తక్షణం తీర్చడమే కాకుండా.. స్వచ్ఛమైన, హరిత భవిష్యత్తును అందించడానికి మార్గం సుగమం చేస్తాయి. ఈ సందర్భంగా ఇండోఫాస్ట్ ఎనర్జీ సీఈఓ అనంత్ బద్జాత్య మాట్లాడుతూ, "హైదరాబాద్ నగరంలోని మా ఆపరేషనల్ స్టేషన్లు ఇప్పటికే చివరి మైలు కనెక్టివిటీని ప్రోత్సహిస్తూ డెలివరీ సేవలకు సాధికారత అందిస్తూ.. ఈ రంగానికి ప్రాణవాయువులా నిలిచింది. ఈ పరిమాణాత్మక ప్రయాణంలో ఇప్పుడు భారతీయ రైల్వేశాఖతో భాగస్వామ్యం పొందడం మాకు గర్వకారణం. ఈ అనుబంధంతో మరింత హరిత, సమర్థ భవిష్యత్తును అందిస్తామని, తక్షణమే వేగంగా స్వాపింగ్ చేయగలమని చెప్పడానికి ఎంతో ఉత్సుకతతో ఉన్నాం" అని చెప్పారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఎంపీ ఈటెలకి ఆహ్వానం

విశాలాంధ్ర-దుండిగల్: బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్ బంగారు మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ సతీమణి ఈటెల జమునని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆగస్టు 9 నుండి 11 వరకు నిర్వహించబోయే శ్రీ శ్రీ శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకలకు, బోనాల మహోత్సవంలో ఇరువురు దంపతులు కలసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బంగారు మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవానికి తెలంగాణ జాగృతి నాయకత్వం

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో సామాజిక విప్లవానికి తెలంగాణ జాగృతి నాయకత్వం వహిస్తుందని, సాంస్కృతిక విప్లవంతో పాటు సామాజిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆ సంస్థ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. సామాజిక తెలంగాణ సాధనకు ఒక్క అంశాన్ని వదిలిపెట్టబోమని తేల్చిచెప్పారు. బుధవారం నాడు బంజారాహిల్స్ లోని జాగృతి ప్రధాన కార్యాలయంలో తెలంగాణ జాగృతి ఆవిర్భావ ఉత్సవాలు, ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జాగృతి ప్రధాన కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత జాతీయ పతాకం, తెలంగాణ జాగృతి జెండా ఎగరవేశారు. ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి ఎమ్మెల్సీ కవిత పుష్పాంజలి ఘటించారు.ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత సామాజిక తెలంగాణ కోసం, బీసీల కోసం ఉద్యమం చేస్తానని ప్రొఫెసర్ జయశంకర్ సార్ అనేవారని గుర్తు చేశారు. ప్రపంచీకరణ, కార్పొరేట్ల నేపథ్యంలో వృత్తి పనులు నాశనమవుతున్న క్రమంలో సామాజిక విప్లవం రావాలి అనే ఆకాంక్షించేవారని, భౌగోళిక తెలంగాణ సాధనతో పాటు సామాజిక తెలంగాణ ధ్యేయంగా ఉండాలని చెప్పేవారని, కాబట్టి ప్రొఫెసర్ జయశంకర్ సార్ స్ఫూర్తితో తెలంగాణ జాగృతి పనిచేస్తుందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకై తాను చేపట్టిన 72 గంటల పాటు నిరహార దీక్షను ప్రభుత్వం భగ్నం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీసీ బిల్లుకు కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకుల మద్దతు

విశాలాంధ్ర- దుండిగల్: బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు బీసీ బిల్లుకు మద్దతుగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నాలో నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. గుంజ శ్రీనివాస్,130 డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికిరణ్ పటేల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోగికర్ కరణ్, ఉపాధ్యక్షులు నగేష్ రెడ్డి, చందు పాల్గొన్నారు.

దక్షిణాది నగరాల్లో హాలిడే రుణాలకు ఆదరణ

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : దక్షిణాది నగరాల్లో హాలిడే రుణాలకు ఆదరణ పెరిగిందని పైసాబజార్ సీఈఓ సంతోష్ అగర్వాల్ తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలు వ్యక్తిగత రుణాల ద్వారా తమ ప్రయాణ కోరికలను తీర్చుకుంటున్న వారిలో 38శాతం డిమాండ్ ఉన్నట్లు పైసాబజార్ నివేదికలో వెల్లడైందన్నారు. పైసాబజార్ తాజా రిపోర్టు 'హౌ ఇండియా ట్రావెల్స్ యూజింగ్ హాలిడే లోన్స్ (వాల్యూమ్ 2.0)' ప్రకారం, 2025 మొదటి అర్ధ వర్షంలో వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారిలో 27శాతం మంది వాటిని సెలవు ప్రయాణాలకు వినియోగించారని పేర్కొన్నారు. ఇది 2023లో నమోదైన 21శాతంతో పోలిస్తే గణనీయమైన వృద్ధి నమోదు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా చూసినపుడు ఢిల్లీ 35శాతం డిమాండ్‌తో మొదటి స్థానంలో ఉందన్నారు. హైదరాబాద్ రెండో స్థానాన్ని సాధించిందన్నారు. బెంగళూరు 14శాతం నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. చెన్నై 6శాతంతో ఉందన్నారు. హాలిడే రుణాపై పెరుగుతున్న ఆసక్తి టైర్-2, 3 నగరాల్లో అధికంగా ఉందన్నారు. పైసాబజార్ నిర్వహించిన వినియోగదారుల అవగాహన నివేదిక దేశవ్యాప్తంగా 97 నగరాలు, పట్టణాల్లో ఉన్న 5,700 మందికి పైగా సర్వే ఆధారంగా రూపొందించామన్నారు. ఈ నివేదికలో కొన్ని ఆసక్తికరమైన అంశాలు వెల్లడయ్యాయన్నారు. ఈ రెండో సంచిక నివేదిక ద్వారా ప్రజలు ఎలా తమ ట్రావెల్ డ్రీమ్స్‌ను తీర్చుకుంటున్నారో వివరించడం ఆనందంగా ఉందన్నారు. 2025లో హాలిడే రుణం తీసుకున్న వారిలో దాదాపు 30శాతం మంది జెన్ జెడ్ తరం (వయస్సు 28 ఏళ్ల లేదా తక్కువ)కు చెందిన వారేనన్నారు.

సమాచార హక్కు చట్టంతో అవినీతిని నిర్మూలించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: సమాచార హక్కు చట్టాన్ని ఉపయోగించి ప్రభుత్వంలో అవినీతిని ఎదుర్కోవడానికి ప్రజలను ప్రోత్సహించడం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ముఖ్య ఉద్దేశమని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డా.చంటి ముదిరాజ్ అన్నారు. బుధవారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రంగారెడ్డి జిల్లా, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా సభ్యులు ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా కార్యాచరణ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడానికి, పౌరులకు సమాచారాన్ని పొందే హక్కును ఉపయోగించడంలో సహాయపడటానికి ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, సమర్ధవంతంగా అమలు చేయడానికి, పర్యవేక్షించడానికి ప్రభుత్వంతో కలిసి కమిటీ పనిచేస్తుందన్నారు. ఈ సదస్సుకు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముచ్చర్ల మల్లేష్ అధ్యక్షత వహించారు. కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.దిలీప్ రావు, ఉపాధ్యక్షుడు గోపినాథ్ కట్టికోల, సంయుక్త కార్యదర్శి వై.కార్తీక్ రెడ్డి, సాహోజు శృతి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి ఈధుల కిరణ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు పి.రాజు గౌడ్, ఉపాధ్యక్షులు మల్లం శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి ప్రవీణ్, శ్రీనివాస రావు, దీపక్ కుమార్ కులకర్ణి, కొండయ్య, కందుకూరి రాములు, పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో రాణించాలి

విశాలాంధ్ర - అమనగల్లు : చట్టసభల్లో బలమైన చర్చలు జరగాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఆమనగల్లు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు, మున్సిపల్ కార్యదర్శి పద్దెమోని శివకుమార్ జన్మదిన వేడుకలు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి జన్మదిన శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో పాతతరం అంతరించిపోయిందని మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు. ఈ వేడుకలలో సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామి, ఆమనగల్లు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సూరమల్ల సుభాష్, తలకొండపల్లి బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

దేవతారాధనతో మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: దేవతారాధనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. బుధవారం నియోజకవర్గం 132 - జీడిమెట్ల డివిజన్ పరిధి వెంకటేశ్వర కాలనీ ఈస్ట్‌లోని శ్రీ సంకట విమోచన వీరాంజనేయ ఆలయ తృతీయ వార్షికోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ స్వామి వారి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి ప్రధాన కార్యదర్శి చక్రవర్తి ట్రెజరర్ వెంకట్రెడ్డి సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సమ్మయ్య, శంకర్, రామచందర్, రాజ్ కుమార్, ఓబయ్య, గంగాధర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంట సిద్దిరాములు, నరేందర్ రెడ్డి, సంపత్ గౌడ్, ఎల్లా గౌడ్, శంకర్, బాల మల్లేష్, కాలే నాగేష్, బలరాం, నార్లకంటి కుమార్, శ్రీకాంత్, ఉమాపతి, వేణుగోపాల్, సతీష్ ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు పిల్లలకి అమృతంతో సమానం

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: తల్లిపాలు పిల్లలకి అమృతంతో సమానమని, సకల పోషకాల మిళితమైన ఈ పాలు పసి పిల్లల్ని బాలరిష్టాల నుంచి రక్షించడంలో తోడ్పడతాయని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం బ్రెస్ట్ ఫీడింగ్ డే సందర్భంగా నియోజకవర్గం సూరారం కాలనీలోని సీతారామయ్య నర్సింగ్ కాలేజ్ కరస్పాండెంట్ దాక్షాయిని ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం సురేష్ రెడ్డి మాట్లాడుతూ తల్లిపాల ప్రాముఖ్యత చాలా గొప్పదని, తల్లి పాలు శిశువులకు సంపూర్ణ పోషకాహారం, ఇది వారి ఎదుగుదలకు, అభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. తల్లి పాలు శిశువు యొక్క రోగనిరోధక శక్తిని పెంచి, వ్యాధుల నుండి రక్షిస్తూ తల్లి, బిడ్డ మధ్య బంధాన్ని ఏర్పరచడంలో సహాయపడుతుం దని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యు పి హెచ్ సి డాక్టర్ సేహనాజ్, కాలేజ్ నర్సులు, టీచింగ్ స్టాఫ్, విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్స్‌లో సిసి రోడ్డు పనులు ప్రారంభం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: కోర్ట్ కాంప్లెక్స్‌లో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనులతో కోర్టు కాంప్లెక్స్ మరింత శోభాయమానంగా మారనుంది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యులు కోర్టు కాంప్లెక్స్‌లో సిసి రోడ్డు నిర్మాణం కొరకై స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను సంప్రదించగా న్యాయవాదుల కోరికపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంటనే స్పందించి తక్కువ కాలంలో మున్సిపల్ నిధులు కేటాయింప చేయించి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు ప్రోత్సాహం అందించారు. మున్సిపల్ నిధులు కేటాయించడంతో కోర్టు కాంప్లెక్స్ లో నూతన సిసి రోడ్డు నిర్మాణ పనుల పూజా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ సివిల్ జడ్జి స్వాతి రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి కొత్త రవీలు హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి కొబ్బరికాయలు సమర్పించి సిసి రోడ్డు పనులను ప్రారంభించడం జరిగింది. న్యాయవాదులు అడిగిన వెంటనే అధికారులతో సంప్రదింపులు జరిపి నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావడానికి పూర్తి సహకారం అందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్వ వేణుగోపాలరావు, శ్రీనివాస్ రెడ్డిలతో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు సంతోషం వ్యక్తపరుస్తూ ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా కోర్టు కాంప్లెక్స్‌లో బహుళ అంతస్తు నిర్మాణం కొరకై 8 కోట్ల రూపాయల అనుమతులకు కూడా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన ప్రోత్సాహాన్ని అందిస్తున్నందుకు కూడా న్యావదులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆత్మగౌరవం తాకట్టు పెట్టొద్దు

- ట్రంప్‌కు మోదీ తలవంచరాదు
- జగన్ బాటలోనే చంద్రబాబు
- కరెంట్ జోలికి వస్తే ప్రజలు క్షమించరు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-తూర్పు గోదావరి: దేశ ఆత్మ గౌరవాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ప్రధాని మోదీ తాకట్టు పెట్టరాదని, ఆయనకు తలవంచకూడదని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను పార్లమెంటులో ఖండించకుండా దేశ ప్రతిష్ఠను మోదీ దిగజార్చారని విమర్శించారు. కార్పొరేట్లకు దేశ సంపద దోచిపెట్టడం ఆక్షేపణీయమన్నారు. ప్రపంచంలో 146 కోట్ల మంది జనాభా కలిగిన భారతదేశాన్ని ట్రంప్ బెదిరిస్తున్నారని, ఎవరితో వ్యాపారం చేయాలో చెబుతాడని, ఆయనకు దీటుగా సమాధానం చెప్పలేని, అమెరికాకు భయపడే బలహీనమైన ప్రధాని మోదీ... ఈయన దేశాన్ని ఎలా నడపగలరని రామకృష్ణ ప్రశ్నించారు. సీపీఐ తూర్పు గోదావరి జిల్లా 26వ మహాసభలు సందర్భంగా బుధవారం స్థానిక చిట్టూరి ప్రభాకర్ చౌదరి వేదిక సుబ్రమణ్య మైదానంలో జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ సెప్టెంబర్ 22 నుంచి 25 తేదీల్లో చండీగఢ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు జరుపుకోబోతున్నామన్నారు. శత వార్షికోత్సవాల్లో భాగంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అలాగే, డిసెంబర్ 24, 25 తేదీల్లో విజయవాడలో అంతర్జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాల ప్రముఖులు హాజరవుతారన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల అసమర్ధ పాలనను ఎండగట్టారు. మోదీ 11ఏళ్ల పాలనలో ఒక్క సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపలేదన్నారు. కనీసం కోటి రూపాయల అవినీతి సొమ్మును వెనక్కి తేలేదని విమర్శించారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు, చేతి వృత్తిదారులకు ఉపయోగపడే చర్యలేవీ లేవన్నారు. దేశం పురోభివృద్ధి కోసం మనమంతా ఉమ్మడి పోరాటం చేయాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ 14 మాసాల పాలనలో జరిగిన పురోగతి ఏమిటని ప్రశ్నించారు. 14 నెలల్లో లక్షా 75 వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని సీఎం చంద్రబాబును విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల రాష్ట్రం చేశారన్నారు. విద్యుత్ చార్జీలను అమాంతం పెంచేశారని, స్మార్ట్ మీటర్లు అంటూ ప్రజలపై మరింత భారం పెంచేందుకు సిద్ధమయ్యారని, కరెంటు పేరిట వేధిస్తే రాష్ట్ర ప్రజలు క్షమించరని చంద్రబాబును రామకృష్ణ హెచ్చరించారు. అమరావతికి లక్ష ఎకరాలు కావాలంటున్న చంద్రబాబు... ఆ స్థలం ఎందుకో సమాధానం చెప్పరని, ఆయనకు భూమి పిచ్చి పట్టిందని రామకృష్ణ విమర్శించారు. పోలవరం డ్యామ్ 46.7 మీటర్లు ఎత్తులో నిర్మిస్తేనే ఉపయోగమని, ఎత్తు తగ్గించాలని మోదీ చెప్పడంతో చంద్రబాబు అందుకు యత్నిస్తున్నారన్నారు. మోదీ ఆడించినట్లు ఆడుతున్నారని రామకృష్ణ వ్యాఖ్యానించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ మోదీ హయాంలో గిరిజనులు, దళితులు, మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. ఇలాంటి దురాగతాలను ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను కాల్చేస్తున్నారని, దేశం వనరులను, సంపదను దోచుకోవడానికి ఆపరేషన్ కగార్ చేపట్టారని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నాయని, వీటిపై కార్మికులకు పోరాడాలని అన్నారు. కష్టజీవుల ఉద్యమాలకు సీపీఐ ఎల్లప్పుడు అండగా నిలుస్తుందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కోండ్రపు రాంబాబు, రేఖ భాస్కరరావు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్ర ప్రసాద్, కాకినాడ జిల్లా కార్యదర్శి బోడకొండ, నగర కార్యదర్శి కొండలరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు బీవీవీ కొండలరావు, జాతీయ సమితి సభ్యుడు తోకల ప్రసాద్, జట్లు సంఘం కార్యదర్శి సప్పరమణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లావణ్య, జ్యోతి రాజు, చింతలపూడి సునీల్, త్రిమూర్తులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి ఉమ్మడి జిల్లా నాయకులు శ్యామ్, నౌరుజి, ఉమా ప్రేమానందం, నాగబాబు అధ్వర్యంలో కళా రూపాలు మహాసభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య బుధవారం సీపీఐ కేరళ రాష్ట్ర కార్యాలయం 'ఎంఎన్ స్మారకం'ను సందర్శించారు. సీపీఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఆపై చిరు సత్కారం చేశారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు పన్నియన్ రవీంద్రన్, రాష్ట్ర రెవెన్యూ మంత్రి కె.రాజన్, పశుసంవర్ధక శాఖ మంత్రి జె.చించురాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలి

రాజేంద్ర బాబు డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: రాష్ట్రంలో వివిధ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతకు బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేసి ఉచిత మెటీరియల్ అందజేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు డిమాండ్ చేశారు. ఒంగోలులోని సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే నేటికీ ప్రారంభం కాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగ యువతకు స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పొరుగున తెలంగాణ రాష్ట్రంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి బ్యాంకు, రైల్వే, డీఎస్సీ, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల కోసం నిరంతరంగా కోచింగ్ ఇస్తున్నారని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వాలని కోరారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి శిక్షణ ఇస్తామని ప్రకటించి ఆరు నెలలు గడుస్తున్నా... ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని, నిరుద్యోగ యువత భవిష్యత్ కాపాడాలని కోరారు ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ప్రభాకర్, రాష్ట్ర నాయకులు బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు వద్దు

- కేంద్ర కార్మిక సంఘాలు, ఎస్‌కేఎం డిమాండ్
- 13న దేశవ్యాప్త ఆందోళన జయప్రదానికి పిలుపు

న్యూదిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 25 శాతం సుంకం, రష్యాతో చమురు కొనుగోలునకు అదనపు పన్నులు విధిస్తామని ప్రకటించడాన్ని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూ)లు తీవ్రంగా ఖండించాయి. ఆర్థికపరంగా అడ్డుకోవడం ద్వారా భారత్‌ను శాశించే ప్రయత్నంగా ట్రంప్ విధానాన్ని దుయ్యబట్టాయి. రష్యాతో వాణిజ్య సంబంధాలు వద్దని అమెరికా ఎలా చెబుతుందని ప్రశ్నించాయి. సార్వభౌమ దేశాలను వేధించేందుకు సుంకాలను అస్త్రంగా మల్చుకొని... అమెరికా సంస్థలకు బహిరంగ మార్కెట్ల ద్వారాలు తెరవాలని డిమాండ్ చేయడం ద్వారా తన వాణిజ్య విధానాల కపటత్వాన్ని ట్రంప్ బట్టబయలు చేసుకున్నారని కార్మిక-రైతు సంఘాలు వ్యాఖ్యానించాయి. పశ్చిమ దేశాలపై ఆధారపడటాన్ని భారత్ తగ్గించుకోవాలని, ఆ దేశాలకు దాసోహం కావద్దని కేంద్రానికి హితవు పలికాయి. రైతులు, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టే బ్రిటన్‌తో సమగ్ర ఆర్థిక వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ)తో భారత్ లొంగిపోయిందని తేలిందన్నాయి. విదేశీ కార్పొరేట్ల లాభాల కోసం దేశ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పణంగా పెట్టేసిందని విమర్శించాయి. బెదిరింపులను, హెచ్చరికలను తిప్పికొట్టడం మానేసి రాజీ పంథాను అనుసరిస్తోందని వ్యాఖ్యానించాయి. కార్పొరేట్ లూటీని అరికట్టడం, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే ఉద్దేశంతో ట్రంప్ సుంకాలు, బ్రిటన్‌తో వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఈనెల 13న తలపెట్టిన దేశవ్యాప్త ఆందోళన జయప్రదానికి పిలుపునిచ్చాయి. ఆ రోజు ట్రాక్టర్ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ప్రదర్శనలు, బహిరంగ సభలు పెద్దఎత్తున జరుగుతాయని పేర్కొన్నాయి. వివిధ మాధ్యమాల ద్వారా భాగస్వామ్య సంస్థలతో కలిసి వేర్వేరు రూపాల్లో ఆందోళనలు చేయనున్నట్లు సీటీయూలు-ఎస్‌కేఎం వెల్లడించాయి. స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్యం, సార్వభౌమత్వం, ప్రజల ఐక్యతా విలువలను సమర్థించే వారసత్వాన్ని ముందుకు తీసుకెళతామని వెల్లడించాయి. కార్మికులు, కర్షకుల సమస్యల పరిష్కారానికి చర్యలను డిమాండ్ చేశాయి. సుంకాల పేరిట ట్రంప్ బెదిరింపులను తిప్పికొట్టాలని, రష్యా సహా అన్ని దేశాలతో వాణిజ్యం కొనసాగించే స్వేచ్ఛ తమకున్నదని తేల్చిచెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అలాగే, భారత్-బ్రిటన్ మధ్య ఒప్పందాన్ని పున:పరిశీలించాలని, సవరించాలని కోరాయి. కార్పొరేట్ దోపిడీని అరికట్టేందుకు అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలను నిలిపివేయాలని డిమాండ్ చేశాయి. ఇకపై ఎలాంటి రహస్య వాణిజ్య ఒప్పందాలు వద్దని హితవు పలికాయి. భవిష్యత్‌లో ఒప్పందాలన్నీ పూర్తిగా పార్లమెంటు పర్యవేక్షణలో, ప్రజలతో సంప్రదింపుల ద్వారా జరగాలని సూచించాయి. నాడు వాణిజ్యం ద్వారానే భారత్‌ను వలస రాజ్యంగా ఈస్ట్ ఇండియా కంపెనీ మార్చిందని గుర్తుచేశాయి. ప్రస్తుతం సీఈటీఏ, అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు కార్పొరేట్ సామ్రాజ్యవాదానికి కొత్త సాధనలయ్యాయని దుయ్యబట్టాయి. దేశ సార్వభౌమత్వం, స్వాతంత్ర్యం పరిరక్షణ కోసం కార్మికులు, కర్షకులు ఐక్యపోరాటాలతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చాయి. చరిత్రను పునరావృతం కానివ్వమన్న సందేశం ఇవ్వాలని కోరాయి. 'క్విట్ ఇండియా, అగెయిన్' అంటూ ఎస్‌కేఎం, కేంద్ర కార్మిక సంఘాలు నినాదమిచ్చాయి.

న్యాయం కోసం రాజీలేని పోరు

- మైనారిటీలపై దాడులకు ఖండన-రక్షణకు డిమాండ్
- చత్తీస్‌గఢ్‌లో సీపీఐ మహా ధర్నా, మార్చ్

నారాయణ్‌పూర్: మైనారిటీలపై మతపరమైన దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ సీపీఐ అధ్వర్యంలో చత్తీస్‌గఢ్‌లో మహా ధర్నా జరిగింది. నారాయణ్‌పూర్ కలెక్టరేట్ వరకు ఎర్ర సైన్యం కదం తొక్కింది. ఇటీవల ముగ్గురు బాలికలతో పాటు కేరళకు చెందిన ఇద్దరు నన్స్ ప్రీతి, వందనలకు మతోన్మాదుల వేధింపులు, వారిపై అక్రమ కేసులు, నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించింది. బజరంగ్ దళ్‌కు చెందిన నేరగాళ్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, మైనారిటీలపై దాడులను నియంత్రించాలని డిమాండ్ చేసింది. 'బెదిరింపులకు తలొగ్గబోం. విద్వేషానికి ప్రయోగ శాలగా చత్తీస్‌గఢ్‌ను మారినివ్వం. న్యాయం, సమానత్వం కోసం రాజీలేని పోరాటాన్ని కొనసాగిస్తాం. అజేయంగా ముందుకెళతాం' అన్న సందేశాన్ని తాజా ఆందోళన ద్వారా సీపీఐ ఇచ్చింది. వెనుకబడిన వర్గాలకు చెందిన ముగ్గురు బాలికలకు న్యాయపరంగానే కాకుండా సామాజికపరంగా సహాయం చేసే పూర్తి బాధ్యతను ప్రగతిశీలవాదుల తోడ్పాటుతో సీపీఐ నారాయణ్‌పూర్ జిల్లా సమితి తీసుకుంది. ఇందుకుగాను పార్టీ జిల్లా కార్యదర్శి ఫూల్ సింగ్ కచ్లామ్, ముగ్గురు బాలికలకు బెదిరింపులు వచ్చాయి. కానీ సీపీఐ నేత బెదరలేదు. దర్యాప్తు కొనసాగుతుండటంతో బాధితులకు భద్రత, న్యాయం కోసం డిమాండ్ చేశారు. నారాయణ్‌పూర్‌లోని బఖారుపారా మార్కెట్ వద్ద ర్యాలీనుద్దేశించి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.సాజి, నారాయణ్‌పూర్ జిల్లా కార్యదర్శి ఫూల్ సింగ్ ప్రసంగించారు. పార్టీ కార్యకర్తలు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నారాయణ్‌పూర్ కలెక్టరేట్ వరకు మార్చ్ నిర్వహించారు. 300 మంది పాల్గొనేందుకే అనుమతి లభించగా రెండు వేల మందికిపైగా కదం తొక్కారు. బాధితులకు రక్షణ, దోషులపై చర్యల కోసం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మతోన్మాదుల పక్షాన నిలుస్తూ తమ ధర్నా, ప్రదర్శనను అడ్డుకునేందుకు యంత్రాంగం ప్రయత్నించినట్లు నాయకులు తెలిపారు. గట్టి సంకల్పంతో ముందుకు సాగడంతో మార్చ్ విజయవంతం అయిందన్నారు. మతతత్వ శక్తులకు, వారి మిత్రపక్షాలకు వ్యతిరేకంగా ప్రజలు ఏకమయ్యారని తెలిపారు. అణగారిన వర్గాలకు చెందిన బాధితులపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం తగదని ఫూల్ సింగ్ అన్నారు. వెనుకబడిన వర్గాల వారికి కావల్సినది అవమానాలు కాదు గౌరవ జీవితం అని అన్నారు. బాధితులకు అండగా నిలిచిన తమను కొందరు బెదిరిస్తున్నారని, బెదిరంపులకు భయపడేది లేదని చెప్పారు. రాజ్యాంగబద్ధ హక్కులు, సామాజిక న్యాయం కోసం రాజీలేని పోరాటం చేస్తున్నట్లు ఫూల్ సింగ్ వెల్లడించారు. చత్తీస్‌గఢ్‌ను విద్వేషానికి ప్రయోగ శాలగా మారన్వివమని పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంకల్పించారు. దోషులను శిక్షించడంలో యంత్రాంగం విఫలమైతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో దంతెవాడ ఆదివాసీ మహాసభ ఉపాధ్యక్షుడు సుద్రు రామ్ తేలం, సీపీఐ మహిళా నాయకులు త్రిస్టీ జాది, కార్మిక నాయకుడు సరేశ్ నాగ్ తదితరులు పాల్గొన్నారు. లౌకికవాదం, మైనారిటీల హక్కుల పరిరక్షణకు మద్దతు ప్రకటించారు.

20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

నైపుణ్యాలతో యువతకు అద్భుత అవకాశాలు: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్‌లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. విజయవాడ నోవాటెల్ హోటల్‌లో 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన గ్రీన్‌ఎనర్జీ సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్‌ను శక్తివంతం చేసే దిశగా ఈ సమావేశం దోహదపడుతోందని లోకేశ్ అన్నారు. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ నినాదంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. అనంతపురమును ఆటోమొబైల్ హబ్‌గా, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్, నెల్లూరులో ఎయిర్ కండిషనర్ల స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్‌గా, గుంటూరు, కృష్ణా జిల్లాలను క్వాంటమ్ వ్యాలీ హబ్‌గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వాహబ్, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటాసెంటర్, ఐటీ, మెడికల్ డివైస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌లుగా చేస్తామన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో అనేక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని, ప్రైవేటు రంగంతో నిపుణులైన యువతను అనుసంధానించడం అవసరమన్నారు. హరిత ఇంధన రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, ఎన్ఆర్ఈడీసీ క్యాప్ వైస్‌చైర్మన్ కమలాకర్ బాబు, స్వనీతి ఇనీషియేటివ్ సీఈఓ రీత్వికా భట్టాచార్య పాల్గొన్నారు.

కోనసీమ యూత్ సమ్మిట్ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర-సచివాలయం: యూత్ సమ్మిట్‌లతో యువత మరింత నైపుణ్యత సాధించగలరని లోకేశ్ తెలిపారు. ఈనెల 12న అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని రామచంద్రాపురంలో కోనసీమ యూత్ సమ్మిట్ పోస్టర్‌ను బుధవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో ఆవిష్కరించారు. యువతలో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాన్ని రాష్ట్ర భవిష్యత్ అవసరాల కోసం వినియోగించుకునేందుకు యూత్ సమ్మిట్ వంటివి దోహదమవుతాయని అన్నారు.

సిట్ ఎదుటకు పీఎల్ఆర్ ప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సిట్ అధికారుల ఎదుట విచారణకు పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఎండీ చెవిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శివారెడ్డి హాజరయ్యారు. మద్యం కేసులో మిథున్ రెడ్డి అరెస్టు తరువాత హాజరు కావాలని సిట్ నోటీసులతో ఇవ్వడంతో పీఎల్ఆర్ సంస్థ ప్రతినిధులు విచారణకు బుధవారం హాజరయ్యారు. ఈ కేసులో పీఎల్ఆర్ సంస్థ ఖాతాల్లోకి డబ్బు బదిలీ అయినట్లు వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. దీంతో సదరు ప్రాజెక్ట్స్ బ్యాంకు లావాదేవీలపై సిట్ అధికారులు ఆరా తీశారు. అటు ఎంపీ మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 5న వాదనలు ముగిశాయి. రెండు వైపులా వాదనలు విన్న ఏసీబీ కోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ నెల 12న బెయిల్ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేయనుంది. ఈ కేసులో ఏ4గా మిథున్ రెడ్డి ఉన్నారు.

9 మంది మావోయిస్టుల లొంగుబాటు

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా కేంద్రంలో బుధవారం రూ.24 లక్షల రివార్డు కలిగిన 9 మంది మావోయిస్టులు లొంగిపోయారు. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు సమష్టిగా మావోయిస్టుల ఏరివేతకు ముమ్మర చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో బీజాపూర్ జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారుల ఎదుట మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో ఒకటో నంబర్ కంపెనీ సభ్యుడు ఒకరు, 12వ ప్లాటూన్ కమాండర్ ఒకరు, 13వ ప్లాటూన్ (మాడ డివిజన్) కమాండర్, వస్తాడు డివిజన్ టెక్నికల్ టీం సభ్యులు ఒకరు, ఏరియా కమిటీ సభ్యులు ఇద్దరు, బూమ్ కాల్ మలేషియా సభ్యులు ఒకరు, కమాండర్ ఏరియా కమిటీ సభ్యులు ఒకరు... మొత్తం 9 మంది మావోయి స్టులు లొంగిపోయారు. వీరందరికీ ప్రభుత్వం నిర్ణయించిన రూ.24 లక్షల రివార్డు అందుతుందని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. దంతెవాడ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ కమల్లోచన్ కశ్యప్, బీజాపూర్ ఆర్‌పీఎఫ్ డీఐజీ బి.ఎస్.నేగి, ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ ఎదుట లొంగి పోయారు. ఈ కార్యక్రమంలో 199 బెటాలియన్ ఆనంద్ కుమార్, 85 బెటాలియన్ సునీల్ కుమార్ రాహి, 202 కోబ్రా దళ కమాండర్, 210 కోబ్రా దళ కమాండర్ అశోక్ కుమార్, అదనపు ఎస్పీలు చంద్రకాంత్ గోవర్న, ఉలాండన్, డిప్యూటీ ఎస్పీలు ఘనశ్యాం కాండే, తిలేశ్వర్ యాదవ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

బీజాపూర్ జిల్లాలోని గంగలూరు అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, భద్రతా దళాలకు బుధవారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు సమాచారం. మృతదేహంతో పాటు ఆయుధాన్ని, బ్యాగును, విప్లవ సాహిత్యాన్ని, వారి ఉపయోగించే వస్తువులను స్వాధీనపరచుకున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఏ ఉన్నతాధికారి ధ్రువీకరించలేదు.

సంక్షేమం... అభివృద్ధి

- రూ.189.62 కోట్లతో ఉచిత విద్యుత్
- చేనేత వస్త్రాలపై ఐదు శాతం జీఎస్టీ మినహాయింపు

విశాలాంధ్ర-సచివాలయం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నేతన్నల ఆశలు చిగురించాయి. చేనేత కార్మికులకు సంక్షేమ పథకాలు అందిస్తూనే... వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి... ఆర్థిక ఉన్నతికి దన్నుగా నిలుస్తోంది. రాష్ట్రంలో వ్యవసాయం తరవాత అత్యధిక మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. 2.50 లక్షల మంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారు. రాష్ట్రంలో 986 చేనేత సహకార సంఘాలు నేతన్నలకు ఉపాధి కల్పిస్తున్నాయి. చేనేత రంగం రూ.1,374 కోట్ల టర్నోవర్ కలిగి ఉంది. గత ప్రభుత్వ హయాంలో చేనేతలకు ప్రోత్సాహం అందకపోవడంతో ఉత్పత్తులకు మార్కెటింగ్ లభించలేదు. ఎంఎస్ఎంఈ పార్కుల్లో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు కేటాయిస్తున్నారు. రూ.10 వేల కోట్ల పెట్టుబడితో నూతన టెక్స్‌టైల్స్ పాలసీ తీసుకొచ్చింది. ఈ పాలసీ ద్వారా 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 11వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం, చేనేత వస్త్రాలపై ఐదు శాతం మేర జీఎస్టీ మినహాయింపు, త్రిఫ్ట్ నిధులు మంజూరు పథకాలకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుడుతున్నారు. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే పథకం గురువారం నుంచి అమలు కాబోతుంది. చేనేత దుస్తులపైనా ఐదు శాతం జీఎస్టీ మినహాయింపు పథకాన్ని ప్రారంభిస్తున్నారు. ఉచిత విద్యుత్ కోసం ఏడాదికి రూ.190 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించాల్సి వస్తోంది. జీఎస్టీ మినహాయింపునకు ఏడాదికి రూ.15 కోట్లను నేతన్నలకు చెల్లించాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకంతో మగ్గాలపై నేసే కార్మికులకు నెలకు రూ.1,233 చొప్పున ఏడాదికి రూ.14,956, మరమగ్గాలపై ఆధారపడిన వారికి నెలకు రూ.2,717 చొప్పున రూ.32,604 కోట్ల మేర లబ్ధి కలగనుంది. చేనేత కుటుంబాలకు త్వరలో ఆరోగ్య బీమా పథకం వర్తింప జేయడానికి ప్రణాళికలు రూపొందించింది. త్వరలో చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టింది.

50 ఏళ్లకే రూ.4 వేల పెన్షన్

ఏభై ఏళ్లు నిండిన నేతన్నలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందజేస్తున్నారు. 92,724 మందికి రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. ఈ ఏడాది జూన్ వరకూ రూ.545.50 కోట్లు నేతన్నల పెన్షన్ల కోసం చంద్రబాబు ప్రభుత్వం వెచ్చించింది. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాల బలోపేతానికి బ్యాంకు రుణాలు అందజేస్తోంది. గతేడాది 116 చేనేత సహకార సంఘాలకు రూ.40.87 కోట్లను జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా అందజేసింది. ఈ ఏడాది 110 సంఘాలకు రూ.37.75 కోట్లు రుణమివ్వడానికి నిర్ణయించింది. ప్రధాన మంత్రి చేనేత ముద్ర యోజన పథకం కింద నేతన్నలకు గతేడాది వర్కింగ్ కేపిటల్ నిమిత్తం రూ.33.25 కోట్లు అందించింది. 3,367 మంది నేతన్నలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల రుణ సదుపాయం కల్పించింది. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో జూన్ వరకు 294 మందికి రూ.2.57 కోట్లు మంజూరు చేసింది. ముడి పదార్థాల సరఫరా పథకం నూలు కొనుగోలుపై ప్రభుత్వం 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. సహకార సంఘాలకు, వ్యక్తిగతంగా పలువురు నేతన్నలకు రూ.164.24 కోట్ల విలువైన నూలును 15 శాతం సబ్సిడీపై ఇవ్వగా... దీనివల్ల రూ.24.63 కోట్ల మేర లబ్ధి కలిగింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 135 మంది స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ.13.50 లక్షల విలువైన నూలు కోసం ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున ప్రభుత్వం అందజేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.